ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

31-8-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 213 పేజీలు: 8+4 వెల: 6.50


**బిజెపిలో చేరిన మాజీ సిఎం చంపయ్ సోరెన్**

5లో

**మహిళా భద్రత చట్టాలు కఠినంగా అమలు: రాజ్‌నాథ్**

## దూకుతున్న బుల్డోజర్లు

### చెరువులు, నాలాల వద్ద అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన 'హైడ్రా'

### నగరంలోని రామ్‌నగర్‌లో కూలిన భవనాలు

### గట్టి పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేస్తున్న అధికారులు

### ఉద్రిక్తత.. బాధితుల ఆందోళన



శుక్రవారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో కూల్చివేతల దృశ్యం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 30 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరంలో 'హైడ్రా' ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. అక్రమ నిర్మాణాలు కనిపిస్తే చాలు విరుచుకపడుతోంది. చెరువు పరిధిలో ఉన్నా, నాలాపై ఉన్నా రంగంలోకి దిగుతూ కూల్చివేతలకు తెగబడుతోంది. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మించినభవనాలన నేలమట్టంచేస్తోంది హైడ్రా. ప్రస్తుతం ఈ టాపిక్ నగరంలోనే కాదు, రాష్ట్రం మొత్తం 'హాట్‌టాపిక్' అయింది. స్వపక్ష, ప్రతిపక్షం తేడా లేకుండా బుల్డోజర్లతో దూసుకుపోతున్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగిస్తూనేఉంది. తాజాగా శుక్రవారం ఉదయాన్నే రామ్‌నగర్‌లోని మణెమ్మ గల్లీలో నాలాలపై నిర్మించిన నిర్మాణాలను ధ్వంసంచేసింది. రామ్‌నగర్‌చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాలను ఆక్రమించి నిర్మించిన కొన్ని కట్టడాలను రెండురోజుల కింద హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు అక్రమం అని నిర్ధారించిన అనంతరం అధికారులు భారీ పోలీసుబందోబస్తు, >>2

# ఇక సరికొత్త పర్యాటకం



శుక్రవారం హైదరాబాద్‌లో టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న సిఎం రేవంత్. మంత్రి జూపల్లి

### హైదరాబాద్‌లో మరో జూపార్కు

### టిటిడి తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు

### అనంతగిరిలో నేచర్ వెల్నెస్ సెంటర్

### రామప్పగుడి ఆకృతిలో కీసరగుట్ట ఆలయం

### పర్యాటకులను ఆకర్షించే కొత్త పాలసీలు

### హెల్త్, ఎకో టెంపుల్ టూరిజంపై ప్రత్యేక ప్యాకేజి

### 'స్పీడ్' ప్రాజెక్టులపై సమీక్షించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అచ్చంగా టిటిడి అనుసరించిన తరహాలోనే బోర్డుకు స్వయం ప్రతిపత్తి,విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలని ఆదేశించారు. స్పీడ్(స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టీవ్ డెలవరీ) సమీక్షలో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమావేశమయ్యారు. యాదగిరిగుట్ట ఆలయ రాజ గోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు చాలా వరకు అర్ధంతరంగా ఉన్నాయని సిఎం అభిప్రాయపడ్డారు. అలా ఆగిపోవడానికి వీల్లేదని, ఇప్పటి వరకు ఏమేం అభివృద్ధి పనులు జరిగాయి,ఇంకా ఏమేం అసంపూర్తిగా



యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు చాలా వరకు అర్థంతరంగా ఉన్నాయి. అలా ఆగిపోవడానికి వీల్లేదు. ఇప్పటి వరకు ఏమేం అభివృద్ధి పనులు జరిగాయి,ఇంకా ఏమేం అసంపూర్తిగా ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందించండి.

- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్.

ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు. అక్కడికి వచ్చే భక్తుల సౌకర్యాలు, విడిది చేసేందుకు కాటేజీల నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అద్భుతంగా యాదగిరి గుట్టను తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రస్తుతం కీసరగుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా, అచ్చం అదే నమూనాతో కీసరగుట్ట ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అక్కడ ఉపయోగించిన శ్యాండ్ బాక్స్ టెక్నాలజీ జోలికి వెళ్లవద్దని ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో రామప్ప ఆలయ ఆకృతితో యథాతథంగా కీసర ఆలయం పునర్నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల >>2

## పేదల ఇళ్లపైకి బుల్డోజర్లా?

### ఖర్గేకు కెటిఆర్ బహిరంగ లేఖ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతి నిధి,హైదరాబాద్, ఆగస్టు30:** తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్యంగా మార్చవద్దని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఖర్గేకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం,చట్టం ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయతాన్ని మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారని ప్రస్తావించారు.

కాంగ్రెస్ అధినేత ఖర్గే మాటలను గుర్తు చేస్తూ ప్రశ్నించిన కెటిఆర్... చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల జీవితాలను ఆగం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ ఆ కుటుంబాలను నిరాశ్రయులు చేస్తున్నారని ఆక్షేపించారు. దీనికి మీ సమాధానం ఏమిటి? అని కెటిఆర్ సూటిగా ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోన 75 మంది పేదల ఇళ్లను తెల్లవారు జామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన ఘటనను 'ఎక్స్' వేదికగా ప్రస్తావించారు. మీ ప్రభుత్వం కూల్చేసిన 75 కుటుంబాల ఇళ్లలో 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవేనని తెలిపారు.

40 ఏళ్ల కిందట,20 ఏళ్ల క్రితం ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్న పేదల ఇళ్లను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండటం ఎంత అమానవీయమో ఖర్గే చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మరో బుల్డోజర్ రాజ్యం కాకుండా మీ పార్టీ ప్రభుత్వానికి సూచన చేయాలంటూ ఖర్గేకు కెటిఆర్ విజ్ఞప్తి చేశారు.

# 26కు 'దేవాదుల' పూర్తి

### ప్రాజెక్టు ఇంటెక్ పంప్‌హౌస్‌ను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క

### సమ్మక్క సాగర్ పురోగతిపై అధికారులతో సమీక్ష

### గోదావరి జలాలతో ఉమ్మడి వరంగల్లు, నల్లగొండ, కరీంనగర్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం: మంత్రి ఉత్తమ్



శుక్రవారం సమ్మక సాగర్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, అధికారులు

**ములుగు జిల్లా, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులపై అధికార కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ క్రమంలో శుక్రవారం ములుగుజిల్లాలో ఉన్న దేవాదుల ప్రాజెక్టును మంత్రులు సందర్శించారు. బేగంపేట విమానాశ్రయం నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ములుగు జిల్లా జె.చొక్కారావు దేవాదుల ప్రాజెక్టుకు చేరుకోగా రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరీష్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాదుల ఇంటెక్ పంప్ హౌస్‌ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతలో దేవాదుల ప్రాజెక్ట్ మార్చి 2026 నాటి పూర్తి చేసి ప్రారంభిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అనంతరం దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వద్ద దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్కతో కలసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీలతో శుక్రవారం ములుగుజిల్లా కన్నాయిగూడెం మండలం జై.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను సంబంధింత అధికారులను పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకోవడమే కాకుండా గోదావరి జలాల తరలింపు వారి నియోజక వర్గాల్లో నీటిపారుదలకు సంబంధించిన ప్రాజెక్టుల, కాలువల పెండింగ్ పరిస్థితులపై ఆయా శాసన సభ్యుల అభిప్రాయాన్ని తెలుసుకొని ఆయా ప్రాజెక్టులపై కూలంకషంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం.. ఉత్తంకుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖమంత్రి**

సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ దట్టమైన అటవీ ప్రాంతంలో సమీక్ష సమా వేశం నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. 2008 >>7

## భార్య, కుమార్తె భద్రతపై ఆందోళనగా ఉంది

### ఆధ్యాత్మిక భావనతోనే హైదరాబాద్ వచ్చా: రాబర్ట్ వాద్రా



హైదరాబాద్‌లో మీడియాతో రాబర్ట్ వాద్రా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** తన భార్య ప్రియాంక గాంధీ,కుమార్తె భద్రత విషయంలో అప్పుడప్పుడు ఆందోళనగా అనిపిస్తోందని రాబర్ట్ వాద్రా తెలిపారు. ముఖ్యంగా దేశంలో మహిళల భద్రత ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. మహిళలు భద్రంగా ఉండాలంటే వారితో ఎలా ప్రవర్తించాలో ఇంట్లో నేర్చుకోవాలని సూచించారు. ఆధ్మాత్మిక పర్యటనలోభాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రముఖ దేవాలయాల సందర్శనకు ఆయన విచ్చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు. మహిళలు తమకు భద్రత ఉందని భావించే రోజు రావాలని తాను ఆశిస్తున్నట్లు రాబర్ట్ వాద్రా తెలిపారు. రాహుల్‌గాంధీ తాను ఒకే విషయాన్ని మాట్లాడుతున్నామని, దేశంలోని సమస్యలను తాను,రాహుల్ ఒకే కోణంలో చూస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, మరో ఐదేళ్ల తర్వాత ఆ మార్పునకు ప్రజలు మద్దతుగా నిలుస్తారన్నారు. హైదరాబాద్‌కు వచ్చి పలు ఆలయాలను సందర్శించినట్లు వివరించారు.

## ఎఐసిసి సెక్రటరీలు

### తెలంగాణ, ఎపికి నలుగురు నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అఖిలభారత కాంగ్రెస్ అధినాయకత్వం ఎఐసిసి సెక్రటరీలను శుక్రవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ఎఐసిసి సెక్రటరీగా గణేష్ కుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా పలక్ వర్మ, తెలంగాణ ఎఐసిసి కార్యదర్శిలుగా పిసి విష్ణునంద, పి.విశ్వనాథన్ నియమించారు. ఆంధ్రప్రదేశ్ ఎఐసిసి సెక్రటరీ గణేష్ అండమాన్ నికోబార్ దీవులు కూడా ఎఐసిసి సెక్రటరీగా ఉంటారు. చత్తీస్‌ఘడ్ ఎఐసిసి సెక్రటరీగా సంపత్ కుమార్, సజరీతాలాయిత్‌పాలంగ్, జాయింట్‌సెక్రటరీ విజయ్, జార్కండ్‌కు సిరివెల్ల ప్రసాద్, గుజరాత్‌కు ఉషానాయుడు, తమిళనాడు-పుదుచ్చేరికి సూరజ్ హెగ్డెలను నియమించింది. అరుణచల్ ప్రదేశ్, >>2

## కొత్త కమిటీలు

### మరో 7 మార్కెట్ యార్డులకు పాలక వర్గాల ఏర్పాటు


### -వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డులకు దశల వారీగా నూతన కమిటీలను నియమిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్రం లోని మరో 7 మార్కెట్ యార్డులకు కొత్త >>2

## టమాటా రైతుల కన్నీళ్లు

### డిమాండ్ లేక రోడ్లపై పారబోత



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో గత కొన్ని రోజులుగా భారీగా పలికిన టమాటా ధరలు ఇప్పుడు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు కన్నీళ్ల పాలవుతున్నారు. పెట్టిన పెట్టుబడి కాదు కదా కనీసం కోసినందుకు కూలీలకు అయ్యే ఖర్చు, మార్కెట్లకు తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు కూడా రాకపోవడంతో కూడా రకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో డిమాండ్ లేక, రేటు రాక కష్టించి పండించిన పంటను గత్యంతరం లేక మార్కెట్లకు తెచ్చిన టమాటాలను రోడ్ల మీద పారబోస్తున్నారు. ఈ విధంగానే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతంలో దాదాపు 800 ఎకరాల్లో టమాటా సాగు చేశారు. వర్షాలతో దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పెద్ద >>2

# పోలీస్ 'ల్యాండ్స్' గల్లంతు!

- ప్రత్యామ్నాయం అంతంతమాత్రం!
- మొన్న పోలీసు అకాడెమీ, నిన్న ఫలక్‌నుమా, పేట్ల బుర్జు
- తాజాగా గోషామహల్ స్టేడియం
- కొత్త పోలీసు కేంద్రాలకు దిక్కేది?





శుక్రవారం గోషామహల్ స్టేడియంలో పరిశీలన చేస్తున్న కలెక్టర్ అనుదీప్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పోలీసు శాఖ భూములను ప్రభుత్వం ఇతర విభాగాలకు బదలాయిస్తుండడం వల్ల హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాలలో పోలీసు విభాగాలకు భూములు కరువవుతున్నాయి. దశాబ్దకాలం క్రితం శివార్లలోని హిమాయత్ సాగర్‌లో గల పోలీసు అకాడమికి చెందిన వందల ఎకరాలను అప్పట్లో అవుటర్ రింగు రోడ్డు కోసం కేటాయించగా ఆ తరువాత పాతబస్తీలోని ఫలక్‌నుమాలో పోలీసు విభాగానికి చెందిన స్థలం కబ్జాకు గురైనా సర్కారు పట్టించుకుండా ఆక్రమణలో వున్న వారికి పట్టాలు ఇవ్వడం సంచలనం రేపింది. దీనితరువాత పేట్లాబూర్జులో పోలీసు రవాణా విభాగానికి చెందిన స్థలంలో ప్రసూతి వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు సుధీర్ఘ చరిత్ర కలిగిన గోషామహల్‌లోని పోలీసు స్టేడియంలో 30 ఎకరాల స్థలంలో ఉస్మానియా జనరల్ ఆసుపత్రినిర్మాణానికి సర్కారు సన్నాహాలు చేస్తుండడంతో పాటు వీలైనంత త్వరలో స్టేడియంలో గల పోలీసు విభాగాలకు పేట్లాబూర్జుకు మార్చాలని ఆదేశాలు జారీచేసింది. గతంలో పోలీసు అకాడమి, ఆ తరువాత పేట్లా బూర్జుస్థలాన్ని బదలాయించిన సమయంలో >>2




శుక్రవారం శంషాబాద్‌కు చేరిన అతిపెద్ద విమానం -'2'లో



శుక్రవారం ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని మోడీ

# ఇక సరికొత్త పర్యాటకం

>> అభివృద్ధికి కొత్త విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని, వాటిలో మెరుగైనవి, మన రాష్ట్రానికి అనువుగా ఉన్న వాటిని అనుసరించాలని సూచించారు. టెంపుల్ టూరిజం,ఎకో టూరిజం,హెల్త్ టూరిజం అభివృద్ధికి విడివిడిగా పాలసీలను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో ఉన్న ప్రాచీన ఆలయాలు,చారిత్రక స్థలాలతో పాటు అటవీ ప్రాంతాలు,వైద్య సదుపాయాలన్నింటిని పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రవాణాతో పాటు వసతి,పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉండేలా కొత్త టూరిజం ప్యాకేజీలుండాలని చెప్పారు. కవ్వాల్,ఆమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కొన్ని చోట్ల రాత్రి విడిది ఉండే కాటేజీలను నిర్మించాలన్నారు. పర్యాటకానికి అనువైన ప్రాంతాలన్నీ గుర్తించి,వేటిని ముందుగా అభివృద్ధి చేయాలనేది టూరిజం,దేవాదాయ,అటవీ శాఖ అధికారులు కలిసికట్టుగా నిర్ణయించాలని చెప్పారు. కేవలం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే సరిపోదని,హరిత హోటళ్లు,వసతి గృహాలు నిర్మించి వదిలేస్తే సరిపోదని,నిరంతరం వీటి నిర్వహణ మెరుగ్గా ఉంటేనే పర్యాటకులను ఆకర్షిస్తాయని సిఎం అధికారులను అప్రమత్తంచేశారు. అందుకే కొత్తగా చేపట్టే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ ప్రేవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు. అటు ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరగాలని సిఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి జంతువులు,పక్షులను తీసుకువచ్చి కొత్త జూ పార్క్‌లో ఉంచాలని,అర్బన్ ఫారెస్టిని అభివృద్ధి చేయాలని చెప్పారు.జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ 3వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు,సంస్థలను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చెప్పారు.

అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉందని,అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో నేచర్ వెల్‌నెస్ సెంటర్ అక్కడ ఏర్పాటు చేయాలని చర్చించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని, ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీ వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చే వారికి వైద్య సేవలందించే వన్ స్టాప్ సొల్యూషన్ ప్యాకేజీలు రూపొందించాలని చెప్పారు.ఆన్‌లైన్‌లోనే అన్ని సేవల వివరాలను అందుబాటులో ఉంచాలని,నేరుగా ఎయిర్‌పోర్ట్ నుంచి హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్ల అపాయింట్‌మెంట్,ట్రీట్మెంట్ తీసుకునేలా సదుపాయాలన్నీ ఉండాలని సూచించారు. దేశంలోనే అందరి దృష్టిని ఆకర్శించేలా హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని అన్నారు.

**సిఎం సమీక్షలో పాల్గొన్న మంత్రి జూపల్లి,అధికారులు**

సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,టూరిజం ముఖ్యకార్యదర్శి శాంతికుమారి,పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్,దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్,దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా,ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దూకుతున్న బుల్డోజర్లు

>> వివిధ శాఖల అధికారులతో కలిసి కూల్చివేతలనుచేపట్టారు. ఇక్కడ విక్రమ్‌యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లుకాంపౌండ్ కొనసాగుతోందని, రోడ్డు, నాలాను ఆక్రమించి కొంతమంది అక్రమ కట్టడాలు నిర్మాణాలు చేపట్టడంతో తమ గల్లీలో వర్షపునీరు బయటకు వెళ్లడం లేదని, డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయడానికి మార్గం లేకపోవడంతో అనేక సంవత్సరాలుగా ఇబ్బందులుపడుతున్నామని మణెమ్మగల్లీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సి.మోహన్, సభ్యులు సతీష్, మనసీషా,సంధ్యారాణిలు స్థానికులు రెండురోజుల కింద హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదుచేయడంతో వెంటనే స్పందించిన రంగనాథ్ ఆదేశాల మేరకు యంత్రాంగంతో కలిసి అక్కడికిచేరుకుని పరిశీలించి తదుపరిచర్యలకు ఉపక్రమించాలని ఆదేశాలు జారీ చేయడంతో నేడు కూల్చివేతల పర్వం ప్రారంభమైంది.దీంతో టౌన్‌ప్లానింగ్ ఎసిపి దేవేందర్‌తో పాటు రెవెన్యూ అధికారులు ఆప్రాంతంలో ఇంటింటికి తిరిగి డాక్యుమెంట్లను పరిశీలించి నివేదికను హైడ్రా కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో వెంటనే రోడ్డు, నాలాను ఆక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. 50 గజాల ఇంటిని, విక్రమ్‌యాదవ్‌కు చెందిన 50 గజాలలో నిర్మించిన కల్లుకాంపౌండ్‌లోని కల్లునుపారబోసి సామాగ్రాని తొలగించి కూల్చివేతలు చేపట్టింది. దారి పక్కనే ఉన్న స్థలం ప్రహరీగోడలు, పక్కనేఉన్న వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్ యజమాని బాలరాజ్ గౌడ్ నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని కూల్చివేశారు. దీంతో హైడ్రా, జిహెచ్‌ఎంసి అధికారులకు బాధితులకు మధ్య తీవ్ర వాగ్వాదం ప్రతివాదనలు జరిగాయి. పోలీసులు అక్రమ కట్టడాల నిర్వాహకులను, బాధితులను దూరంగా తీసుకెళ్లి కూల్చివేతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదుచేసిన రెండు రోజులకే హైడ్రాచర్యలకు ఉపక్రమించడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయంనుండే కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. మణెమ్మగల్లీలో నాలాలను ఆక్రమించి నిర్మించిన అనధికార నిర్మాణాలను ఉన్నతాధికారుల ఆదేశాలను కూల్చివేశారు. ఉదయం ప్రారంభమైన కూల్చివేతలు సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగాయి. కూల్చివేతల్లో దాదాపు కోటి రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. కూల్చివేతలను టౌన్‌ప్లానింగ్ ఎసిపి దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ హాఫీజ్, హైడ్రా అధికారులు రోహిత్‌రెడ్డి, ముషీరాబాద్ పోలీసుస్టేషన్ సిఐ రాంబాబు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డిలతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో ఉద్రిక్తత...బాధితుల ఆందోళన**

రామ్‌నగర్‌చౌరస్తా మణెమ్మ గల్లీలో హైడ్రా, జిహెచ్‌ఎంసి అధికారుల కూల్చివేతల వల్ల స్థానికంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి.కూల్చివేతలను అడ్డుకునేందుకు బాధిత కుటుంబాలు ప్రయత్నించగా డిఆర్‌ఎఫ్, పోలీసు సిబ్బంది వారిని పక్కకు తీసుకెళ్లడం వంటి సంఘటనలతో ఉద్రిక్తత పరిస్తితులు ఏర్పడ్డాయి. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సమయం ఇవ్వకుండా కూల్చివేతలు జరిపితే తాము ఉన్నపలంగా ఎక్కడకు వెళ్లాలని బాధిత కుటుంబాలు, మహిళలు అధికారులను నిలదీశారు. వీరినిమహిళా పోలీసులు నివారించి కట్టడాల కూల్చివేతలను కొనసాగించారు. ఇదిలా ఉండగా గత నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల కుటుంబాలు ఉంటున్న ప్రాంతాలలోని ఇళ్లను ఎలా కూల్చివేస్తారని టౌన్‌ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

# న్యాయవ్యవస్థపై నాకు అత్యంత గౌరవం

## బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉందని,మరోసారి గట్టిగా చెపుతున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్ శుక్రవారం ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లుగా కొందరు ఆపాదించారు. ఆగస్ట్ 29న కొన్ని పత్రికలు రాసిన కథనలు... గౌరవనీయ న్యాయ స్థానం న్యాయపరమైన విజ్ఞతను ప్రశ్నిస్తున్నానే అభిప్రాయం తనపై కలిగేలా చేసిందనే విషయాన్ని అర్థం చేసుకోగలనని ఆయన చెప్పారు. మీడియాలో వచ్చిన కథనాలపట్ల తాను బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. తనకు సంబంధంలేదని వ్యాఖ్యలను తనకుఆపాదించారని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని దృఢంగా విశ్వసించే వ్యక్తిగా ఎన్నటికీ న్యాయవ్యవస్థను ఎప్పటికీ గౌరవిస్తూనే ఉంటానని రేవంత్‌రడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితక మంజూరైన బెయిల్‌కు సంబంధించి సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బిఆర్ గవాయి,జస్టిస్ కేవి విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రకటలను ఈరోజు పత్రికల్లో చదివాం,. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా ఇవి?మేం రాజకీయ పార్టీలను సంప్రదించో... లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా? అని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలపై తాను తాజాగా స్పష్టతనిచ్చారు.



శుక్రవారం భారీ వర్షాలకు గుజరాత్ వడోదర నిండా మునిగిన దృశ్యం

# శంషాబాద్‌కు చేరిన అతిపెద్ద విమానం

**శంషాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 30 :** ప్రపంచంలోనే అతిపెద్ద విమానాలలో ఒకటైన బిగ్ ఎయిర్‌బస్ విమానం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికిచేరుకుంది. శుక్రవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ఈ అతిపెద్ద విమానం శంషా బాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్‌అయింది. ప్రపంచంలోనే అతిపెద్ద విమా నాలలో ఒకటిగా గుర్తించబడిన ఈ విమానం విమానాశ్రయానికి చేరుకోగానే సంబంధింత అధికారులు స్వాగతం పలికారు. ఈవిమానం శనివారం మూడుగంటలకు థాయిలాండ్‌కు బయలుదేరి వెళ్లింది.

# పాలక వర్గాల ఏర్పాటు

>> కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వీటితో కలిపి ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 39 వ్యవసాయ మార్కెట్ యార్డులకు నూతన పాలకవర్గాలను నియమించినట్లుయిందని చెప్పారు. జిల్లా కేంద్రం మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు, జగిత్యాల జిల్లాలోని వెలగటూరు, కమారెడ్డి జిల్లాలోని గాంధరి, సదాశివనగర్, ఎల్లారెడ్డి మార్కెట్ యార్డులు, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులకు నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఇతర పాలకవర్గ సభ్యులను నియమించినట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా టెక్కరి అనితారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా గడుగు విజయ్‌కుమార్, వెలగటూరుకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా గుండటి గోపిక, గొల్ల తిరుపతిరావు, గాంధరికి బండారి పరమేశ్వర్, ఆకుల లక్ష్మణ్, సదాశివనగర్‌కు మాలోతు సంగ్య, జక్కుల రాజారెడ్డి, ఎల్లారెడ్డికి మారెడ్డి రజిత, జొన్నల రాజు, నేలకొండపల్లికి వెన్నపూసల సీతారాములు, కొండపర్తి సురేష్, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ట్రైరు హరనాథ్‌బాబు, వనవాసం నరేంద్రర్‌రెడ్డిని నియమించినట్లు ఆయన వివరించారు.

# నలుగురు నియామకం

>> అసోం, బీహర్, గోవా,హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ,లక్షదీప్, మహారాష్ట్ర, మణిపూర్,నాగాలండ్,త్రిపురా సిక్కిం, ఉత్తప్రదేశ్, ఉత్తరఖండ్ పశ్చిమబెంగాల్ డిల్లీ, జమ్ముకాశ్మీర్ ఒడిస్సా రాజస్థాన్,పంజాబ్‌లకు కొత్తగా ఎఐసిసి సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలను నియమిస్తూ ఉత్తర్వులు కెసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. సంపత్‌కుమార్ గతంలో గుజరాత్ ఎఐసిసి కార్యదర్శిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ ఎన్ఎస్‌యుఐనుంచి కాంగ్రెస్ భావాజాలంతో రాజకీయంగా తన ప్రస్థానం కొనసాగిస్తూ అలౌకిక రాజకీయవిధానలపై నిరంతరం పోరాటంచేస్తు ప్రజల్లో శాస్త్రీయభావాలు పెంపొదిస్తున్నారు.

# డిమాండ్ లేక రోడ్లపై పారబోత

>> మొత్తంలో టమాటాలను మార్కెట్లకు తెస్తున్నారు. చేవెళ్ల మార్కెట్‌లో నెల రోజుల క్రితం 25 కిలోల టామాటా బాక్స్ ధర 2 వేల రూపాయలు ఉండగా, గురు, శుక్రవారాల్లో 100 నుండి 250 రూపాయలు మాత్రమే ధర పలికింది. దీంతో కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో మార్కెట్లకు తెచ్చిన టమాటాలను రైతులు రోడ్డు పక్కన పారబోసి వెళ్లిపోయారు.

THE GOVERNMENT OF BODOLAND
Results of 30/08/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:9
1st Prize Rs.100000/- 958366
2nd Prize Rs.7000/- 46826
[illegible]

SINGAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 234751
2nd Prize Rs.7000/- 52273
[illegible]

KUIL SERIES Dr No:9
1st Prize Rs.100000/- 161227
2nd Prize Rs.7000/- 43165
[illegible]

ROSA SERIES Dr No:9
1st Prize Rs.100000/- 553337
2nd Prize Rs.7000/- 23013
[illegible]

DEAR SERIES Dr No:9
1st Prize Rs.100000/- 629611
2nd Prize Rs.7000/- 56363
[illegible]

THANGAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 971546
2nd Prize Rs.7000/- 34336
[illegible]

THE GOVERNMENT OF BODOLAND
Results of 30/08/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:9
1st Prize Rs.100000/- 394847
2nd Prize Rs.7000/- 93260
[illegible]

NALLANERAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 997926
2nd Prize Rs.7000/- 33365
[illegible]

KUMARAN SERIES Dr No:9
1st Prize Rs.100000/- 133948
2nd Prize Rs.7000/- 70240
[illegible]

VISHNU SERIES Dr No:9
1st Prize Rs.100000/- 842655
2nd Prize Rs.7000/- 24744
[illegible]

SWARNALAXMI SERIES Dr No:9
1st Prize Rs.100000/- 952334
2nd Prize Rs.7000/- 63806
[illegible]

LION SERIES Dr No:9
1st Prize Rs.100000/- 351118
2nd Prize Rs.7000/- 84101
[illegible]

# వేములవాడ ఆలయ విస్తరణకు రూ.50 కోట్లు

## సిఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు30:** వేములవాడ ఆలయ విస్తరణకు బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములవాడ ఆలయ అర్చకులు, అధికారులు శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌కు ఆశీర్వచనం అందించారు. సిఎంను కలిసిన వారిలో ఆలయ ఇఒ వినోద్, స్థపతి వల్లినాయగం, ఇఇ రాజేశ్, డిఇఇ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ,తదితరులు ఉన్నారు.

ఆలయ విస్తరణకు సంబంధించిన డిజైన్స్, నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉందని ఆలయ అర్చకులు సిఎంకు తెలిపారు. వెంటనే వెళ్లి శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

# పోలీస్ 'ల్యాండ్స్' గల్లంతు!

>> ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి ఇస్తామని చెప్పినా ఎలాంటి కేటాయింపులు జరగలేదు. దీనిపై పో లీసు శాఖలో పలువురు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర పోలీసు శాఖకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వేల ఎకరాల భూములు వున్నాయి. వీటిలో పోలీసు స్టేషన్లు, జిల్లా పోలీసు కార్యాలయాలు, పోలీసు బెటాలియన్లు వంటివి వుండడం తెలిసిందే. ఇతర ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్‌తో పాటు శివార్లలో పోలీసు శాఖ భూములను ప్రభుత్వం కొన్నేళ్లుగా వేరే అవసరాలకు కేటాయి స్తుండడం పెరిగిపోతోంది. తెలంగాణ ఏర్పాటైన తరువాత మొదట పేట్లాబూర్జులో పోలీసు భూమిని వైద్యశాలకు కేటాయించగా ఇప్పుడు గోషామహల్ స్టేడియంలో ఉ స్మానియా ఆసుపత్రి నిర్మించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. దీనివల్ల పోలీసు విభాగాలకు స్థలాల కొరత తీవ్రమవుతోంది. గతంలో పోలీసు భూములను ఇతర విభాగాలకు బదలాయింపుపై ఉన్నతాధికారులు సర్కారును ఒప్పించడంలో సఫలమైన ఉదంతాలు వున్నాయి. రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ 1980 దశకంలో ఏర్పాటవగా ఈ స్టేషన్ కోసం అప్పట్లో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలోనే పోలీసు స్టేషన్, అప్పట్లో వుండే సర్కిల్ కార్యాలయం, డిఎస్‌పి కార్యాలయం, పోలీసుల కోసం క్వార్టర్స్‌ను నిర్మించి మరికొంత స్థలాన్ని భవిష్యత్ అవసరాల కోసం ఖాళీగా వుంచారు. అయితే 1997 ప్రాంతంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో కోసం పోలీసు స్టేషన్ పక్కనే వున్న చిన్నపాటి గ్రౌండ్‌ను కేటాయించగా తమ అవపరాలకు మరింత స్థలం కావాలని ఆర్టీసీ అధికారులు సర్కారును కోరారు. దీంతో పోలీసు స్టేషన్ పక్కనే గల ఖాళీ స్థలంలో రాళ్లు పాతారు. దీనిపై అప్పటి రాజేంద్రనగర్ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్థలం మీకు ఇచ్చేస్తే భ విష్యత్తులో పోలీసు స్టేషన్‌తో పాటు మరిన్ని కేంద్రాలు వస్తే ఎలా అని అడిగారు. ఇదే విషయాన్ని అప్పటి రంగారెడ్డి జిల్లా ఎస్‌పి నర్సయ్య సర్కారు దృష్టికి తేవడంతో పోలీసు స్టేషన్‌కు చెందిన కొంత స్థలం మినహా మిగతా అంతా పోలీసు శాఖకు మిగిలింది. ఈ స్థలంలోనే ఇప్పుడు ట్రాఫిక్ ఎసిపి, కార్యాలయం, ఎసిపి కార్యాలయం, అధునాతన పోలీసు స్టేషన్, సిసిఎస్ ఏర్పాటయ్యింది. అయితే ఇలా అన్నిచోట్ల జరగడం లేదు. హిమాయత్‌సాగర్‌లోని పోలీసుఅకాడమి గురించే చెబితే ఉమ్మడి ఎపి హయాంలో అకాడమికి చెందిన వందల ఎకరాలను ఓఆర్‌ఆర్‌కు కేటాయించడంతో ఈ అకాడమి రెండుగా చీలిపోయింది. దీనికి బదులు పక్కనే గల అటవీ శాఖ నుంచి భూములు ఇప్పిస్తామని సర్కారు చెప్పినా ఇది ఇప్పటి వరకు జరగలేదు. దీంతో పోలీసు అకాడమిలో ఇప్పుడు స్థలం కొరత తీవ్రంగా వుంది. దీని తరువాత ఫలక్‌నుమాలో పోలీసు విభాగానికి దశాబ్దాలుగా వున్న స్థలాన్ని కొందరు ఆక్రమించారు.

దీనిపై 1990 నుంచి వివాదం నడుస్తున్నా ఎవరు పట్టించుకోలేదు, చివరకు 2005 తరువాత ఆక్రమణలకు క్రమబద్ధీకరించారు. దీనికి బదులుగా మరోచోట స్థలం ఇస్తామన్నా ఆచరణలో అమలుకాలేదు. దీని తరువాత పేట్లాబూర్జులో పోలీసు రవాణా శాఖకు విశాలమైన మైదానం వుండేది. ఈ స్థలంలో పోలీసు రవాణా శాఖకు వచ్చే పోలీసు వాహనాలను వుంచేవారు. ఈ స్థలంలో ప్రభుత్వ ప్రసూతి వైద్య శాలను నిర్మించారు. దీనికి బదులుగా మరోచోట స్థలం ఇస్తామని సర్కారు చెప్పినా ఇది అమలు కాలేదు. ఇక తాజాగా గోషామహల్ స్టేడియం వంతు వచ్చింది. 30 ఎకరాల ఈ ప్రాంతంలో పోలీసు శాఖ ట్రాఫిక్ అవసరాలకు, ట్రాఫిక్ శిక్షణకు, పోలీసుల పరేడ్‌కు వాడుకుంటోంది. ఇదే ప్రాంతంలో హైదరాబాద్ కమిషనర్‌గా మొదటి ఐపిఎస్ అధికారిగా పనిచేసిన శివకుమార్‌లాల్ పేరిట ఓఫుట్‌బాల్ స్టేడియంకూడా వుంది. హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోలీసు క్రీడలన్నీ ఇక్కడే జరుగుతాయి. అనేక జాతీయ స్థాయి పోటీలకు కూడా ఇది వేదికయ్యింది. ఈ ప్రాంతంలో ఇప్పుడు ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని సర్కారు భావిస్తోంది. ఈ ప్రాంతంలోని పోలీసు విభాగాలను పేట్లాబూర్జుకు తరలించాలని సర్కారు ఆదేశించడంతో దీనికి సంబంధించిన పనులను వేగంగా చేయడంలో అధికారులువున్నారు. మరికొన్ని రోజుల్లో గోషామహల్ పోలీసు స్టేడియం కాస్త ఉస్మానియా ఆసుపత్రిగా మారనుంది. అసలే ఇరుకుగా మారిన పేట్లాబూర్జులోని సాయుధ బలగం ప్రధాన కార్యాలయంలో కొత్త విభాగాలు రావడంతో మరింత ఇరుకుగా మారనున్నాయి. పోలీసుశాఖకు చెందిన భూములను ప్రభుత్వం వేరేఅవసరాలకు వాడడంపై విశ్రాంత అధికారులు అభ్యం తరం తెలిపారు. ఇలాచేస్తే భవిష్యత్తులో పోలీసు అవసరాలకు భూములు ఎక్కడి నుంచి తెస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 31-08-2024, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
శ్రావణమాసం, దక్షిణాయనం,
వర్షఋతువు, కృష్ణపక్షం,
త్రయోదశి రా.3.41
పుష్యమి రా.7.39
వర్జ్యం తె.2.29-4.12,
దు.ఉ.6.00-7.40
శుభసమయం : ఉ.7.50-8.30,
సా.6.00-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** పట్టుదలతో ముందుకు సాగుతారు. నూతన వ్యాపారాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు.

**వృషభం:** సంతానం అప్రయత్న కార్య సిద్ధి పొందుతారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మిథునం:** కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆప్తులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**సింహం:** సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టులు దక్కించుకొంటారు.

**తుల :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**ధనుస్సు:** రుణాలు తీరి ఊరట చెందుతారు. నూతన అవకాశాలు పొందుతారు.

**మకరం:** సోదరుల నుండి ఆహ్వానాలు అందుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** విద్యార్థులకు, నిరుద్యోగులకు అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# శరవేగంగా సికిందరాబాద్ స్టేషన్ ఆధునీకరణ

## విమానాశ్రయంలా రైల్వే స్టేషన్ అభివృద్ధి

## 2025లోగా పునర్నిర్మాణం పూర్తి

## రూ. 700 కోట్లతో త్వరితగతిన పనులు

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 30, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సికిందరాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పునరాభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా దశలవారిగా రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు చేపడుతున్నారు. రాబోయే 40 యేళ్ల వరకు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మౌళిక సదు పాయాల కల్పనకు రైల్వే శాఖ అభివృద్ధి పనులను చకచకా చేపడుతున్నారు. గత ఏప్రిల్ 8న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రైల్వేశాఖ సహాయ మంత్రి రవణీత్ సింగ్, దక్షిణ మధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

తక్కువ సమయంలో ఇప్పటికే 27 శాతం పనులను పూర్తిచేశారు. ఈ ప్రాజెక్టును 2025 చివరి నాటికి పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. వేగంగా నిర్ధారిత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ స్టేషన్ సుమారు రూ.700 కోట్లతో పునరాభివృద్ధి చేయబడి ఆధునిక నిర్మాణం, ప్రపంచ స్థాయి ప్రయాణికుల సౌకర్యాలు అందించనున్నారు. ఈ ప్రాజెక్టు విమానాశ్రయాలతో సమానంగా తీర్చిదిద్దుతామని ఇప్పటికే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రవణీత్‌సింగ్ పేర్కొన్నారు.

**స్టేషన్‌లో 26 లిఫ్టులు ఆధునిక సౌకర్యాలు**

పునరాభివృద్ధి చేస్తున్న ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, 2 ట్రావెలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం తూర్పు, పశ్చిమ మెట్రో స్టేషన్‌లతోలపాటు బస్‌స్టేషన్‌కు మల్టీమోడల్ కనెక్టివిటీ కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. విశాలమైన రూఫ్ ప్లాజా, ఫలహార శాలలు, వినోద సౌకర్యాలు, రిటైల్ దుకాణాలు ప్రధానంగా స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు.



కొనసాగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులు

**ఐకానిక్ స్టేషన్ భవనం**

40 నుంచి 60 సంవత్సరాల మన్నికకు అనుగుణంగా డిజైన్ చేశారు. విశాల మైన రూఫ్ ప్లాజా, రెండు వైపులా భవనాలు, అన్ని ప్లాట్‌ఫాంలను అనుసంధానించే వినోద సౌకర్యాల ఏర్పాటు. ప్రయాణికుల రద్దీ సాఫీగా సాగేందుకు తగిన పార్కింగ్ సౌకర్యాలు. విడివిడిగా ప్రయాణికుల రాకపోకలకు ద్వారాల ఏర్పాటు. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు. భద్రత కోసం సీసీ టీవిల ఏర్పాటు. సౌరశక్తి, నీటీ సంరక్షణ, రీసైక్లింగ్ వంటి ఏర్పాట్లు చేస్తున్నారు.

# జమ్మూకాశ్మీర్ ఓటర్లు వేర్పాటువాదమా? అభివృద్ధా?

### రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** కశ్మీర్ ఒకప్పుడు ఏర్పాటు వాదం, ఉగ్రవాదానికి కేంద్రంగా ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మూలో విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌ను భవిష్యత్తులో అంధకారంలోకి నెట్టేందుకు కుట్ర జరుగుతుందన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారో అందరికి తెలుసునన్నారు. వారి కుట్రలను బిజెపి ఓడిస్తుందన్నారు. యువత ప్రయోజనాల కోసం మా పార్టీ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎన్‌సి ఉపాధ్యక్షులు ఒమర్ అబ్దుల్లా మధ్య పొత్తులో తీవ్రవాదం ఏర్పాటు వాదాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలతో సంప్రదింపులు జరిపి జమ్ముకశ్మీర్ కోసం బిజెపి మేనిఫెస్టోను సిద్ధం చేస్తుందన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సాధికాతర కల్పించాలని బిజెపి భావిస్తుందన్నారు. మేనిఫెస్టోలో మహిళలు, రైతులు, పేదలు అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నది మా ప్రాధాన్యత అన్నారు. వలస వచ్చిన కశ్మీర్ పండిట్లహక్కులను పునరుద్ధరించడం కూడా పార్టీ ఏజెండాలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ ఎన్నికలు పాకిస్టాన్ డిజైన్‌లు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జనిగిన మిషన్ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తరువాత మొదటి అసెంబ్లీ ఎన్నికలు అన్నారు.

# శుక్రవారం నమాజ్‌కు ఇచ్చే రెండు గంటలు బ్రేక్ రద్దు

### అసోం సిఎం హిమంతబిశ్వశర్మ ప్రకటన



**దిస్పూర్, ఆగస్టు 30:** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతి శుక్రవారం రెండుగంటల పాటు ఇచ్చే నమాజ్ విరామం రద్దుచేస్తున్నట్లు శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. సభా కార్యక్రమాల ఉత్పాదకతను పెంచడంతోపాటు వలసకాలం నాటిపద్ధతులను తొలగించేందుకు ఈనిర్ణయం ప్రకటించామని ఆయన అన్నారు. కాలం చెల్లిన జుమ్మా విరామాన్ని రద్దుచేసేందుకు మద్దతు ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్ ఇతర శాసనసభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం అనుసరించే రెండు గంటల విరామ సమయాన్ని 1937లో ముస్లిం లీగ్‌కు చెందిన సయ్యద్ సాదుల్లాప్రవేశపెట్టారు. కాగా ఇందుకు ముస్లిం వివాహాలు, విడాకులను తప్పనిసరిగా రిజిస్టర్‌చేయాలనే బిల్లును కూడా హిమంత్‌బిశ్వశర్మ ప్రభుత్వం ఆమోదించారు. ఈ బిల్లుతో కాజీ వ్యవస్థ రద్దుకావడంతోపాటు బహుభార్యాత్వం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందని బాలికల అభ్యున్నతికి దోహద పడుతుందని సీఎం చెప్పారు. శుక్రవారాల్లో ముస్లిం శాసనసభ్యులు నమాజ్‌చేసుకునేందుకు ఉద్దేశించిన రెండు గంటలు విరామాన్ని అసోం ప్రభుత్వం రద్దుచేయడాన్ని బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి ఆర్జేడి నేత తేజస్వియాదవ్ తప్పుపట్టారు. ముస్లింలను లక్ష్యంగాచేసుకుని చీప్ పాపులారిటీకోసం అసోం సిఎం ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు విమర్శించారు.

# యుపిఎస్ వద్దు.. పాత పెన్షన్ విధానమే కావాలి

### ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్ పెన్షన్ విధానాన్ని తీసుకువస్తామని ప్రకటించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జెఏసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. సీపీఎస్, యూపీఎస్ రెండూ వద్దనీ, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జేఏసి భవిష్యత్తు కార్యాచరణ, విస్తరణ, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు తెలంగాణలోని 33 జిల్లాలలోని అన్ని శాఖల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘాల నాయకులతో ప్రత్యక్షంగా సమావేశం కానున్నట్లు వెల్లడించారు. కొత్తగా కేంద్రం తెస్తామన్న యూపీఎస్, ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సీపీఎస్ ఈ రెండు పెన్షన్ విధానాలు వద్దనీ, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరేందుకు జేఏసీ ప్రతినిధులు శనివారం ప్రజా భవన్‌కు వెళ్లి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రాములు, రామకృష్ణ, గోపాల్, రమాదేవి, దర్శన్, కత్తి జనార్ధన్, ప్రగతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో 12వేల మొక్కలు నాటడం లక్ష్యం

### వనమహోత్సవంలో టిటిడి ఇఒ,అదనపు ఇఒ



**తిరుమల,ఆగస్ట్ 30ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంఅడవుల్లోని సప్తగిరులపై 12వేల మొక్కలు నాటడం లక్ష్యంగా తీసుకున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. టిటిడి అటవీవిభాగం పరిధిలో 2వేలు, రిజర్వుఫారెస్ట్ ప్రాంతం లో 12వేల మొక్కలు నాట నున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న "వనమహోత్సవం" కార్యక్రమంలో శుక్రవారం ఉదయం తిరుమలలోని హరి సదన్ వద్ద మానుసంపంగి స్థలవృక్షం మొక్కలు టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నాటారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ తిరుమలలో "సీడ్ బౌల్ కాన్సెప్ట్"ద్వారాఆదునిక సాంకేతికతను ఉపయోగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. టిటిడి ఆయుర్వేద కళాశాల,ఆస్పత్రి ఉన్నందున ఈ సంస్థలకు అవసరమైన ఔషధమొక్కలను ప్రత్యేకంగా తిరుమలలోని కాటేజీల సమీపంలో అభివృద్ధి చేస్తామన్నారు. తిరుమలలో టిటిడి అటవీశాఖ ఆద్వర్యంలో వందలాదిమానుసంపంగి,చందనం,సీతా అశోక మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిసిఎఫ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇఒలు భాస్కర్, ఆశాజ్యోతి,ఆరోగ్యఅదికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి రూ. పదివేల కోట్లు

### హైదరాబాద్ భద్రతలో ప్రైవేటు భాగస్వామ్యంపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హర్షం




బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్‌లో జరిగిన నేషనల్ ఫిజికల్ సెక్యూ రిటీ 2024 సమ్మిట్‌లో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క. చిత్రంలో కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** హైదరాబాద్ భద్రతలో ప్రైవేటు భాగస్వామ్యంపై డిప్యూటీసిఎం మల్లు భట్టివిక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి పదివేల కోట్ల రూపాయలను కేటాయించామని, ఇది గతంలో జరిగిన కేటాయింపులకన్నా అధికమని ఆయన అన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ ఆడిటోరి యంలో శుక్రవారం హైదరాబాద్‌సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ 2024 సమ్మిట్‌ను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైన యాంటి నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూ రిటీ బ్యూరో విభాగాలు మరింత బలోపేతం అయ్యేందుకు ఎక్కువ నిధులు ఇచ్చామని తెలి పారు. ఈ రెండు విభా గాలు బలోపేతం అవడం వల్ల మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు వీలుంటుందని, ఇదే సమయంలో సైబర్ నేర గాళ్ల భరతం పట్టేందుకు అవకాశం వుంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో భద్రత విష యంలో ప్రైవేటు సెక్యూ రిటీ సంస్థల పాత్ర ఆమో ఘంగా ఉందని ఆయన కొనియాడారు. పోలీసుల వద్ద వున్న గణాంకాల ప్రకారం 15 వేల ఏజెన్సీల ద్వారా నాలుగు లక్షల మంది సెక్యూరిటీ గార్డులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థల్లో గార్డులుగా పని చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో వున్న హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ నగర భద్రతకు తీసుకుంటున్న చొరవను మంత్రి ప్రశం సించారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అనేక అంశాలపై చేబట్టిన కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని ఆయన కొనియాడారు. ఇక ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలకు మంత్రి భట్టి విక్రమార్క కీలక సూచనలు చేశారు. నిరుద్యోగులను భర్తీ చేసుకుని వారికి కొంతమేర శిక్షణ ఇచ్చిన తరువాత ఉద్యోగాల్లో చేర్చుకుంటున్న తీరు బాగానే వుందని, అయితే వారికి ఒప్పందం మేర కు వేతనాలు ఇవ్వాలని కోరారు. భద్రత విష యంలో పోలీసు విభాగం ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు కలిసి పనిచేయాలని, రాష్ట్రం ఈ విషయంలో దేశంలోనే రోల్ మాడల్‌గా నిలవాలని ఆయన సూచించారు. హైదరాబాద్ నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రాబో యే రోజుల్లో అనేక రంగాల్లో కొత్త పరిశ్రమలు రానున్న నేపథ్యంలో భద్రత కీలకంగా మారనుందని మంత్రి అన్నారు. ఈ క్రమంలో పోలీసు విభాగం ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రైవేటు సె క్యూరిటీ సంస్థలు కూడా టెక్నాలజిని అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. కాగా సాయంత్రం జరిగిన ముగింపు వేడుకల్లో ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో అనేక ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థలకు ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు అందిస్తున్న భద్రతను కొనియాడారు. కార్యక్రమంలో సిటీ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితోపాటు అదనపుకొత్వాల్ విక్రంసింగ్‌మాన్ హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కల్నల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలి



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజ లు సుఖ సంతో షాల తో ఉండాలని వేడుకు న్నట్లు తెలంగాణ ఎంపి జి.నగేశ్ తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాల న్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఐపి బ్రేక్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎపి మీదుగా తూర్పుకు పండుగ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 30 ప్రభాతవార్త** రానున్న పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సౌకర్యార్థం రైల్వే శాఖ తూర్పు ప్రఖ్యాత పట్టణాలైన విశాఖపట్నం-చెన్నై-విశాఖపట్నం మధ్య హుబ్లీ-షాలిమార్-హుబ్లీల మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపడంతోపాటు, మరిన్ని రైలు సర్వీసులను పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖపట్నం నుంచి చెన్నై ఎగ్మోర్‌ల మధ్య తిరిగే నెంబర్ సెప్టెంబర్ 07 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి శనివారాల్లో సాయంత్రం 7:00 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8:45 గంటలకు చెన్నై ఎగ్మోర్‌కు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో చెన్నై ఎగ్మోర్ నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08558 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 08 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10:30 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుంచి బయల్దేరి, అదే రోజు రాత్రి 10:35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గ మధ్యంలో దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో నిలుస్తాయి.

**హుబ్లీ-షాలిమార్-హుబ్లీ ప్రత్యేక రైళ్లు :** హుబ్లీ నుంచి షాలిమార్ వె ళ్లే ప్రత్యేక రైలు సెప్టెంబర్ 07 నుంచి నవంబర్ 09 వరకు ప్రతి శనివారాల్లో రాత్రి 9:35 గంటలకు హుబ్లీ నుంచి బయల్దేరి, బళ్లారి 02:10/15, విజయవాడ ఆదివారం మధ్యాహ్నం 12:25/35, భద్రక్ సోమవారం తెల్లవారుజామున 4:38/40, షాలిమార్‌కు అదే రోజు ఉదయం 10:00 గంటలకు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో షాలిమార్ నుంచి హుబ్లీ వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 09 నుంచి నవంబర్ 11 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12:15 గంటలకు బయల్దేరి భద్రక్ సాయంత్రం 4:38/40, విజయవాడ మంగళవారం ఉదయం 7:45/55, బళ్లారి సాయంత్రం 6:45/50, హుబ్లీకు అదేరోజు రాత్రి 11:55 గంటలకు చేరుకుంటుంది.

**పలు రైళ్ల పొడిగింపు :** విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వె ళ్లే నెంబర్ 08579 ప్రత్యేక రైలు సర్వీసును సెప్టెంబర్ 04 నుంచి నవంబర్ 27 వరకు, సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08580 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 05 నుంచి నవంబర్ 28 వరకు పొడిగించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 08583 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 02 నుంచి నవంబర్ 25 వరకు పొడిగించారు.

తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08584 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 03 నుంచి నవంబర్ 26 వరకు పొడిగించామన్నారు. పొడిగించిన ఈ రైళ్లు మార్గ మధ్యంలో ప్రస్తుతం నిలుస్తున్న రైల్వే స్టేషన్‌లలో యధావిధిగా నిలుస్తాయని రైల్వే వర్గాలు తెలిపాయి.

# విఘ్నేశ్వరుని పండగకు సిద్ధమౌతున్న శ్రీకాళహస్తి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకు సిద్ధమౌతుంది. సెప్టెంబర్ 7న జరిగే ఉత్సవాలకు దక్షిణ కైలాసం చక్కగా ముస్తాబౌతుంది. శ్రీకాళహస్తిలోని మూల మూలల్లోనూ, నాలుగుమాడావీధుల్లోనూ వినాయచవితి సంబరాలకు భారీ ఎత్తున వినాయక చవితి సంబరాలు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. శ్రీకాళహస్తి పట్టణంలో హైదరాబాదు తరహాలో వినాయక చవితి సంబరాలు భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించుటకు ఉత్సాహం చూపుతున్నారు. ఏర్పాట్లలో యువకులు చురుగ్గా చందాలు వసూలు చేసుకూంటూ ఏర్పాట్లలో తలమునలకయ్యారు. పరిచయాలున్న చోట్లల్లా వసూలు చేసుకుంటున్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అంతేకాక పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో దేవస్థానమే నెల నెలా ఒక్కొక్క ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ పండగలకు సంబంధించి ఈ తరం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత 25 సంవత్సరాలుగా వినాయకచవితి సంబరాల్ని హైదరాబాదును మరిపించే విధంగా నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం,పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటిలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తు న్నారు. చవితి సంబరాలు 5 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అంతేకాక పట్టణంలోని సుమారు వంద చోట్ల వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు,ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ప్రైవేటు వ్యక్తులు తాము వసూలు చేసిన మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అంతేకాక పట్టణంలో నెలకొన్న పరిస్థితి దృష్ట్యా గతంలో 'వినాయక చవితి సంబరాల నిర్వహణ' కమిటి ఏర్పాటు చేశారు.

# సహజ వనరుల పునరుద్ధరణ కోసమే హైడ్రా

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను రక్షించుకోకపోతే పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. నదులు, చెరువులు, వాగులు, అడవులు ప్రతీది మానవాళి మనుగడకు అవసరమైనదే అని ఆయన అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో జరిగిన గృహ పర్యావరణ సంస్థ నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు.

మనం సాధించిన అభివృద్ధితో పాటు జీవావరుణానికి అపార నష్టం జరుగుతోందని ఇప్పటికే ప్రపంచ దేశాలన్ని గుర్తించాయన్నారు. వేగంగా జరుగుతున్న పర్యావరణ మార్పులను నియంత్రించేందుకు వ్యక్తిగత స్థాయిలో, ప్రభుత్వ పరంగా నియంత్రణ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. చెరువులు, వర్షపు నీటి నాలాలు, నదులను కాపాడేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం హైడ్రా విభాగాన్ని ఏర్పాటు చేసి దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోందని వెల్లడించారు. నాలాలు, చెరువులు, ఆక్రమణలకు గురికావడం వల్ల వరద నీటి ముంపు సమస్య తలెత్తుతోందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తేఈ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చి పరిస్థితి చేయిదాటి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఫ్యూచర్ సిటీ అత్యాధునిక టెక్నాలజీతో కార్బన్ రహిత నగరంగా రూపొందుతుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీఇ సహకారం అందించాల్సిందిగా మహీంద్ర యూనివర్సిటీని కోరామని గృహ సంస్థ కూడా చేతులు కలిపి పర్యావరణహిత నగరానికి దోహదపడాలని మంత్రి పిలుపునించ్చారు. ఇదంతా కొత్త ఉద్యోగాల సృష్టికి, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. నవోదయ విద్యాసమితీ సంస్థలు రూపొందించిన సస్టైయినబుల్ ఇనిషియేటీవ్స్ సంకలనాన్ని మంత్రి ఆవిష్కరించారు. బెంగుళూరు మెట్రో రైల్ ప్రాజెక్టు డైరక్టర్ రాధాకృష్ణ రెడ్డి మాట్లాడుతూ తమ అవసరాలకు తగిన స్థాయిలో పునరుత్పాదక ఇంధనాన్ని సోలార్ ఎనర్జీ రూపంలో తయారు చేసుకుంటున్నామన్నారు. గృహ సంస్థ ప్రతినిధులు సంజయ్ సేథ్, షబానా బన్సీలు ఈ సందర్భంగా ప్రసంగించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగము

ఫారం-VI

(నిబంధన-19 యొక్క ఉప-నిబంధన(1) చూడండి)
మరియు చట్టం-30/2013 యొక్క సెక్షన్-11(1))
కలెక్టర్/జాయింట్ కలెక్టర్ ప్రాథమిక ప్రకటన

ఫైల్ నెం.G/804/2024 తేది: 22.08.2024.
గెజిట్ నెం. 33/2024

తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ వారు నాగర్ కర్నూల్ జిల్లా, నాగర్ కర్నూల్ డివిజన్, బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామంలో ప్రజోపయోగం నిమిత్తం బిజినేపల్లి మండలం యొక్క కారుకొండ గ్రామం వద్ద వట్టెం బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం ఉద్దేశించినారు.

అందువలన నాగర్‌కర్నూల్ జిల్లా, నాగర్‌కర్నూల్ డివిజన్, బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామం యొక్క పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం క్రింద బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామం వద్ద వట్టెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణకు ప్రకటించడమైనది. సేకరణకు సంబంధించిన సవివర వివరణలు క్రింద పేర్కొన్న విధంగా ఉన్నాయి.

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం | కట్టడాల పేరు మరియు యజమాని | సరిహద్దులు | | | | చెట్లు | కట్ట డాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | ఉ | ద | తూ | ప | | |
| 1 | 2 | 3 | 4 | 6 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1 | 47 | గౌతన్ | మెట్ట | శ్రీ ఆంజనేయ ఆలయం 2023 యొక్క Reg.నం. 101 ప్రకారం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం యొక్క సొసైటీ అధ్యక్షునిచే నిర్వహణ | 47 | 47 | 47 | 47 | లేవు | RCCతో ప్రహరీ గోడ |
| 2 | 47 | గౌతన్ | మెట్ట | శివాలయం గుడి 2023 యొక్క Reg.నం. 101 ప్రకారం శివాలయం గుడి యొక్క సొసైటీ అధ్యక్షునిచే నిర్వహణ | 47 | 47 | 47 | 47 | లేవు | RCCతో ప్రహరీ గోడ |

భూమి యొక్క ప్లాన్‌ను జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూలు, మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి నాగర్ కర్నూలు కార్యాలయాలలో ఏ పని రోజు అయినా, పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూలు వారు, రెవిన్యూ డివిజనల్ అధికారి నాగర్ కర్నూలు వారిని మరియు వారి సిబ్బందిని భూమిలో ప్రవేశించి సదరు చట్టం యొక్క సెక్షన్ (12)లో నిర్దేశించబడిన మరియు ఏర్పాటు విధంగా వారి పని బిజినేపల్లి మండలం, కారుకొండ గ్రామం వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం యొక్క వట్టెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సర్‌ప్లస్ వైర్ నిర్మాణానికి అవసరమైన భూమి సర్వే, ఏ భూమికైనా లెవెల్స్ తీసుకోవడం, త్రవ్వకం లేదా భూ పొరలలోకి బోర్ మరియు అన్ని అవసరమైన ఇతర పనులు నిర్వర్తించే అధీకృత అధికారం సమకూర్చారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద ఏవ్యక్తీ ఆ భూమికి సంబంధించి కలెక్టర్ గారి ముందు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి సదరు భూమిపై ఎటువంటి చిక్కులు సృష్టించడం, ఎటువంటి లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు వగైరాలు లేదా ఎటువంటి వ్యవహారాలు చేయకూడదు.

Go.Ms. నం.37 ప్రకారం నీటి పారుదల శాఖ మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ (LA R&R/A2) విభాగం తేదీ 30-06-2017, ఛాప్టర్-II యొక్క ఏర్పాటు అనగా (సామాజిక ప్రభావం మరియు ప్రజా ప్రయోజన నిర్ణయం మరియు ఛాప్టర్ నం.III అనగా (ఆహార భద్రత సురక్షితకు సామాజిక ఏర్పాటు) మరియు న్యాయమైన పరిహారం పొందే హక్కు మరియు 2013 చట్టం పునరావాస మరియు పునరాశ్రయ భూసేకరణలో పారదర్శకత అంశాలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం యొక్క భూసేకరణలో మినహాయించబడినవి.

భూ సేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే అటువంటి ఆసక్తిగల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ (15) ఏర్పాటు ప్రకారం ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 (అరవై) రోజులలోపుగా జిల్లా కలెక్టర్‌గారి ఎదుట దాఖలు చేయవలెను.

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు, LA PRLIS యూనిట్-II, నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్, (రెవిన్యూ), నాగర్‌కర్నూల్
సం/-జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR.NO: 225/LA/PP/Advt/Pub/2024-25

తెలంగాణ ప్రభుత్వం
కల్వకుర్తి :: మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం:
నాగర్‌కర్నూల్ జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ ప్రకటన నం. E1/W-13/2024-25/001 తేది: 30.08.2024

కల్వకుర్తి మునిసిపాలిటీలో (13) పనులకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫాంపై టెండరు పిలవబడుతున్నది. అంచనా విలువ : రూ.162.50 లక్షలు. పని పేరు: సాధారణ నిధి 2024-25 క్రింద ఆ మునిసిపాలిటీలో వార్డ్ నం: 09 మరియు 10లలో వరద నీటి కాల్వ సిసి డ్రైన్‌ల నిర్మాణం మరియు వార్డ్ నం: 02, 03, 11, 12, 13, 14, 19, 21 & 22 లలో సిసి రోడ్లు వేయుట. అంచనా విలువ : రూ. 7 లక్షలు. పనిపేరు : 15వ FCG క్రింద అదే మునిసిపాలిటీ వార్డ్ నం: 01లో భూగర్భ వరద నీటి పైప్ లైన్ నిర్మాణం. అంచనా విలువ రూ.14.50 లక్షలు. పనిపేరు : 2024-25 సాధారణ నిధి క్రింద ఇదే మునిసిపాలిటీలో గూసుల్‌ఖానా నిర్మాణం. అంచనా విలువ: రూ.18.10 లక్షలు. పనిపేరు: అదే మునిసిపాలిటీలో ముస్లిమ్ మైనారిటీ కమ్యూనిటీ కొరకు వైకుంఠ రథం సేకరణ. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 31.08.2024 ఉ.11.00గం. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 09.09.2024 సా.4.30గం. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం: 9110540243, 7331109838.

సం/-. కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ.

DIPR.No.3471-PP/CL/Advt/1/2024-25 తేది: 30.08.2024

వార్త


చదవడం వల్ల ప్రయోజనం ఏమంటే నలుమూలల నుండి వచ్చే విజ్ఞానాన్ని పొందడం, దాన్నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.

-ఆర్.షోకాల్డ్

# పెరుగుతున్న వైట్‌కాలర్ నేరాలు!

కులం, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు మన రాజ్యాంగ నిర్మాతలు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అవి అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో, దక్షిణాలకు ప్రలోభపడో, చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. ఫలితంగా వేలాది కరుడు కట్టిన నేరస్తులు కోట్లాదిరూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. సమర్థవంతపు దర్యాప్తు జరిపి పటిష్ఠంగా రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను కోర్టుముందు నిలబెట్టి నేరాన్ని రుజువుచేయడంలో కొందరు అధికారులు ఘోరంగావిఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా ముందుకు నడవకపోతే మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయేలా రికార్డులు తయారు చేస్తున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులు సకల అవస్థలుపడి కోర్టుల ముందు రుజువుకు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు పాలక పెద్దలే మోకాలొడ్డుతున్నారు. ఇలాంటి ప్రభుత్వ చర్యలు సమర్థవంతంగా దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ,నిరుత్సాహం పెంచుతున్నది. అయితే ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. ఇటీవల కేంద్రం కొన్ని సవరణలు చేసింది.మూడు కొత్త చట్టాలను తీసుకువచ్చింది.అయినా అది అటుఉంచుదాం.ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్ష పాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేదతేడాలు లేకుండా ఎంత వరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండాలేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. ప్రధానంగా దేశవ్యాప్తంగా అనేక బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్‌లు పెట్టి కోట్లాదిమందిఅమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేసే జీవితకాలంపాటు సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారులేక, బాధితుల వేదన అరణ్యరోదనగా మారి కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్న సందర్భాలున్నాయి.గత దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా ఎన్నో ఫైనాన్స్ కంపెనీలు ప్రజలను మోసం చేసి కోట్లాదిరూపాయలు దోచుకున్నాయి. ఇందులో రికవరీ మాట ఎలాఉన్నా నిందితుల్లో పదిశాతం మందిపై కూడా పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎలాంటి భయం, భక్తిలేకుండా బహిరంగంగానే నిస్సిగ్గుగా తిరుగుతున్నారు. ఇక ఒకే ప్లాట్‌ను ఇద్దరి ముగ్గురికి అమ్ముతూ, కొన్నిసార్లయితే అయితే లేని ప్లాట్లను కాగితాలపై చూపించి విక్రయించడం, ఇళ్లస్థలాల అమ్మకాల్లో ఘరానా మోసంచేసిన ఎందరో పెద్దలు నిర్భయంగా తిరుగుతున్నారు. చాలావరకు వారిపై కఠినచర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో హైడ్రా చెరువుల కబ్జాల్లో తొలగిస్తున్న ఇళ్లల్లో కొందరు పేదవారు కూడా ఉన్నారు.అన్నీ అనుమతులు ఉన్నాయని, పైగా మున్సిపల్ పర్మిషన్, కరెంట్, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేసిరికార్డు చూపెట్టడంతో కొనుగోలుచేసుకున్నారు.ఇప్పుడు ఒక్కసారిగా ఎలాంటి నోటీసు లేకుండా వచ్చి హైడ్రా కూలుస్తుండడంతో అలాంటి నిరుపేదలకు దిక్కులేకతాము మోసపోయామని తెలిసి కుప్పకూలిపోతున్నారు. పేదల విషయంలో ఆలోచించాల్సిన అవసరం ఉందనిపలువురు రాజకీయనేతలు కూడా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఏదోరకంగా డబ్బు సంపాదించగలిగితే తమను ఎవరూ ఏమీచేయలేరనే భావన రోజురోజుకు పెరిగిపోతున్నది.అందుకే ఒకరినిచూసి ఒకరు పోటీపడి ప్రజలను మోసంచేసి కోటీశ్వర్లు అయిపోతున్నారు. ఈ విషయంలో బాధితులు కొందరు పోలీసుస్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి అటుంచి అసలు కేసులునమోదు చేసుకోవడానికి కూడా కొందరు అధికారులు ఇష్టపడడం లేదు.మమ్మల్ని అడిగి ఇచ్చావా?ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మావద్దకు వచ్చేవాడివా అంటూ పలురకాల ప్రశ్నల వర్షం కురిపించి బాధితుడు మళ్లీ పోలీసు స్టేషన్ మెట్లెక్కకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీల్లేదని న్యాయస్థానాలకు వెళ్లాల్సిందిగా సలహాలు ఇస్తారు. ఒకవేళ ఏదైనా కారణంతో కేసు నమోదు చేయాల్సివస్తే సాక్ష్యాధారాలున్నాయా? లేవా? తదితర రికార్డులన్నీ పరిశీలించి దర్యాప్తులో సంతృప్తి చెందితేనే కేసు నమోదు చేస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే తాము వేరే పని చేయలేమని పోలీసుల వాదనను కూడా తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసుల బాధ్యతలుకూడా పెరిగిపోయాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వివిపిల బందోబస్తులోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఆయాప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా అరాచక శక్తులు విజృంభించడంతో శాంతిభద్రతలు క్షీణించినా పర్యాలేదుకానీ ఒక్క వివిపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు దొర్లినా తమ ఉద్యోగానికి ముప్పు తప్పదన్న భావనతోనే ప్రజాసమస్యలను విస్మరించి నేతల సేవవైపు మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేసుకోవడానికి వారు ఇష్టపడడం లేదు. దీనితోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఒకపక్క అదే సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకోగలుగుతున్నా మరొకపక్క కొత్తకొత్త వ్యూహాలు, పరికరాలు,పరిజ్ఞానంతో ఈ సైబర్‌నేరాలకు అదుపులేకుండాపోతున్నది. ఈ దగాలో మోసపోతున్నది, నష్టపోతున్నది సామాన్య, మధ్యతరగతి ప్రజలే. ఇప్పటికైనా పాలకులు అమాయక ప్రజలను మోసం చేస్తున్న దగాకోరులపై ఉక్కుపాదం మోపాలి.

ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భారం, విమర్శలను భరించే సహనం ఉండాలి.



షేక్స్పియర్

ఇతరుల్ని కష్టపెడుతూ నువ్వు కష్టపడకపోవచ్చు. కానీ సంతోష పెట్టేటప్పుడు మాత్రం నువ్వు తప్పక సంతోషంగా ఉంటావు.



సిసిరో

# ప్రజావాక్కు



### ఈ-దర్శన్ కేంద్రాలను పునఃప్రారంభించాలి

**తిరుమల** శ్రీవారి దర్శనానికి సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జిత సేవటికెట్‌లు, వసతిగదులు బుకింగ్‌లను మూడు నెలల ముందుగానే,ఆన్‌లైన్‌లో కేటాయించడంతో సామాన్య భక్తులు శ్రీవారి దర్శనానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు తెలుగురాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లోని ఈ-దర్శన్ కేంద్రాల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో దర్శనం, సేవ టికెట్‌లు, వసతిగదులు భక్తులు సులభంగాపొందేవారు. గత ఐదుసంవత్సరాలుగా వీటిని పూర్తిగా మూసివేయడం వలన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. టిటిడి అధికారిక వెబ్‌సైటు యాప్ ద్వారా స్వయంగా టికెట్‌లు బుక్ చేసుకోలేని భక్తులు బయట ఇంటర్నెట్ కేంద్రాలనుసంప్రదించి అధికమొత్తంలో డబ్బులు చెల్లించి దర్శనటికెట్‌లు కోసంతీవ్రసమస్యలు ఎదుర్కొంటున్నారు.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

### హోటళ్లలో లోపించిన పరిశుభ్రత

**వెనుకటి** కాలంలో స్త్రీలకు వివాహం సమయంలో వంట చేయడం వచ్చా అని తప్పనిసరిగా అడిగేవారు. కానీ నేడు వంటఆర్డర్ పెట్టుకోవడం వస్తే చాలనుకుంటున్నారు. చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఇతరత్రా ప్రైవేటు ఉద్యోగాలు చేసే దంపతులు వంటకు సమయం వెచ్చించలేకపోతున్నారు.నాన్ వెజిటేరియన్‌కాకుండా వెజిటేరియన్ వంటలుకూడా రకరకాల పద్ధతుల్లో మనకు తెలియనిపేర్లతో, కల్తీ పొడర్లతో తయారైనాణ్యతలేని మసాలా వంటకాల తాత్కాలి కరుచికి అలవాటుపడి అపరిశుభ్రాన్ని కడుపులో నింపుతున్నారు.

-జి.వేణుగోపాల్, హైదరాబాద్

### కొత్త చట్టాలపై అవగాహన ఏది?

**కొత్త న్యాయ,** నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్‌సురక్షా సంహిత, భారతీయసాక్షా అధినియమ్ అమలు ప్రారంభమైంది. స్వదేశీ న్యాయవ్యవస్థ ఉండాలనే ఉద్దేశ్యంతో బ్రిటిష్ కాలంనాటి చట్టాలకు స్వస్తి పలికి కేంద్రం వీటిని అమల్లోకి తెచ్చింది. ఇదివరకే ఉన్న జీరో ఎఫ్ఐఆర్ మరింత పక్కాగా కొనసాగించడంతోపాటు పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంపౌరులకు ఎంతోఉపయోగకరం. కొత్తచట్టాలలో సెక్షన్ల కుదింపు వల్ల గందరగోళ పరిస్థితికి తెరదించారు. త్వరితగతిన కేసులు పరిష్కారానికి ఇవి దోహదపడనున్నాయి.

-ఎన్. నాగరాజు, నాగర్ కర్నూల్‌జిల్లా

### దిగజారుతున్న యూనివర్సిటీల స్థాయి

**మన దేశంలో** ఎన్నో అత్యుత్తమ యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో ఎందరో విద్యార్థులు ఉన్నత విద్యలు అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఇది ఎంతో గర్వించే అంశం. కానీ నేడు ఆ ఉన్నత విద్యాలయాలు ర్యాంకులు దిగజారడం కడు విచారకరం.యువతకు మంచి చదువులు చెప్పాల్సిన ఈ యూనివర్సిటీలు ఇకనైనా తమని తాము ప్రక్షాళన చేసుకోవాలి. యూనివర్సిటీలో రాజకీయ ఇతర శక్తులకు నివారించాలి. తమ పతనానికి కారణాలు వెతుకుని సరిదిద్దుకోవాలి. విద్యార్థులకు ఉత్తమ నాణ్యమైన విద్యను అందించాలి. అందుకు ప్రభుత్వాల సహాయం తీసుకోవాలి. మళ్లీ తమ ర్యాంకులను పెంచుకుని దేశం గర్వించేలా ఎదగాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### స్మార్ట్‌సిటీలను ఏర్పాటు చేయాలి

**జహీరాబాద్** మాత్రమే ఎందుకు స్మార్ట్‌సిటీ కావాలె. గోదావరికి జన్మను ఇచ్చే ఆదిలాబాద్ లేదా కృష్ణను తనలో ఒంపుకొని ఉండే మహబూబ్‌నగర్,నల్గొండ ఎందుకు స్మార్ట్ సిటీలు కాకూడదు. ఎదులాపురంగా ప్రసిద్ధిగాంచిన కరీంనగరం చుట్టుముట్టు ప్రాంతాలలో ఎందుకు అభివృద్ధి పరుగులు తీయకూడదు. ఆదిలాబాద్‌లోని ఇంద్రవెల్లి ఎందుకు ఎమర్జింగ్ మార్కెట్ కాకూడదు. మెతుకు సీమలోని సిద్ధుడు తిరిగిన పేట సిద్ధిపేట ఒకస్మార్ట్‌సిటీగా అవతరిస్తే బాగుంటుంది. అలాగే ప్రాణహిత పరవళ్లు తొక్కే కరీంనగర్ కూడా స్మార్ట్ సిటీకి అర్హమైనది. 2015లో ప్రారంభించిన స్మార్ట్‌సిటీల మిషన్‌లో ఇప్పటికి 30 శాతం పట్టణాలు మాత్రమే ఆ రీతిలో ముందు అడుగు వేశాయి.మరి గడిచిన దశాబ్దకాలంలో ఈ మిషన్ ఎందుకు సఫలం కాలేకపోయింది అనేది పెద్ద ప్రశ్న.

-భారత అవినాష్, జనగామ

### గట్టి చర్యలు చేపట్టాలి

ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాలు, పట్టణాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. మానవ చర్యల వల్ల వాయుకాలుష్యం అంతకంతకు పెచ్చుమీరుతున్నది. ఒక్క వాయుకాలుష్యం కారణంగానే యేటా సుమారు 67 లక్షలమంది మృత్యువాత పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఇప్పటి కైనా కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు, వ్యవస్థలు, ప్రజలు చురుగ్గా కృషి చేయకపోతే భవిష్యత్తు అంధకారమే అవుతుంది. కనుక కాలుష్యాని అరికట్టే చర్యలు చేపట్టాలి.

-ఎ. పవన్‌కుమార్, హైదరాబాద్

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# 'హైడ్రా' తిలాపాపం తలాపిడికెడు

**ఇకపోతే తెలంగాణా వ్యాప్తంగా కొందరు అధికారులు తమ అవినీతి పాపం ఎక్కడ బయటకు వస్తుందేమోనని ముందుగనే కూల్చివేసే కార్యక్రమం మొదలు పెట్టారు మహబూబ్‌నగర్‌లో మొన్న బుధవారం అర్ధరాత్రి కూల్చి వేశారు. ఇలాగే ఈ లక్ష్యం నెరవేరాలంటే ఎన్నో లక్షల కుటుంబాలు నిరాశ్రయులౌతారు. అందులో ముఖ్యం నాలాలపక్కన నివసిస్తున్నవారిలో అధికశాతం సన్నజనం, మధ్యతరగతి ప్రజలే.పెద్దలన్నట్టూ చట్టం తనపని తాను చేసుకొంటే ఇన్ని దశాబ్దాలపాటు ఇంతపెద్దఎత్తున ఆక్రమణలు జరిగే అవకాశమే లేదు.తిలాపాపం తలా పిరికెడు అన్నట్టు ఇందులో అందరూ భాగస్వాములే. వారందరిపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందా?.అందుకే అన్నికోణాల్లో ఆలోచించి అడుగులు వేయాలి.ఎవరో చేసిన తప్పుకు మరొకరిని బలిచేయడం ఏమాత్రం సమంజసం కాదు.**

**దామెర్ల సాయిబాబ**

చట్టాలకు సామాన్యులు లోకువ, సమర్థులకు చట్టాలు లోకువవంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారో కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో అది అక్షరాల నిజమనిపిస్తున్నది.ఆర్థిక అంగ అధికార రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యలు అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్ట పరిస్థితులు దాపురించాయి.గత నెల రోజులుగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆక్రమణలపై నూతన ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో వెలుగు చూస్తున్న అక్రమాలు విస్తుగొలుపుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా చెరువులకు చెరువులనే ఆక్రమించుకొని ప్లాట్లు చేసి సొమ్ము చేసుకొంటే, మరి కొన్నిప్రాంతాల్లో చెరువుల శిఖం భూములను, బఫర్ జోన్‌లోని భూములను కబ్జా పెట్టి,కాలనీలుగా ఏర్పాటుచేసి అమాయకుల నుండి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన సంగతులు బయటపడుతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ప్రారంభం కాలేదు. ఏనాటి నుండో మొదలైనా గత రెండు, మూడు దశాబ్దాలుగా జోరందుకున్నది. ఇది హైదరాబాద్‌కో లేక తెలంగాణా రాష్ట్రానికో పరిమితం కాలేదు, పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌తోసహ దేశమంతా విస్తరించిందనే చెప్పచ్చు. బడిత కలవాడిదే బర్రె అన్నట్లు ఈ ఆక్రణదారులు తమ ఆర్థిక, అంగ రాజ కీయ బలంతో కుంటలు, చెరువులతోపాటు వాటికి నీరు, వచ్చివేళ్లే కాలువలను కూడా ఆక్రమించుకొన్నారు. ఫలితంగా ఎంతో ఆహ్లాదకరంగా సుందరీయింగా ఉన్న వందలాది చిన్ననీటి వనరులు అధిక శాతం ఆక్రమణలకు గురికాగా మరికొన్ని మురికినీటి కూపాలుగా మారిపోయాయి. వీటికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నడుంకట్టింది. చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్' (హైడ్రా) తొలగించే కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే చిన్న, పెద్ద అన్నీకలిపి రెండు వందలకుపైగా నిర్మాణాలను తొలగించి చెరువులకు కొంతవరకు చెరవిడిపించింది. అయితే ఇక్కడ అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ ఆక్రమణలు ఒక్క రోజో, రెండు రోజుల్లోనో మూడోకంటికి తెలియకుండా జరిగినవి కాదు. జరిగే అవకాశంకూడా లేదు. బహిరంగంగా పట్టపగలు పెద్ద పెద్ద యంత్రాలను పెట్టి కుంటలను చెరువులను మట్టితో పూడ్చుతున్నప్పుడు సంబంధిత అధికారగణం ఏం చేస్తున్నట్లు? అనుమతులు ఎలా ఇచ్చారు? పన్నులు ఎలా ఫిక్స్ చేశారు? ఎలా వసూలు చేస్తున్నారు? ఇదంతా ఒక ఎత్తు అయితే ఆ అక్రమకాలనీలకు ప్రభుత్వ ధనంతో రోడ్లు ఎలా వేశారు? మంచినీటి, మురుగునీరు కనెక్షన్లు ఎలాఇచ్చారు? కొన్ని కాలనీల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు ఆనాటి మంత్రులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఆనాటి శిలాఫలకాలు ఆయా కాలనీల్లో సజీవ సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు ఏకంగా కూల్చివేయడం ఎంత వరకు సమంజసమో పెద్దలు ఆలోచించాలి. పరి మితిలేని ఆదాయం ఉన్న నల్లధనస్వాములకు ఇబ్బంది ఉండకపోవచ్చునేమో రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలు, మధ్య పరిస్థితి మాటల్లో వర్ణించలేం. సొంత ఇల్లు అనేది ఈ వర్గాలకు జీవితకాల స్వప్నం. ఆ కలనెర వేర్చుకొనేందుకు ఆ వర్గాలు పడిన, పడుతున్నపాట్లు అన్నీ ఇన్నీకావు. జీవిత చివరి అంకంలో ఓ ఇల్లు సమకూర్చుకొని ప్రశాంతంగా ఉంటున్న వారికి తాముంటున్న ఇళ్లు అక్రమ కట్టడం అని, కూల్చివేస్తారనే వార్తలు కలవరపరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మళ్లీ దళారులు ప్రవేశించి తాము ఏదో రకంగా కాపాడుతామని డబ్బులు వసూల్ చేసుకొంటున్నారనే వార్తలను ప్రభుత్వం ఖండించింది. అలాంటి వారిపై చర్యలు తీసుకొంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఇప్పటికే

## ఒక్క మాట

కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా నిరుపేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో పెట్టుకో వాలి. చెరువులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమాయకులను మోసం చేసి అమ్మినవారిని, వారికి చేయూత నిచ్చిన అధి కారుల భరతం పట్టాలి.పర్యావరణాన్ని కాపాడేందుకు చిన్న నీటి వనరులను కాపాడాల్సిందే. అందులో మరోవాదనకు తావు లేదు. కానీ అందుకు చట్టాలున్నాయి. ఆ పరిధిలో వ్యవహరించాలి. అంతేకాని అర్థరాత్రో, అపరాత్రో పోలీసులు, బుల్డోజర్లతో వెళ్లి, న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఇవ్వకుండా కూల్చివేయడం ధర్మం కాదు. న్యాయస్థానాలకు వెళ్లడం వల్ల కొంత జాప్యం కావొచ్చేమో కానీ ఎవరి వాదన వాస్తవమో తేటతెల్లమౌతుంది. మరొకపక్క కాలుష్యకూపంగా తయారైన మూసీనదికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభం కావడం హర్షించదగ్గ పరిణామం. వాస్తవానికి తారాస్థాయికి చేరిన నీటికాలుష్యం కొంతవరకైనా నివారించేందుకు నాలుగు దశాబ్దాల క్రితమే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. కోట్లాది రూపాయలు వెచ్చించినా పాలకుల్లో త్రికరణశుద్ధి లేకపోవడం వల్ల సమస్య జటిలంగా మారిందని చెప్పొచ్చు. నాలుగైదు దశాబ్దాల క్రితం మూసీ పరిస్థితి ఇలా లేదు. ఈ పరివాహక ప్రాంతాల్లో ఉన్న చిన్న నీటి వనరుల్లోని నీరు తాగేవారు. అంతకంటే ముందు చరిత్ర చూసినా ఇక్కడి చెరువుల నుండి కాకతీయ ప్రభువులు మంచినీటిని వరంగల్‌కు తీసుకుపోయేవారని చెప్తారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలం, ఎదులాబాద్‌లో ఉన్న చెరువును ఇందుకు ఉదహరించవచ్చు. మంచినీటి కేకాక వందలాది మత్స్యకారుల కుటుంబాలకు అది జీవనాధారంగా ఉండేది. ఈ ఒక్క చెరువే కాదు ఆ ప్రాంతంలోని అనేక చెరువులు వ్యవసాయంతోపాటు చేపల పెంపకానికి వనరులుగా ఉండేవి. స్వాతంత్ర్యం అనంతరం పాలకుల నిర్వాకం ఫలితంగా మూసీతోపాటు ఇలాంటి చెరువులెన్నో ఆక్రమణలకు గురికాగా, మరికొన్ని కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. ఈ కాలుష్యం విస్తరించే కొద్దీ ముందుగా జలచరాలు, పశుపక్ష్యాదులతోపాటు మానవ జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారుతున్నది. ప్రస్తుతం మూసీలో కానీ, ఈ చెరువుల్లో కానీ నీటిని పశువులు కూడా ముట్టలేని పరిస్థితి. బట్టలు ఉతకడానికి, స్నానం చేయడానికి కూడా పనికిరావడంలేదు. పొలాలకు నీరుపారిస్తే పంట తాలుగా మారిపోతున్నది. చివరకు తాటి చెట్ల కల్లులో కూడా రసాయనికాలు చేరుకుంటున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రరూపం దాల్చినా పాలకులు దీనిపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోయారు. అప్పుడప్పుడు జరగరాని సంఘటనలు జరిగి ప్రాణనష్టం జరిగినప్పుడు మాత్రం అంతో ఇంతో హడావుడి చేసి ఆ తర్వాత మరిచిపోయేవారు. 2009 మే నెలలో ఒకసారి హైదరాబాద్ నడిబొడ్డులో కలుషిత నీరు తాగి ఎనిమిది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా మరో రెండువందల మంది వరకు ఆస్పత్రులపాలయ్యారు. ఈ కాలుష్యానికి కారకులెవరు? కారణాలు ఏమిటి? స్పష్టంగా తెలిసినా మూలాల్లోకి వెళ్లడం లేదు. కలుషిత నీటితో ఉత్పత్తయ్యే కోట్లాది క్రిమికీటకాలు నిత్యం వేలాదిమందిని అనారోగ్యం పాలు చేస్తున్నాయి. హైదరాబాద్ నగర పరిధిలో ప్రతిరోజూ వెలువడుతున్న కోట్లాది లీటర్ల మురుగునీటిలో అందులో అధికశాతం వ్యర్థజలాలు శుద్ధికి నోచుకోకుండానే మూసీలోకి చేరుకుంటున్నాయి.ముఖ్యంగా ఈ నీరు ప్రవహిస్తున్న పలు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ దుర్గంధభరితమైన వాసన వెదజల్లుతూ నీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడే లేదని చెప్పొచ్చు. కొన్నిప్రాంతాల్లో కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నా అక్కడ సరైన రీతిలో శుద్ధికాకపోవడంతో పరిశ్రమలకు చెందిన నీరు పలురసాయనికాలతో మూసీలోకి చేరుకుంటున్నాయి. ఇష్టానుసారంగా వెలిసిన కొన్ని బహుళ అంతస్తుల నుండి వెలువడుతున్న మురికినీరు,వ్యర్థపదార్థాలు అన్నీ మూసీలోకి వదులుతున్నారు. ఏదిఏమైనా అటు చెరువుల ఆక్రమణలను తొలగించడం,మూసీని కాలుష్యం బారినుండి బయటపడేసి అందంగా తీర్చిదిద్దేందుకు పథకాలు సిద్ధం చేయడం ఆహ్వానించదగిన పరిణామం. ఇకపోతే తెలంగాణా వ్యాప్తంగా కొందరు అధికారులు తమ అవినీతి పాపం ఎక్కడ బయటకు వస్తుందోనని కూల్చివేసే కార్యక్రమంమొదలు పెట్టారు. మహబూబ్‌నగర్‌లో మొన్న బుధవారం అర్ధరాత్రి కూల్చి వేశారు. ఇలాగే ఈలక్ష్యం నెరవేరాలంటే ఎన్నోలక్షల కుటుంబాలు నిరాశ్రయులౌతారు. అందులో ముఖ్యంగా నాలాల పక్కన నివసిస్తున్న వారిలో అధికశాతం సన్నజనం, మధ్యతరగతి ప్రజలే. పెద్దలన్నట్టూ చట్టం తనపని తాను చేసుకొంటే ఇన్ని దశాబ్దాలపాటు ఇంతపెద్దఎత్తున ఆక్రమణలు జరిగే అవకాశమే లేదు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు ఇందులో అందరూ భాగస్వాములే. వారందరిపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందా? అందుకే అన్నికోణాల్లో ఆలోచించి అడుగులు వేయాలి. ఎవరో చేసిన తప్పుకు మరొకరిని బలిచేయడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# వాయు కాలుష్యాన్ని అరికట్టేదెలా?

**డా.కృష్ణ కుమార్ వేపకొమ్మ**

చికాగో యూనివర్సిటీ, ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఎపిక్) సమర్పించిన 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్-2024' నివేదిక ఆధారంగా, దేశంలో వాయుకాలుష్యం 2022లో 19.3 శాతం తగ్గిందని, దీంతో భారతీయుల సగటు ఆయుర్దాయం ఏడాదిపాటు పెరిగిందని అర్థమవుతుంది. భారత్‌లో కాలుష్యం తగ్గినా, పట్టణాల్లో మాత్రం కాలుష్యం పెరుగుతోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. ఢిల్లీ విషయానికివస్తే అక్కడ గాలి కాలుష్యం కారణంగాప్రజల జీవితకాలం 12 సంవత్సరాలు తగ్గిపోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలను మించిపోయిన స్థాయిలో,ఢిల్లీలో 1.8 కోట్ల మంది ప్రజలు అధిక కాలుష్యానికి గురవుతున్నారు. ఇది ఢిల్లీని ప్రపంచంలోనే అత్యంత కాలుష్యంగా ఉన్న నగరంగా పరిగణిస్తున్నదని సూచిస్తుంది.ప్రస్తుత కాలుష్య స్థాయిలు కొనసాగితే, భారతదేశపు జాతీయ ప్రమాణాల ప్రకారం,ఢిల్లీ నివాసితుల జీవిత కాలం కనీసం 8.5 సంవత్సరాలు తగ్గిపోవచ్చని అంచనా. పిఎమ్ 2.5 అనే సూక్ష్మకణాలు ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరి, స్ట్రోక్, గెండు జబ్బులు, సిపిఒడి, ఊపిరితిత్తుల కేన్సర్, శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్ల వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. తాత్కాలిక కాలుష్యంతో కళ్లలో కలకలం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు లక్షణాలు ఏర్పడవచ్చు. ఢిల్లీలో కాలుష్యానికి ప్రధాన కారణాలు వాహనాల ఎగ్జాస్ట్ వాయువులు, గ్యాస్ లేదా బొగ్గు కాల్చడం, పొగాకు పొగ, వ్యవసాయ కార్యకలాపాలు. నిపుణులు గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు జాగ్రత్తగా ఉండాలని సూచి




స్తున్నారు. ఎందుకంటే ఇది తాత్కాలిక, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. ఢిల్లీ ప్రభుత్వం ఈ యేడాది 'వింటర్ యాక్షన్ ప్లాన్'పై దృష్టి సారించింది. ముఖ్యంగా గాలి కాలుష్యాన్ని తగ్గించడంపై దృష్టిసారిస్తూ ప్రజల ప్రవర్తనలో మార్పు కలిగించడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ పథకంలో వాహనాలు, పరిశ్రమలు, కదలిక ధూళి, పొగాకు కాల్చడం, పటాకులు పేల్చడం వంటి అంశాలపై దృష్టిపెట్టనుంది. ప్రభుత్వం పనిచేసే ఉద్యోగులను ఇంటి నుంచే పనిచేయమని ప్రోత్సహించాలని, వాహనాల వినియోగాన్ని పరిమితం చేసే స్వచ్ఛంద నిబంధనలను అమలు చేయాలని యోచిస్తోంది. వివిధ కార్యాలయాలకు భిన్నసమయాలు ఇవ్వడం, కాలుష్య స్థాయి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి మార్గాలను కూడా పరిశీలించనున్నారు. ప్రముఖ నిపుణులు గాలికాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమవర్షం సాధానాన్ని కీలక సిఫారసుగా సూచించారు.నిపుణుల సూచనలమేరకు, కేంద్ర పర్యావరణ మంత్రితో సమావేశం కోసం లేఖను రాయలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల్లో కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి 14 ప్రధాన అంశాలపై దృష్టి పెట్టనున్నారు. వీటిలో వాహన కాలుష్యం, పరిశ్రమల కాలుష్యం, గార్బేజ్ కాల్చడం, పటాకుల వాడకం వంటి అంశాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో అన్ని శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించి, సంయుక్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారు. ఈ చర్యలు ఢిల్లీలో గాలి నాణ్యతను మెరుగుపరచడం, ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడం కోసం కీలకమవుతాయి. ●

# యూపిఎస్ కంటే పాత పెన్షన్ విధానమే మేలు!

**జి.కిషోర్ కుమార్**

కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న 'జాతీయ పెన్షన్ పథకం'లో పదవీ విరమణ తరువాత 'ఫిక్సిడ్ పెన్షన్' రాదు అనే ఆందోళనకు పరిష్కారంగా, 23 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు చివరి జీతంలో 50 శాతం కచ్చితంగా పెన్షన్‌గా ఇచ్చేలా ప్రధాన మంత్రి నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో కొత్త పెన్షన్ పథకాన్ని రూపొందించి ఆమోదించడమైనదని ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు తిరిగి అమలుచేయాలని పోరాడుతున్న 'పాత పెన్షన్ పథకం'కు పెన్షన్ సంస్కరణలలో భాగంగా, ప్రభుత్వాలకి పెన్షన్ చెల్లింపులు భారమవుతున్నాయన్న నెపంతో ఆమోదయోగ్యం కాని విధంగా రూపొందించి ప్రస్తుతం అమలు చేస్తున్న 'జాతీయ పెన్షన్ పథకం'కి, పెన్షన్ అంశంపై పెరుగుతున్న దేశవ్యాప్త పోరాటాల వెల్లువను నిలువరించి ఉద్యోగవర్గాన్ని ప్రసన్నం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ఎన్‌డిఏ 3.0 ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ పథకంకు మధ్య ఉన్న తేడాలను విశ్లేషించాల్సిన అవశ్యకత ఉంది. ఏకీకృత పెన్షన్ పథకం ఏప్రిల్ 1, 2025 నుండి అమలులోకి వస్తుందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నేషనల్ పెన్షన్ స్కీమ్ లేదా యూనిఫైడ్ పెన్షన్ స్కీంలలో దేనినైనా ఎంచుకోవచ్చని ప్రస్తుతం ఉన్న కేంద్ర ప్రభుత్వ ఎన్‌పిఎస్ చందాదారులు కూడా యుపిఎస్‌కి మారే వెసులుబాటు కూడా ఉంటుందని కేంద్ర కేబినెట్ నిర్ణయాలలో భాగంగా పేర్కొన్నారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీంలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలించినట్లయితే, హామీ ఇవ్వబడిన కచ్చితమైన 50శాతం పూర్తి పెన్షన్ కోసం 25 సంవత్సరాల మధ్యకనీస సర్వీస్ చేసి ఉండాలి. పది నుండి 25 సంవత్సరాల మధ్య సర్వీస్ చేసిన వారికి ప్రపోర్షనేట్‌గా పెన్షన్ ఇస్తారు. రిటైర్మెంట్‌కు ముందు 12 నెలలలో తీసుకున్న సగటు ప్రాథమిక వేతనంలో 50శాతం పెన్షన్‌గా ఇస్తారు. పెన్షనర్ మరణానికి ముందు చివరిగా తీసుకున్న పెన్షన్‌లో 60శాతం పెన్షన్ కచ్చితంగాకుటుంబ పెన్షన్‌గా ఇవ్వడంతోపాటు కనీసం 10 సంవత్సరాల సర్వీసు తర్వాత సూపర్ యాన్యుయేషన్‌పై నెలకు కనీస పెన్షన్ రూ.పదివేలు హామీ ఇవ్వబడుతుంది. హామీ ఇవ్వబడిన పెన్షన్‌పై, కుటుంబ పెన్షన్‌నూ హామీ ఇవ్వడిన కనీస పెన్షన్‌పై సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులులాగే పారిశ్రామిక కార్మికులకు ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా డియర్‌నెస్ అలవెన్స్ ఇస్తారు. కానీ వేతనసవరణ జరిగినప్పుడు కమిషన్ సిఫార్సుల మేరకు పెన్షన్, కుటుంబ పెన్షన్, కనీసపెన్షన్ సవరించటమనే అంశంపై యూపిఎస్‌లో స్పష్టత లేదు. అలాగే పూర్తయిన ప్రతి ఆరు నెలల సర్వీస్‌కు విరమణ తేదీ వరకు నెలవారీ వేతనంలో1/10వ వంతు మొత్తాన్ని గ్రాట్యూటీకి అదనంగా సూపర్ యాన్యుయేషన్‌లో ఒకేసారి మొత్తం చెల్లింపుచేస్తారు. ఈ చెల్లింపు హామీ ఇవ్వబడిన 50 శాతం పెన్షన్ పరిమాణాన్ని తగ్గించదు. కేంద్ర కేబినెట్ సెక్రటరీ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వివిధ సంస్థలు, అన్ని రాష్ట్రాలలో వందకిపైగా సమావేశాలను నిర్వహించిందని, ఈ కమిటీ సూచనలు మేరకు ఈ యుపిఎస్ పెన్షన్ పథకం తయారు చేశామని పేర్కొన్నారు. అనేక కార్మిక సంఘాలు, స్వతంత్ర్య ఫెడరేషన్లు ఈ కమిటీ మీటింగ్‌ను బహిష్కరించాయనేది గమనార్హం. పాత పెన్షన్ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తమ చివరి జీతంలో 50 శాతం కచ్చితంగా పెన్షన్, అలాగే సర్వీస్‌లో ఉన్న ఉద్యోగస్తులు లాగే దాని మీద డిఏ కూడా ఇస్తున్నారు. ఈమొత్తాన్ని పూర్తిగా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో నుండి మాత్రమే చెల్లించేవారు. దీనికోసం ప్రత్యేక పెన్షన్ నిధి అంటూ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతంలో ఎటువంటి మినహాయింపులులేకుండా పాత పెన్షన్ స్కీమ్ అమలయ్యేది. పదవీ విరమణ నాటికి బేసిక్ వేతనంలో 50శాతం ప్రతినెలా పెన్షన్‌గా నిర్ధారించడంతోపాటు వినియోగదారుల ధరల సూచీ పెరుగుదల ఆధారంగా డిఏను, వేతన సవరణ అనంతరం వివిధ వేతన సంఘాలు ఇచ్చిన నివేదికల ప్రకారం,పెరిగిన వేతన సవరణ సిఫార్సులను అమలు చేయడం అనేది పాతపెన్షన్ విధానంలో అనుసరిస్తున్న పద్ధతి. ఫలితంగా రిటైర్ అయిన ఉద్యోగికి పెన్షన్ మొత్తం కాలానగుణంగా మెరుగుపరచడంతోపాటు సాధారణ భవిష్యత్ నిధి, గ్రాట్యుటీ వంటివి ఉద్యోగ విరమణ సదుపాయాలు ఉండేవి. వీటితోపాటుగా పెన్షన్ తీసుకుంటున్న రిటైర్ అయిన ఉద్యోగి మరణిస్తే కుటుంబ సభ్యులకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించే విధంగా ఫ్యామిలీ పెన్షన్ పథకం అమలయ్యేది. పాత పెన్షన్ పథకంలో పెన్షనర్ లేదా ఫ్యామిలీ పెన్షనర్‌కు 80 సంవత్సరాలు నిండినట్లయితే అదనంగా 20 శాతం 85 సంవత్సరాలు దాటితే 30 శాతం,తొంభై సంవత్సరాలు పైబడితే 40 శాతం, 95 సంవత్సరాలు దాటితే 50 శాతం, వంద సంవత్సరాలు దాటితే 100శాతం అదనపు పెన్షన్ ఇవ్వబడుతుంది. యూపిఎస్‌లోఅదనపు పెన్షన్ అంశానికి ఆస్కారం లేదు.ఓపిఎస్, ఎన్‌పిఎస్ పథకాలలో ఉన్న ఉమ్మడి అంశాల ప్రాతిపదికగా ఏకీకృత పెన్షన్ పథకాన్ని రూపొందించామని, అదనంగా 4.5 శాతం కంట్రిబ్యూషన్‌ను ఇస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికీ జులై నాటికి జాతీయ పెన్షన్ పథకంలో ఉన్న 99,77,165 మంది ఉద్యోగుల పెన్షన్ నిధులు మొత్తం 10,53,850 కోట్లు అసెట్ అండ్ మేనేజ్‌మెంట్‌గా ఉన్న పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే ప్రయత్నాలకు కొనసాగింపుగానే ఏకీకృత పెన్షన్ పథకం రూపొందించబడింది. 2004 నుంచి వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో నూతనంగా రిక్రూటైన ఉద్యోగులు ఓల్డ్ పెన్షన్ పథకం అమలుకోసం తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.వివిధ జాతీయ కార్మికసంఘాలు, ఇతర అన్నిసంఘాలు ధర్నాలను నిర్వహిస్తున్నాయి.ఉద్యమ తీవ్రత దృష్ట్యా కొన్ని రాష్ట్రాలలో ఓపిఎస్‌ను పునరుద్ధరించడం కూడా జరిగింది. ●



# మహిళా భద్రత చట్టాలు కఠినంగా అమలు చేయాలి

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పశ్చిమబెంగాల్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో దేశంలో మహిళల భద్రత కోసం ఇంకా ఎంతో చేయాల్సి ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం తీవ్ర యోచన చేస్తోందని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. అత్యాచారం వంటి నేరాలకు మరణశిక్ష విధించేలా చట్టాలను సవరించాం. ఆ చట్టాలను కఠినంగా అమలుచేయాలి. దేశంలో మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు, నేరాలు చూస్తుంటే ఇంకా చేయాల్సింది ఎంతో ఉందనిపిస్తోంది. మహిళలపై జరుగుతోన్న నేరాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంభిస్తోంది. ఆ దిశగా కొన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన అమానవీయమైనది అని మంత్రి పోస్టు పెట్టారు. అలాగే తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన రాజ్‌నాథ్ మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావించారు. అభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం తమ ప్రభుత్వంహయాంలో భారీగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల హర్యానా వంటి రాష్ట్రాల్లో లింగనిష్పత్తిలో మెరుగుదల కనిపించిందని చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశ అభివృద్ధిలో మహిళలకు తగిన ప్రాధాన్యం లభించలేదు. కానీ ఇప్పుడు ఈ పరిస్థితిలో అనూహ్య మార్పు వస్తోంది. దేశ భద్రతా బలగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటమే అందుకు నిదర్శనం అన్నారు. కొన్ని రోజుల క్రితం బెంగాల్‌లోని ఆర్జీకర్ ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అఘాయిత్యం జరిగింది. ఆ మరుసటి రోజు ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్నస్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసును కోల్‌కతా హైకోర్టు సిబిఐకి బదిలీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని విపక్షాలు, పలు సంఘాలు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అత్యాచారాల నిరోధకానికి కొత్త బిల్లు తీసుకురాబోతోంది. కఠిన నిబంధనలతో రూపొందిస్తున్న ఈ బిల్లు ప్రకారం దోషులుగా తేలిన వ్యక్తులకు మరణదండన విధించే అవకాశం ఉంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి సోవన్‌దేబ్‌ఛటోపాధ్యాయ్ వెల్లడించారు. బిల్లును సభలో సమగ్రంగా చర్చించి ఆమోదించడం కోసం సెప్టెంబర్ 2నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు స్పీకర్ బిమన్ బెనర్జీ తెలిపారు.

## బిజెపిలో చేరిన జార్ఖండ్ మాజీ సీఎం చంపయిసోరెన్



**రాంచి, ఆగస్టు 30:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి జెఎంఎం మాజీ సీనియర్‌నేత చంపయి సోరెన్ ఎట్టకేలకు పార్టీని వీడి కాషాయ కండువా కప్పుకున్నారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, జార్ఖండ్ బిజెపి అధ్యక్షుడు బాబూలాల్ మరాండి సమక్షంలో ఆయన బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. గత బుధవారం నాడే జెఎంఎంకి రాజీనామా చేసారు. అధ్యక్షతరహా పనితీరు, రాజకీయాలు కారణంగా తప్పనిసరై ఎన్నో ఏళ్లుగా సేవలందించిన జెఎంఎంను విడిచిపెటానని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి రాష్ట్రమంత్రి వర్గానికి కూడా ఆయన రాజీనామా చేసారు. జెఎంఎం సుప్రీం శిబుసోరెన్‌కు చంపయి సోరెన్ ఒకలేఖ సైతం రాస్తూ జెఎంఎంను విడిచిపెట్టాల్సి వస్తుందని కలలో కూడా భావించలేదని, జెఎంఎంను తన కుటుంబ పార్టీగా భావించానని గత కొద్ది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలతో పార్టీని వీడాల్సి వచ్చిందని తెలిపారు. సిద్ధాంతాలకు జెఎంఎం తిలోదకాలు ఇచ్చిందని చెప్పడానికి విచారం వ్యక్తంచేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఎవరికీ తమ ఆవేదన చెప్పుకునేందుకు ఒక వేదిక లేదన్నారు. ఆరోగ్యసమస్యల కారణంగా చురుకైన రాజకీయాలకు శిబుసోరెన్ దూరంగా ఉన్నప్పటికీ మీరే నాకు మార్గదర్శకంగా కొనసాగుతారని ఆలేఖలో చంపయి సోరెన్ చెప్పారు. హేమంత్‌సోరెన్ రాజీనామా నేపథ్యంలో గత ఫిబ్రవరి రెండున చంపయి సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఐదునెలల తర్వాత బెయిల్‌పై హేమంత్ విడుదలకావడంతో చంపయి సోరెన్ రాజీనామా చేసి తిరిగి హేమంత్‌కు సిఎం పగ్గాలు అప్పగించారు. ఈ అనూహ్య పరిణామం చంపయి సోరెన్‌ను తీవ్ర అసంతృప్తికి గురిచేయగా ఎట్టకేలకు ఆయన జెఎంఎంను వీడి బిజెపిలో చేరారు.



మాజీ స్పీకర్ సర్దార్ హుకుంసింగ్ జయంతి సందర్భంగా పార్లమెంటు సెంట్రల్‌హాలులోని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

# కమలాహారిస్ ప్రచారానికి తండ్రి డొనాల్డ్ హారిస్ దూరం?



**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న కమలాహారిస్ తరచూ తన తల్లిదండ్రుల గురించి సమావేశాల్లో చెబుతుంటుంది. తనను భయపడకుండా ముందుకువెళ్లమని తండ్రి చెప్పేవాడని ఇటీవల షికాగో డిఎన్‌సి ప్రసంగంలో కూడా పేర్కొంది. ట్రంప్ వంటి వారు తరచూ మార్క్సిస్టు తండ్రి నుంచే కమలా కమ్యూనిజం వంటబట్టించుకొందని విమర్శిస్తుంటారు. వాస్తవానికి శ్వేతసౌధంలో కమలా ఆఫీస్‌కు కేవలం మైలు దూరంలోనే నివాసం ఉంటున్న ఆమె తండ్రి ఒక్కసారి కూడా కుమార్తెను చూడటానికి రాలేదు. తండ్రీ-కుమార్తెల మధ్య దూరం మాటల్లేనంతగా పెరిగిపోయినట్లు తెలుస్తోంది.

**జమైకా నుంచి వచ్చి..** కమలా తండ్రి డొనాల్డ్ జె.హారిస్ 1938లో జమైకాలోని బ్రౌన్స్ టౌన్‌లో జన్మించారు. ఇక్కడే ప్రముఖ గాయకుడు బాబ్ మార్లే కూడా పుట్టాడు. ఆ తర్వాత డొనాల్డ్ హారిస్ లండన్‌కు వెళ్లి విద్యాభ్యాసం చేశారు. తిరిగి కాలిఫోర్నియాకు వచ్చి పిహెచ్‌డి పూర్తి చేశారు. 1962లో బెర్కెలీలో తొలిసారి శ్యామలా గోపాలన్‌ను కలిశారు. ఆమె భారత్ నుంచి అక్కడికి వచ్చి కేన్సర్‌పై పరిశోధనలు చేస్తోంది. వారి మధ్య ప్రేమ చిగురించి పెళ్లి చేసుకొన్నారు. వీరికి పుట్టిన తొలి కుమార్తె కమలా, రెండో కుమార్తె మాయా. కమలాకు ఏడేళ్ల వయసులోనే తల్లి శ్యామల, తండ్రి హారిస్‌ల మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయి. దీంతో వారు విడిపోయారు. కమలా తల్లి వద్దే కెనడా, ఇల్లినాయిస్‌లో పెరిగారు. ఆతర్వాత కాలిఫోర్నియాకు వలస వెళ్లారు. ఆ తర్వాత నుంచి ఇరువురి మధ్య పెద్దగా సంబంధాలు లేకుండా పోయాయి.

**మైలు దూరంలోనే ఉన్నా మాటలు లేవు..** 1972లో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో డొనాల్డ్ హారిస్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. అప్పట్లో ఆయనకు మార్క్సిస్టు ఎకానమిస్ట్‌గా పేరొచ్చింది. ఈ తర్వాత కొన్నాళ్లు విస్కన్సిన్ విశ్వవిద్యాలయంలో కూడా పని చేశారు. టీచింగ్ నుంచి ఆయన 1998లో పదవీ విరమణ చేశారు. తన కుమార్తె కమలా హారిస్ దేశ ఉపాధ్యక్షురాలైనా ఆయన నుంచి పెద్దగా స్పందన లేదు. ఎక్కడా కుమార్తె ప్రస్తావనను ఆయన తీసుకురారు. 2009లో కమలా తల్లి శ్యామలా పెద్దపేగు కేన్సర్‌లో మరణించారు. ఆ తర్వాత కమలాకు మిగిలింది తండ్రి డొనాల్డ్ ఒక్కరే. ఆయన నివాసం కూడా శ్వేతసౌధంలోని ఐసన్ హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్‌కు కేవలం మైలు దూరంలో ఉంటుంది. ఏనాడు ఆయన తన కుమార్తెను కలిసేందుకు ఆ కార్యాలయానికి వచ్చినట్లు రికార్డులు లేవు. చివరికి ఆమె 2020లో ప్రమాణస్వీకారం చేసినప్పుడు కూడా డొనాల్డ్ హాజరుకాలేదు.

# అధ్యక్షుడిగా గెలిస్తే ఉచిత ఐవిఎఫ్ చికిత్స



## డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

**మిషిగన్, ఆగస్టు 30:** రెండోసారి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాను గెలిస్తే మహిళలకు ఉచిత ఐవిఎఫ్ చికిత్సను అందించాలనుకుంటున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా అమలు చేయనున్నారు? నిధులను ఎలా సమకూరుస్తారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. 'ట్రంప్ పాలనలో ఐవిఎఫ్ చికిత్సకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. లేదా మీ బీమా కంపెనీ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది' అని మిషిగన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించారు. ఐవిఎఫ్ చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకొన్నది. అమెరికాలో ఒక దఫాకు పదివేల డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ చికిత్స ఫలవంతమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున బహుళ దఫాల్లో తీసుకోవాల్సి రావొచ్చు. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అనివార్య పరిస్థితుల్లో గర్భవిచ్ఛిత్తి చేయించుకునే హక్కు మహిళలకు ఉందని అమెరికా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. అదే అత్యున్నత న్యాయస్థానం ఆ తీర్పును కొట్టివేస్తూ గత యేడాది మరో తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో గర్భవిచ్ఛిత్తి విధానంపై ట్రంప్ కొంతకాలంగా భిన్నస్వరాలు వినిపించాయి. చివరకు ఈ అంశాన్ని రాష్ట్రాలకు వదిలేయాలని ప్రతిపాదించారు. దీంతో ఈ విషయమై ట్రంప్‌ను ఉద్దేశించి డెమొక్రాట్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో తాజా ప్రకటన రావడం గమనార్హం. సంతానలేమితో బాధపడుతున్న ఎంతోమందిని కృత్రిమ గర్భధారణ పద్ధతులు ఆదుకుంటున్నాయి. సంతాన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. వీటిల్లో ఎక్కువగా వాడకంలో ఉన్నది ఐవిఎఫ్ పద్ధతే. ప్రయోగశాలలో అండాన్ని, శుక్రకణాలను ఫలదీకరణ చెందించి, అభివృద్ధి చెందిన పిండాన్ని మహిళల గర్భసంచిలో ప్రవేశపెట్టడం దీనిలోని కీలకాంశం. దీంట్లో వెంటనే గర్భం వస్తుందని, సంతానం కలుగుతుందని చాలామంది భావిస్తుంటారు. నిజానికి అందరికీ తొలిసారే సంతానం కలగకపోవచ్చు. రెండు,మూడు సార్లు ప్రయత్నించాల్సి రావొచ్చు. కొందరికి సఫలం కాకపోవచ్చు కూడా. అందుకే ఈ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

# నైట్‌షిఫ్ట్‌లంటేనే భయపడుతున్న మహిళా వైద్యులు: ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి



**కోల్‌కత్తా, ఆగస్టు 30:** వైద్యవిద్యార్థిని హత్యాచారం ఘటనతో యావత్ దేశం ఉలిక్కిపడింది.ఇ విధుల్లో ఉన్న సమయంలోనే ఆమపై అత్యంత పాశవికదాడి జరగడం వైద్యుల్లోనూ తీవ్ర అలజడిరేపింది. ఈ క్రమంలో రాత్రిసమయాల్లో విధులు నిర్వర్తించేందుకు కొందరు వైద్యులు భయపడుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడయింది. ముఖ్యంగా మహిళా డాక్టర్లు ఇందుకు వెనకడుగు వేస్తున్నారని తేలింది. ఆత్మరక్షణ కోసం విధులకు వచ్చేటపుడు ఆయుధాలను వెంట తెచ్చుకోవాలని భావిస్తున్నట్లు మరికొందరు లేడీ డాక్టర్లు చెప్పడం గమనార్హం. కోల్‌కత్తాలోని ఆర్జీకర్ ఆసుపత్రిలో ఇటీవలి సంఘటన నేపథ్యంలో వైద్యుల భద్రతపై సమస్యలు అంచనా వేసేందుకు భారతీయ వైద్యులమండలి ఆన్‌లైన్‌సర్వేచేసింది. 22 రాష్ట్రాలకు చెందిన 3885 మంది ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు. వీరిలో 85శాతం మంది 35 ఏళ్లలోపువారే. 61శాతం మంది ఇంటర్న్‌లు లేదా పిజివైద్య విద్యార్థులే. సర్వేలో వారు వెల్లడించిన విషయాలను పరిశీలిస్తే 24.1శాతం మంది నైట్ డ్యూటీలో సురక్షితంగా భావించడంలేదని మరో 11.4శాతంమంది అత్యంత ఆందోళన వ్యక్తంచేసినట్లు తేలింది. ఇలా భయపడుతున్నవారిలో అత్యధికులు మహిళా వైద్యులు, వైద్యవిద్యార్థినులే ఉన్నారు. నైట్‌షిఫ్టుల్లో డ్యూటీరూమ్‌లేదని సర్వేలోపాల్గొన్న 45శాతంమంది పేర్కొన్నారు. డ్యూటీ రూమ్‌లు ఉన్నవారు మాత్రం అత్యంత సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. డ్యూటీరూమ్‌లు ఉన్నచోట అవి సరిపోవడంలేదని గోప్యత లేకపోవడం తాళాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంచుకోవాల్సి వస్తోందని చాలామంది చెప్పారు. మూడింట ఒకవంతు డ్యూటీ రూమ్‌లలో అటాచ్డ్ బాత్‌రూమ్‌లు లేవని తేలింది. వాటికోసం చాలాదూరం వెళ్లాల్సివస్తోందని చెప్పారు. 53శాతం డ్యూటీరూమ్‌లు, వార్డులు,అత్యవసర చికిత్సా విభాగాలకు చాలా దూరంలో ఉన్నాయని తేలింది. శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది, సిసికెమేరాలు, అవసరమైన చోట విద్యుత్ దీపాలు, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు రోగి బంధువుల సంఖ్యను నియంత్రించడం సైరన్ వ్యవస్థల ఏర్పాటు, కనీస వసతులతో డ్యూటీరూమ్‌లు ఏర్పాటు వంటివి సర్వేలో సూచించినట్లు ఐఎంఎ వెల్లడించింది.

# మమతకు పిల్లలుంటే ఆ బాధ తెలిసేది..

## కోల్‌కతా వైద్యురాలి తల్లి ఆవేదన



**కోల్‌కతా, ఆగస్టు 30:** వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళన చేపడుతున్నారు. 12 గంటల పాటు పశ్చిమబెంగాల్ బంద్‌కు బిజెపి ఇచ్చిన పిలుపు పలు చోట్ల ఉద్రిక్తతలకు దారి తీసింది. కాగా ఈ విషయంపై మృతురాలి తల్లి స్పందించారు. ఈ నిరసనలకు వ్యతిరేకంగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలను ఆమె ఖండించారు. మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు నాకు నచ్చలేదు. నా కూతురిపై జరిగిన అఘాయిత్యానికి వ్యతిరేకంగా వాళ్లంతా న్యాయం కోసం పోరాడుతున్నారు. నిందితులకు శిక్ష పడేవరకు విద్యార్థులు విశ్రమించరు. ఈ విషయంలో ప్రపంచం మొత్తం నా కూతురికి అండగా నిలుస్తోంది. కన్నబిడ్డను కోల్పోయిన బాధలో ఉన్న మమ్మల్ని మమత చేసిన వ్యాఖ్యలు మరింత బాధించాయి. ఆమెకు పిల్లలు లేరు. అందుకే వారిని కోల్పోతే ఆ బాధ ఎలా ఉంటుందో తెలియదు అని పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ ఆవిర్భావ దినోత్సవంలో సిఎం మమతా బెనర్జీ ప్రసంగించారు. అత్యాచార నిందితులకు మరణశిక్ష విధించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శనివారం నుంచి రాష్ట్రస్థాయిలో తృణమూల్ పార్టీ ఉద్యమం చేపడుతుందని ప్రకటించారు. ఆందోళన చేపట్టిన జూనియర్ వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని ఆమె కోరారు. మమత ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అందులో పేర్కొన్నారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, విదేశాలకు వెళ్లి చదువుకోవడానికి పాస్‌పోర్ట్, వీసా కూడా లభించదని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో అశాంతి చెలరేగితే అస్సాం, ఈశాన్యం, ఉత్తర ప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఢిల్లీలపైనా దాని ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆమె హెచ్చరించారు. కాగా ఈ కేసులో హత్యాచారం జరిగిన అనంతరం ఆర్జీకర్ ఆసుపత్రి వర్గాలు బాధితురాలి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేసినట్లుగా మూడు ఆడియో కాల్స్ తాజాగా బహిర్గతమయ్యాయి. ఉద్దేశపూర్వకంగానే మృతురాలి తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం ఇచ్చారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.



## ఢిల్లీ అల్లర్లపై కేసు విచారణ షురూ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:**దేశరాజధాని ఢిల్లీలో 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి హత్యలకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్‌నేత జగదీశ్‌టైట్లర్‌పై హత్య, ఇతర నేరాలపై అభియోగాలు నమోదు చేయాలని ఢిల్లీ సిబిఐ ప్రత్యేకన్యాయస్థానం సిబిఐని ఆదేశించింది. ఈ మేరకు సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాకేశ్ సియాల్ ఆదేశాలు జారీ చేసారు. ఆయనపై విచారణచేపట్టేందుకు సరిపడా సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి గతంలో ఒక ప్రత్యక్ష సాక్షి వాంగ్మూలం ఇచ్చారు. 1984 నవంబరు ఒకటిన టైట్లర్ తెలుపు అంబాసిడర్ కారులోనుంచి దిగి అల్లరిమూకలను రెచ్చగొట్టినట్లు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. మన తల్లిని చంపేసిన వారిని చంపేయండి అంటూ అక్కడున్నవారిని ప్రేరేపించారని ఆ సాక్షి వెల్లడించారు.


# ఎన్సీపీ అంటేనే మాకెంతో వికారం..

## అజిత్‌పవార్ వర్గంపై శివసేన షిండేనేత విసుర్లు



**ముంబయి, ఆగస్టు 30:** మహారాష్ట్రలో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో మహారాష్ట్ర అధికార కూటమిలో లుకలుకలు బయలుదేరాయి. అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీపై ఏక్‌నాథ్‌శిండే నేతృత్వంలోని శివసేన నేత అభ్యంతరకర వ్యాఖ్యలు చేసారు. వారి పక్కన ఉన్నపుడు వికారంగా అనిపిస్తుందని శివసేన నేత తానాజీ సావంత్‌చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. నేను శివసైనికుడినని, మాకు కాంగ్రెస్ ఎన్సీపీతో ఎప్పుడూ పొసగదని వారితో ఉంటే అలర్జీగా ఉంటుందని ప్రస్తుతం మేం ఎన్సీపీతో పొత్తులో ఉన్నాం కానీ వారితో సామీప్యత వికారం కలిగిస్తుందని, మా ఇద్దరి సిద్ధాంతాలు వేరని, సంకీర్ణ ధర్మాన్ని పాటించేందుకే మేం మౌనంగా ఉన్నామని వ్యాఖ్యలుచేసారు. అయితే ఇలా వివాదాస్పదంగా వ్యవహరించడం సావంత్‌కు కొత్తేమీ కాదు. ఒక ఇన్‌స్పెక్టర్‌ను బదిలీచేయాలని పోలీసు శాఖ ఉన్నతాధికారిపై ఆయన ఒత్తిడిచేసినట్లుగా ఉన్న వీడియో ఒకటిగతంలో వైరల్ అయింది. దాంతో అప్పుడు ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇపుడు ఆయన చేసిన వ్యాఖ్యలపైనా ఎన్సీపీ నేతలు మండిపడుతున్నారు. అయితే వాటిమధ్య పొసగడంలేదని పలు సార్లు వార్తలు వెలువడ్డాయి. అదే సమయంలో ఎన్నికలు జరుగుతున్నవేళ ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటన ప్రభుత్వంపై ఒత్తిడితెస్తోంది. దీనికి ముందు విగ్రహం కూలడంపై డిప్యూటి సీఎం అజిత్ పవార్ మౌనంగా నిరసన వ్యక్తం చేసారు.

## వెనెజులాలో అనేక ప్రాంతాలకు విద్యుత్‌బ్రేక్



**కారకస్, ఆగస్టు 30:** వెనెజులాదేశంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రాజధాని కారకస్‌తోపాటు అనేక రాష్ట్రాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కరెంటు సమస్య మొదలయింది. ఉదయం 4.50 నుంచి దేశంలో అనేక చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఇది విధ్వంసకారుల చర్యేనని అధ్యక్షుడు నికోలస్ మాద్యురో తెలిపారు. వెనెజులాలోని అన్ని రాష్ట్రాల్లో ఈసమస్య కనిపించిందని సమాచారమంత్రి ఫ్రెడ్డీ నానెజ్ అన్నారు. అధ్యక్షుడిని లక్ష్యంగాచేసుకుని ప్రత్యర్థులుచేసిన కుట్రగా భావిస్తున్నామన్నారు. దీనిని అధిగమించేందుకు కేంద్రం మొత్తం క్రియాశీలకంగా పనిచేస్తోందన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన దేశ ప్రజల శాంతి సామరస్యాన్ని ఎవ్వరూ దెబ్బతీయలేరన్నారు. 2019 నుంచి రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్న వెనెజులాలో విద్యుత్ అంతరాయాలు నిత్యకృత్యంగా మారాయి. అయితే ఇది ప్రత్యర్థుల పనేనని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ నిపుణులు మాత్రం విద్యుత్ పంపిణీతో పాటు వ్యవస్థతోపాటు జలవిద్యుత్‌మౌలిక సదుపాయాల నిర్వహణ లోపాల కారణంగానే ఇవిచోటు చేసుకుంటున్నట్లు చెపుతున్నారు.

# విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని మోడీ క్షమాపణలు



**ముంబయి, ఆగస్టు 30:** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్రనిరసనలు వ్యక్తంచేస్తున్న క్రమంలో ప్రధానిమోడీ స్పందించారు. తాను ఇక్కడికు వచ్చిన వెంటనే విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైనవారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను అని వెల్లడించారు. ఛత్రపతిశివాజీ మహరాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెపుతున్నా.మనకు ఈ దైవంకంటే గొప్పది ఏమీలేదన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లోపర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గత ఏడాది డిసెంబరు నాలుగున నౌకాదళ దినోత్సవంద సందర్భంగా ప్రధానిమోడీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా తొమ్మిది నెలలు పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి నాణ్యత మీదలేదని దుయ్యబట్టాయి. కాగా విగ్రహం నిర్మాణానికి చేపట్టిన కన్సల్టెన్సీపైనా, కాంట్రాక్టర్‌పైనా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఈ విగ్రహం కూలిన ఘటనలో నిర్మాణ సలహాదారును అరెస్టు చేసారు. క్రైమ్‌బ్రాంచ్ స్థానిక పోలీసులు సంయుక్తంగాచేపట్టిన గాలిం పుచర్యల్లో కొల్హాపూర్‌కు చెందిన సలహాదారు చేతన్‌పాటిల్‌ను శుక్రవారం తెల్లవారుఝామున అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే మాల్వాన్ పోలీస్‌స్టేషన్‌లో ఆతనిపై కేసునమోదు చేసామన్నారు. అయితే విగ్రహం నిర్మాణపరంగా ప్లాట్‌ఫారమ్‌పై పనిచేయడం మాత్రమే తనకు అప్పగించారని, థానేకు చెందిన ఒక కంపెనీ విగ్రహం పనులు చేసిందని చేతన్‌పాటిల్ తెలిపారు.

# అనుమతి ఆరు.. ఏర్పాటు చేసింది 35 అడుగుల విగ్రహం!



**ముంబయి, ఆగస్టు 30:** మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో శివాజీ విగ్రహం కూలడం వెనుక వైఫల్యాలు మెల్లగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ విగ్రహాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించడంతో ప్రస్తుతం ప్రతిపక్షాలు దీనిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. తాజాగా అసలు ఇక్కడ 35 అడుగుల శివాజీ విగ్రహానికి అనుమతులు ఇవ్వలేదని మహారాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ఆర్ట్ సంస్థ సంచాలకులు రాజీవ్ మిశ్రా వెల్లడించారు. తమకు తమకు కేవలం 6 అడుగుల మట్టి విగ్రహం డిజైన్ చూపించారని పేర్కొన్నారు. అసలు విగ్రహం 35 అడుగుల ఎత్తుంటుందని తమకు వెల్లడించలేదని పేర్కొన్నారు. ఆ విగ్రహంలో స్టీల్ ప్లేట్లు వాడుతున్న విషయం కూడా చెప్పలేదన్నారు. సింధ్‌దుర్గ్ జిల్లాలో ఈ విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నుంచి భారత నౌకాదళానికి రూ.2.44 కోట్లు నిధులను బదిలీ చేశారు. దీనికోసం నేవీ ఒక శిల్పి, కన్సల్టెంట్‌ను నియమించింది. డిజైన్‌కు తుదిరూపు ఇచ్చాక వారి అనుమతుల కోసం డైరెక్టరేట్ ఆఫ్ ఆర్ట్‌కు పంపించారు. ఆ తర్వాత దాని ఎత్తును చాలా రెట్లు పెంచేశారు. నిర్మాణం కూడా నాసిరకంగా చేపట్టారు. ఇటీవల పిడబ్ల్యుడి ఈ విగ్రహం నట్లు, బోల్టులకు తప్పు పట్టిందని నేవీకి లేఖ రాసింది. అసలు తమకు ఈ విగ్రహం నాణ్యత, స్థిరత్వాన్ని తనిఖీ చేసే అవకాశమే లేకపోయింది. ఈ విగ్రహానికి నేవీ, అది నియమించిన శిల్పి, కన్సల్టెంట్‌లదే బాధ్యతని పిడబ్ల్యుడి అధికారులు తేల్చి చెబుతున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఆర్ట్ సంస్థ సంచాలకులు రాజీవ్ మిశ్రా మాట్లాడుతూ ఇప్పటికైనా కళాకారులు అనుమతుల కోసం మట్టి మోడల్‌ను కాకుండా అసలు మోడల్‌ను పంపించాలని కోరారు. గతేడాది నేవీ డే సందర్భంగా రాజ్‌కోట్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. ఈ విగ్రహం కూలినఘటనలో నిర్మాణ సలహాదారును అరెస్టు చేశారు. క్రైం బ్రాంచ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా కొల్హాపూర్‌కు చెందిన సలహాదారు చేతన్ పాటిను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మాల్వాన్ పోలీసు కస్టడీకి తరలించారు.

# బిఆర్ఎస్ రైతులకు చేసింది శూన్యం

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ తొమ్మిదిన్నర యేళ్ల పాలనలో చేసింది శూన్యం అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలోకి కెసిఆర్ రావడం అంటే నవ్వొస్తున్నదని అధికారంలో ఉండగా ఎప్పుడైనా నువ్వు ప్రజలను కలిశావా అని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను కూడా గుర్తించడంలేదని తెలంగాణలో రివర్స్ పాలిటిక్స్ నడుస్తున్నాయని ఆయన భాష్యం చెప్పారు. ప్రజలను కెసిఆర్ కలువలేదు ఆయన మంత్రి మండలినే కలవకపోయేదని ఆయన గుర్తుచేశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ఎన్ని సార్లు మీరు సచివాలయంలోకి వచ్చారని ఆయన ప్రశ్నించారు? తొమ్మిది నెలలలో సచివాలయంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చిన ఎన్నిసార్లు అనేది లెక్క తేల్చుదామా?అని ఆయన ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించేందుకు అసెంబ్లీ పెట్టమని ప్రతిపక్షనేత అడుగాలి,కానీ సిఎం రేవంత్‌రెడ్డి శాసనసభ సమావేశంలో సభలకు ప్రతిపక్షనేత హాజరుకావాలని ప్రజల పక్షాన వాకాల్తా తీసుకోవాలని కోరినా కెసిఆర్ హాజరుకావడంలేదు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ప్రతిపక్ష నేతలకు కనీసం కలిసే అవకాశం కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన చెందారు. రుణమాఫీ సమస్యలకు కెసిఆర్ కారణం అని ఆయన ఆరోపించారు. రైతుకు మేలు చేసేందుకు ఇంటింటికి సర్వేచేస్తున్నదని 12వేల కోట్లు రుణం తీర్చడానికి బ్యాంకుల వద్ద ఉన్నాయని ఆయన తెలిపారు.రాహుల్‌గాంధీని హరీష్‌రావు కొండగల్‌రా ఇబురా అబురా అని పిలిచే స్థాయి అని జగ్గారెడ్డి నిలదీశారు. నీకు సమాధానం చెప్పడానికి మా సిద్దిపేట రైతులు చాలు మా స్టేట్ లీడర్లు లేరా రాహుల్‌గాంధీ కావాలా కొండరెడ్డి అనేవ్‌రెడ్డిలను సిద్దిపేటకు పంపిస్తాం ఏం కావాలో చెప్పుకో అని నిలదీశారు. రాహుల్‌గాంధీ గురించి మళ్లీ మాట్లాడితే నా లాంగ్వేజి మారు తుంది అని ఆయన అన్నారు. హరీశ్‌రావుకు లెక్కలు రావు ఫైనాన్స్ మినిస్టర్ అయిండు. మేనమామ చెప్పింది చేయడమే హరీశ్‌రావు పని అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ వరంగల్ వస్తారు అసలు సంబరాలు అక్కడే జరుగుతాయి అని ఆయన తెలిపారు. తొమ్మిదిన్నరేళ్లలో వ్యవసాయ శాఖను బిఆర్ఎస్‌పాలను దెబ్బతీశారు.



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి

## పాఠ్య ప్రణాళికపైనే ఆధారపడిన దేశాభివృద్ధి

### ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి

**హైదరాబాద్ (చార్మినార్), ఆగస్టు 30, ప్రభాతవార్త :** పాఠ్య ప్రణాళికపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అన్నారు.శుక్రవారం ప్రభుత్వ సిటీ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులకు ఆరు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ దెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా వేగంగా మారుతున్నప్పుడు విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికలకు అనుగుణంగా మన పాఠ్య ప్రణాళికలు మార్చుకోవలసిన అవసరం ఉందని తెలిపారు.గౌరవ అతిధిగా విచ్చేసిన ఆచార్య పార్థ సారధి మాట్లాడుతూ సివిల్ సర్వీస్ పరీక్షలో విద్యార్థులు ఎక్కువ మంది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ని ఐచ్ఛిక అంశంగా ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్,కన్వీనర్ డా.శంకర్,డి.విప్లవ దత్ శుక్లా,డి.యాదయ్య,డి.ఆది రమేష్,డి.రవీంద్ర బాబుతో పాటు నలబై మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పిఇసెట్-2024 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

### 3 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 4, 5 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీఈ) సెట్-2024 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగి నేటి(ఆగస్టు 31) నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 3 వరకు అభ్యర్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు పీఈసెట్-2024 అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ పి రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 3న కౌన్సెలింగ్‌కి అర్హత కలిగిన వారి పేర్లను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 4,5 తేదిల్లో వెబ్ ఆప్షన్లను ఇవ్వడానికి అవకాశమిచ్చారు. సెప్టెంబర్ 6న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. సెప్టెంబర్ 8న ఫైనల్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్ చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 9 నుంచి 12 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ట్యూషన్ ఫీజు చెల్లించి కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



నవీన్(ఫైల్)

**సిద్దిపేట రూరల్ (దుబ్బాక), ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో జీవి తంపై విరక్తిచెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని శుక్రవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ వి.గంగ రాజు వివరాల ప్రకారం.. దుబ్బాకలో నివాసముంటున్న తుమ్మ రాజలింగం అనే వ్యక్తి బీడీ ప్యాకింగ్‌చేస్తూ భార్య, కుమారుడు నవీన్‌తో జీవనం సాగిస్తు న్నారని తెలిపారు. నవీన్‌కు 4 యేండ్ల క్రితం వివాహం జరగగా నవీన్ కుటుంబపోషణ కోసం వివిధ పనులు చేసినప్పటికీ సరైన ఆదాయం రాలేదు. దీంతో అప్పులు చేసినట్లు తెలిపారు. గురువారం రాత్రి ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన అనంతరం తన గదిలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు ఎంతగా పిలిచినా గది తలుపులు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో గది తలుపులు తెరవగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ డంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## డెంగ్యూ జ్వరంతో మహిళ మృతి

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తడకపల్లి గ్రామానికి చెందిన సుతారి కనకలక్ష్మి(28) డెంగ్యూజ్వరంతో మృతి చెందినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. రెండు నెలల క్రితం డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న కనకలక్ష్మికి సిద్దిపేట ప్రైవేటు ఆసుపత్రిలో చిక్సిత అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో హైదారాబాద్‌లోని వివిధ ప్రైవేటు అసుపత్రుల్లో చికిత్స అందించిన జ్వరం తగ్గకపోవడంతో గురువారం రాత్రి మృతి చెందారు. కనకలక్ష్మి ప్రాణాన్ని కాపాడుకోవడానికి రూ.25 లక్షలకుపైగా అప్పుచేసి చికిత్సలు చేయించిన ఉపయోగం లేకపోయింది. మృతురాలికి ఇద్దరు కుమారులు సాత్విక్(9), చేతన్(7) భర్త నర్సింలు ఉన్నారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

## రుద్రారంలో దొంగల బీభత్సం

### మాజీవైస్ యంపిపి ఇంట్లో 19 తులాల బంగారం, 10 తులాల వెండి చోరీ

**పెద్దేముల్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని రుద్రారంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మాజీ మునిసిపల్ చైర్మన్, ప్రస్తుత తట్టెపల్లి పిఎసిఎస్ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి సోదరుడు రుద్రారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి పి.గోపాల్‌రెడ్డి అతని భార్య తుంగభద్రతో కలిసి ఈ నెల 28న బుధవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్కడ ఆసుపత్రిలో చూపించుకుని, ఆ తర్వాత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. బుధవారం రాత్రి యాదగిరిగుట్టలోనే ఉండి గురువారం సాయంత్రం బయలుదేరారు. అర్ధరాత్రి 12:30 గంటలకు గ్రామానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఇంటితాళం తీసి ఉండటంతో కంగారు పడుతూ మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌కు వెళ్లి చూడగా బీరువా తాళం పగులకొట్టి అందులో ఉన్న బంగారు అభరణాలు మూడున్నర తులాల నెక్లెస్, మూడున్నర తులాల కంకణాలు, తులం చైన్, మూడున్నర తులాల కొత్త నెక్లెస్, ఆరు తులాల మిరాలదండ, తులం బేబిగాజులు, మూడు మాసాల కమ్మలు, మూడు మాసాల ఉంగరంతోపాటు 10 తులాల వెండి వస్తువులు చోరి అయ్యాయని తెలిసి గోపాల్‌రెడ్డి, అయన భార్య తుంగభద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాండూరు డిఎస్‌పి బాలకృష్ణరెడ్డి, రూరల్ సిఐ అశోక్‌గౌడ్‌తోపాటు ఎస్ఐ గిరి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అయితే దొంగలు చోరీ చేసిన తరువాత వెనుక భాగం గోడపై నుంచి దూకి పారిపోయారు.

వికారాబాద్ జిల్లా సిసిఎస్ (సెంట్రల్ క్రైమ్ స్పెషల్) సిఐ బలవంతయ్య సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగతనానికి సంబందించి వివరాలను బాధితులను అడిగి తెలుసు కున్నారు. అయితే సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి ఉంటే దొంగలు త్వరగా దొరికే వారని పలువురు చెబుతున్నారు. భాధితుడు గోపాల్‌రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇంటర్ అడ్మిషన్ల గడువు మరోసారి పొడిగింపు

### సెప్టెంబరు 7 వరకు అవకాశం
### ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు 90వేలు చేరిక

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకి రెండో విడత అడ్మిషన్లకి మరోసారి గడువు పొడిగించారు. ఇప్పటికే రెండో విడతలో గడువును రెండుసార్లు పొడిగించగా.. ఇప్పుడు మూడోసారి పొడిగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 90 వేల మంది విద్యార్థులు చేరారు. ఇంటర్ మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 30తో ముగిసింది. దాంతో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను జులై 31 కొనసాగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకోగా.. అడ్మిషన్లకి ఎక్కువ విద్యార్థులు గడువు కోరుతున్నారని రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 20 వరకు పొడిగించారు. ఆ తరువాత గడువును రెండోసారి ఈ నెల 31 వరకు గడువును పెంచగా ఇప్పుడు మూడోసారి సెప్టెంబర్ 7 వరకు గడువును పెంచినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పూర్తయి.. జూన్ 1 నుంచే క్లాసులను కూడా ప్రారంభించాయి. కానీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలే జీల్లో 2024-25లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మే 8న ఇంటర్ బోర్డు అడ్మిషన్ల షెడ్యూల్‌ను జారీ చేసింది.. అప్పటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

## మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించండి

### ఎండి ఎన్వీఎస్‌రెడ్డికి ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్ యువజన సంఘాల వినతి



మెట్రోరైలు ఎండి ఎన్వీఎస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న యువజన సంఘాల నేతలు

**హైదరాబాద్ (బేగంపేట) ఆగస్టు 30, ప్రభాతవార్త:** మెట్రోరైలు ప్రయాణీకుల నుంచి ఎలాంటి పార్కింగ్ ఛార్జీలు వసూళ్లను మెట్రో సంస్థ, ఎల్ అండ్ టీ సంస్థలు తక్షణమే ఉపసంహరించు కోవాలని, మెట్రో ప్రయాణీకులకు పార్కింగ్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర,వర్కింగ్ ప్రసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్,పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌లు డిమాండ్ చేసారు.బేగంపేట లోని మెట్రో కార్యాలయంలో శుక్రవారం మెట్రో మేనేజింగ్ డైరక్టర్ ఎన్వీఎస్ రెడ్డిని కల్సి యువజన సంఘాల బృందం వినతిపత్రం అంద జేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్రో ప్రయాణీకులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదే అని అన్నారు.ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని వాటిలో ఎటువంటి కనీస వసతులు కల్పించకుండా, ప్రయాణీకులు వాహనాలు నిలిపితే పార్కింగ్ ఛార్జీల పేరుతో దండుకోవడం సరికాదన్నారు.ప్రయాణీకుడు అప్పటికే వందల రూపాయలు ఛార్జీలు మెట్రో ట్రైన్‌కి చెల్లిస్తున్నారని,మళ్లీ పార్కింగ్ పేరుతో ఛార్జీలు వసూలే చేయడం అది కూడా రవాణా ఛార్జీలతో సమానంగా అధిక మొత్తంలో వసూలు చేయడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. తక్షణమే నాగోల్ మియాపూర్ మిగిలిన అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ కల్పించాలని వారు డిమాండ్ చేసారు.దీనిపైన సానుకూల నిర్ణయం తీసుకోకుంటే యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.ఎల్ అండ్ టీ సంస్థ పరిధిలో అనుబంధ సంస్థ అయిన ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ ద్వారా మెట్రో రైలు సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు చూస్తుందని,వారు అన్నారు.అయితే మెట్రో సంస్థ ఎల్ అండ్ టీ సంస్థకు 30 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ ఇచ్చిందని,నిబంధనలకు లోబడే నిర్వహణ విషయంలో ఎల్‌అండ్‌టీ వ్యవహరించాలి కానీ నిబంధనలకు విరుద్దంగా పార్కింగ్ ఛార్జీలు వసూళ్లు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఛార్జీలు వసూళ్లు చేయాలంటే పార్కింగ్ స్థలంలో పూర్తి స్థాయి మౌళిక సదుపాయాలు కల్పించాలని, షెడ్లు, సీసీ కెమెరాలు, టాయ్‌లెట్లు,సెక్యూరిటీ తదితర సౌకర్యాలు కల్పించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.అయినా వసూళ్లపై వెనక్కి తగ్గకపోతే సెప్టెంబరు 1న ఛలో నాగోల్ మెట్రో స్టేషన్ పిలువు నిచ్చి ఆందోళణ చేస్తామని వారు తెలిపారు.ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో నిర్వహణ సంస్థ ఎల్ అండ్‌టీ యాజమాన్యంతో చర్చిస్తామని, సానుకూలంగా ప్రయా ణికుల అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, అనిల్‌కుమార్, హష్మీబాబు, రవి కుమార్, బిఎస్ కృష్ణ, మనోహర్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు స్కిల్స్ పెంపుపై ప్రత్యేక దృష్టి

### త్వరలో ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో ఉన్నత విద్యామండలి సమావేశం
### యుజిసి, ఎఐసిటిఇ చైర్మన్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకి నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించడం కోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్, డీన్స్‌లతో ఏఐసీటీఈ ఉన్నతాధి కారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ ఢిల్లీ వెళ్లి యూజీసీ ఛైర్మన్‌తోపాటు బార్ కౌన్సిల్ అధికారులతోపాటు ఏఐసీటీఈ ఛైర్‌పర్సన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారితో చర్చించినట్టు తనను కలిసిన విలేకరులతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి పంచుకున్నారు. తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని.. ఈ నేపథ్యంలో విద్యార్థులకి నాణ్యమైన విద్యను అందించడం కోసం కృషి చేయాలని భావిస్తున్నారు. ఇందుకుకోసం ఏఐసీటీఈ ఉన్నతాధికారుల సహాయం కోరగా.. అందుకు వారు కూడా అంగీకరించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఇంజి నీరింగ్ విద్యార్థుకి వారి స్కిల్స్ పెంపొందించేలా రాబోయే రోజుల్లో ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్టులు, అలాగే పరిశ్రమలతో ఇంజనీరింగ్ కాలేజీల అనుసంధానం తదితర అంశాలను చర్చించను న్నారు. ఇందుకు కోసం జాతీయస్థాయిలోని ఏఐసీటీఈ ఉన్నతాధికారులతో ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్, డీన్స్‌కి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఉన్న సమస్యలను యూజీసీ ఛైర్మన్‌తో చర్చించినట్టు తెలిపారు. పీహెచ్‌డీ అడ్మిషన్లతోపాటు గైడ్ల ఏర్పాటు అంశాలను కూడా వారితో చర్చించినట్టు తెలిపారు. కొన్ని డిస్టెన్స్ యూనివర్సిటీలకి జారీ చేస్తున్న సర్టిఫికెట్స్‌కి గుర్తింపు లేకపోడాన్ని కూడా వారు ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాగే రాష్ట్రంలోని కొన్ని లా కాలేజీలకి సంబంధించిన అప్రూవల్స్ పెండింగ్‌లో ఉన్న విషయాలను బార్ కౌన్సిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అందుకు వారు సానుకూలంగా స్పందించినట్టు ఛైర్మన్ లింబాద్రి తెలిపారు.

## సాగుకు 4 వేల మెగావాట్ల సౌరవిద్యుత్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్యవసాయం నిమిత్తం 4 వేల మెగా వాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అన్ని రాష్ట్రాలకూ కలిసి ఇంత వరకూ 8112 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లకు అనుమతి ఇవ్వగా, అందులో అత్యధికంగా తెలంగాణకు 4 వేల మెగావాట్ల యూనిట్లను మంజూరు చేసింది. ఒక్కో రైతు లేక ఇతర రైతులతో కలిసి 0.5 మెగా వాట్ల నుండి 2 మెగా వాట్ల వరకూ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకునే వీలుంది. ఇందుకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సబ్ స్టేషన్ల వారీగా ఎంత సామర్థ్యం వరకూ రైతులు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఎంత వరకూ ఉందో అనే వివరాలను తమ వెబ్ సైట్లలో అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. ఇక అసక్తి కలిగిన రైతులు మెగా వాట్‌కు 5 వేల రూపాయలకు మించకుండా పీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వ్యవసాయ వినియోగానికి పోను మిగిలిన కరెంట్‌ను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు రైతుల వద్ద నుండి విధిగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను యూనిట్ విద్యుత్‌కు 3.13 రూపాయల చొప్పున రైతులకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సి ఉంది.

## ఎక్సైజ్ శాఖ యంత్రాంగానికి టి-న్యాబ్ మార్గదర్శనం

### నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై దాడులు
### తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ హైదరాబాద్, రంగారెడ్డి ఎస్టీఎఫ్ టీంలకు టీజీ న్యాబ్ ఎస్పీలు చైతన్య, సీతారామ్ పలు సూచనలు, సలహాలు అందించారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. డ్రగ్స్ కోసం దాడులు, తనిఖీలు నిర్వహించే సమయంలో నేరస్తులను ఎలా గుర్తించాలి, డ్రగ్స్‌ను ఎలా వినియోగిస్తారు, ఎక్కడ తీసుకుంటారు, డ్రగ్స్ తీసుకున్న వారి ప్రవర్తన ఏ విధంగా ఉంటుంది. వారిని ఎలా గుర్తించాలి వారిపై 12 బ్యారెల్ డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో ఎలా పరీక్షలు నిర్వహించాలి అనే విషయాలను టీజీ న్యాబ్‌కు సంబంధించిన అధికారులు వివరించారు. డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షలు నిర్వహించినప్పుడు పాజిటివ్ వస్తే ఏమి చేయాలి నెగెటివ్ వస్తే ఏమి చేయాలి అనే విషయంపై కూడా ఎక్సైజ్ పోలీసులకు వివరించారు. వీటితో పాటు డ్రగ్స్‌పై టీజీ న్యాబ్‌తో కలిసి ఎక్సైజ్ శాఖ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. తనిఖీలు చేస్తున్నప్పుడు వారిలో మహిళలు ఉంటే మర్యాదగా వ్యవహరించాలనీ, దాడులు చేసే సమయంలో మహిళా కానిస్టేబుల్స్‌తో మాత్రమే తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీలకు వెళ్లే ముందు పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకోవాలనీ, ఎంట్రెన్స్, ఎగ్జిట్‌ను ఆధీనంలోకి తీసుకున్న తరువాత పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. టీజీ న్యాబ్ ఇచ్చిన సూచనలను ఎక్సైజ్ శాఖ యంత్రాంగం అవగాహన చేసుకోని మంచి ఫలితాలను సాధించాలన్నారు.

## ఆహార పంటల వృద్ధి రేట్‌లో తెలంగాణ టాప్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** ఆహార పంటల ఉత్పత్తిలో తెలంగాణ 16.42 శాతం వృద్ధి రేటును సాధించి దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. ఆహార పంటలను అత్యధికంగా పండించే పంజాబ్, హర్యానా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను వెనక్కి నెట్టి తెలంగాణ వాటి స్థానాన్ని ఆక్రమించింది. 2018-19 నుండి 2023-24 వరకూ వ్యవసాయ పంటల ఉత్పత్తికి వృద్ధి రేటుకు సంబంధించిన నివేదికను కేంద్రం విడుదల చేసింది. ఈ నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారం ఆహార పంటల ఉత్పత్తి వృద్ధి రేటులో 7.11 శాతంతో తర్వాత రెండో స్థానంలో మహారాష్ట్ర నిలిచింది. మిగిలిన బీహార్‌లో 5.14 శాతం, మధ్యప్రదేశ్ 4.35 శాతం, కర్నాటక 3.18 శాతం, ఉత్తరప్రదేశ్ 1.65 శాతం, పంజాబ్ 0.66 శాతం, హర్యానా 0.34 శాతం, పశ్చిమబెంగాల్ 0.14 శాతంవృదిధ రేటును నమోదు చేశాయి.


## రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఆగస్టు 30, ప్రభాతవార్త:** రిమాండ్ ఖైదీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ప్రశాంత్ గత రెండు రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో ఎర్రగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.శుక్రవారం ఉదయం 11 గంటలకు వార్డులో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రి సిబ్బంది బోరబండ పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితనతం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిసి గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ల నోటిఫికేషన్

### రేపటి నుంచి 31 వరకు
### ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
### బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువును పెంచారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను సెప్టెంబర్ 15 వరకు స్వీకరించనున్నట్టు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. మొదట దరఖాస్తులను ఈ నెల 31 వరకు స్వీకరించనున్నట్టు ప్రకటించినప్పటికీ.. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల నుంచి విజ్ఞప్తులు రావడంతో బీఎస్సీ (హానర్స్)లో ప్రవేశాలను చేపట్టడానికి సెప్టెంబర్ 15 వరకు గడువును పెంచి నట్టు తెలిపారు. బీఎస్సీ(హానర్స్)లో ప్రవేశాలకోసం 2024-25లో ప్రభు త్వం నిర్వహించిన ఈఏపీ సెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఏపీ సెట్- 2024లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం అడ్మిషన్లను ఫైనల్ చేయను న్నారు. కరీంనగర్, వనపర్తిలో ఉన్న మహిళా డిగ్రీ కాలేజీల్లో అడ్మి షన్లను చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి తల్లి దండ్రుల వార్షికాదాయం రూ. 1,50 లక్షలకి.. పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షికాదాయం రూ. 2 లక్షలకి మించకుండా ఉన్నవారు దరఖాస్తుకు అర్హులుగా ప్రకటించారు. దరఖాస్తు చేసుకోవడంలో ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి సైదులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులను కలిసి సమస్యలు తెలుసుకుంటున్న డా.జి.చిన్నారెడ్డి.

## 'ప్రజావాణి'కి 680 దరఖాస్తులు

**హైదరాబాద్(బేగంపేట) ఆగస్టు 30, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 680 దరఖాస్తులు అందాయని అధికారులు తెలియజేసారు. శుక్రవారం వచ్చిన దరఖాస్తులలో ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 215 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 98,రెవెన్యూ సమస్యలకు సంబంధించి 94, మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 90, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 64, ఇతర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



## స్కిల్ వర్సిటీ, ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల డిజైన్లను పరిశీలించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి ప్రాథమిక డిజైన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారంనాడు సచివాలయంలో పరిశీలించారు. డిజైన్స్‌పై ఆర్టిటెక్ట్స్‌కు సిఎం పలు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్ల విషయంలోనూ సిఎం పలు సూచనలు చేశారు. సూచించిన మార్పులతో వీలైనంత త్వరగా పూర్తి స్థాయి డిజైన్స్ నమూనాను రూపొందించాలని సిఎం ఆదేశించారు.

## విషజ్వరాల పీడితులను కాపాడేందుకు వైద్య క్యాంపులను ఏర్పాటు చేయాలి

### సిఎంకు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** రాష్ట్రంలో విష జ్వరాలు పెరుగుతూ కుటుంబాలు మంచాన పడుతున్నాయని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ గణాంకాల కంటే ఎక్కువ మంది జ్వరాల బారిన పడ్డారని,డెంగీతో అక్కడక్కడ చనిపోతున్న విషయం ప్రభుత్వం గమనించాలని కోరారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, ములుగు ఆసిఫాబాద్ నిర్మల్ భూపాలపల్లి వంటి జిల్లాల పరిస్థితి తీవ్రంగా ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గిరిజన తండాల్లో,హరిజన వాడల్లో తక్షణమే మొబైల్ టీంల ద్వారా వైద్య క్యాంపులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో,జిల్లా వైద్య కేంద్రాల్లో ప్లేట్‌లెట్స్‌ల లెక్కింపు మిషన్లు ఇతర వైద్య పరికరాలు తక్షణమే అందించాలని సిఎంను కోరారు. ప్రజల విషజ్వరాల బారిన పడకుండా తాత్కాలిక ఉపశమన చర్యలు కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను చూపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## పోలీసు భయంతో ప్రాణాలు కోల్పోయిన నిందితుడు

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 30, ప్రభాతవార్త :** భయంతో బిల్డింగ్‌పై నుండి ఓ నిందితుడు దూకి ప్రాణాలు కొల్పొయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం....బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ సన్‌సిటిలో నివాసం ఉంటున్న అస్సరుద్దీన్ నకిలీ పాస్‌పోర్టు, డ్యాక్యుమెంట్స్ సృష్టిస్తుడడంతో అతని పంచాగుట్ట పోలీసులు అరెస్టు చేయడానికి ఇంటికి వచ్చారు.ఈక్రమంలో అతని భార్యని భర్త అప్సరుద్దీన్ ఉన్నాడ అన్ని అడగడంతో వారు పోలీసులు అన్ని గమనించిన అతను భయంతో బిల్డింగ్‌పై నుండి దూకడంతో గాయాలు అయి అక్కడిక్కక్కడే మృతిచెందాడు.అయితే అస్పరుద్దీన్‌పై హైదరాబాద్ పరిధిలో 15కు పైగా కేసులు ఉన్నాయి.ఈమేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 83 మంది డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి

### హర్షం ప్రకటించిన టిజిటిఎ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించింది. 83 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఎంతోకాలంగా ప్రమోషన్లు కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి లభించడం పట్ల టిజిటిఏ హర్షం వ్యక్తం చేసింది. డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ప్రమోషన్లు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిసిఎల్ఎ నవీన్ మిట్టల్‌కి సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణవ్యాప్తంగా 81 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించింది.

## ఇందిర కుటుంబాన్ని ప్రజల నుంచి దూరం చేయలేరు

### కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** భారత ప్రధానమంత్రి మోడీ ఎంపి కంగనారనౌత్‌ను పెట్టి ఎమర్జెన్సీ ఇతివృత్తంగా సిన్మాతీసినా ఇందిర కుటుంబాన్ని ప్రజలనుంచి దూరం చేయలేరని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదంరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు కూడా ఎమర్జెన్సీని సమర్థించినదని ఆయన గుర్తు చేసుకున్నారు. ఎమర్జెన్సీని వాడుకొని మోడీ కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాలని చూస్తున్నారని ఆవేదన చెందారు. మోడీ వల్లభాయ్‌పటేల్ విగ్రహం పెట్టి మావోడని చెప్పుకొంటున్నారని ఆయన కాంగ్రెస్ రక్తం కలిగిన వ్యక్తిఅని అన్నారు. ఎమర్జెన్సీ ఇందిరాగాంధీ ఎందుకు పెట్టిందో ప్రజలకు తెలుసు అని ఆయన అన్నారు. ఎమర్జెన్సీ తెరమీదకు తేవద్దని ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వశాఖకు కోదండరెడ్డి లేఖ రాశారు.

**కాంగ్రెస్ ఎదుర్కొలేక ఎమర్జెన్సీతో రాజకీయాలు : నిరంజన్**

కాంగ్రెస్ పార్టీని బిజెపి ఎదుర్కోలేక ఎమర్జెన్సీ ముందు పెట్టి రాజకీయాలు చేస్తున్నారని టిపిసిసి ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. జయప్రకాశ్ నారాయణ ముందు పెట్టి కాంగ్రెస్‌ను బలహీన పరిచారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా కుట్రల రాజకీయంచేయడం మోడీకి తగదని హితవు చెప్పారు.

# కొత్త గనులు లేకుంటే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకం

### కార్మిక సంఘాలు సంస్థతో కలిసి నడవాలి

### సింగరేణి సిఎండి బలరాం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త :** కొత్తగా బొగ్గు గనులను ప్రారంభించక పోయినట్లయితే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థక మవుతోందని ఆ సంస్థ సిఎండి ఎన్ బలరాం ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఆరేళ్లల్లో బెలంపల్లి, మణుగూరు, ఇల్లందు గనుల మనుగడకు అవాంతరాలు ఏర్పడనున్న దృష్ట్యా కొత్త బొగ్గు గనులను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కార్మిక సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే 15 ఏళ్లలో సింగరేణిలో బొగ్గు గనులు గణనీయంగా తగ్గిపోతున్నాయని చెప్పారు. మరోవైపు నైవేలీ లిగ్నైట్, అస్సాం మినరల్, ఎన్టీపీసీ, గుజరాత్ మినరల్స్ తదితర కంపెనీలు వేలంలో గనులు దక్కించుకుని బొగ్గు తవ్వకాలు చేపట్టాయని పేర్కొన్నారు. సంస్థను ముందుకు తీసుకెళ్లేందుకు కార్మిక సంఘాలు కలసి రావాలని పిలుపు నిచ్చారు.

అంతకు ముందు కొత్త గనుల ఆవశ్యకత, ఉత్పత్తి వ్యయం, మానవ వనరుల వినియోగం, బొగ్గు రంగంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై సింగరేణి అధికారులు కార్మిక సంఘాలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తదుపరి సింగరేణి ప్రయోజనాలే తమకు పరమావధి అని, సంస్థ భవిష్యత్, కార్మికులు కోసం తాము కలిసొస్తామని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

కంపెనీ మనుగడ, సంక్షేమం, ఉపాధి కల్పను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డైరక్టర్లు ఎన్‌వికె శ్రీనివాస్, జి వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎంలు సుభానీ, జె రమేశ్, రవి ప్రసాద్, దీక్షితులు, సుబ్బారావు, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**2,364 మంది**

**బదలీ వర్కర్ల క్రమబద్ధీకరణ**

కాగా సింగరేణిలో పనిచేస్తున్న 2,364 మంది బదలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా (రెగ్యులర్) క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు బలరామ్ తెలిపారు. వీరిలో 243 మంది మహిళలు కూడా ఉన్నారు. సంస్థలో చేరినప్పటి నుండి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజుల, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యలర్ చేస్తున్నామని తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ నుండి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నట్లు వెల్లడించారు.

# విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలి

### పాఠశాల విద్య డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు తమవంతు పాత్ర పోషించాలని పాఠశాల విద్య డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి కోరారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు విషయాలపై మాట్లాడారు. ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లో ఉండటం కోసం ప్రయత్నించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు వారికి రావల్సిన హక్కుల కోసం మాట్లాడతాయని.. వాటితోపాటు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లోనే తమకు ఇళ్ల కేటాయించాలని కోరితే ఇంకా బాగుంటుందన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన కమలాకర్‌రావు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడేవారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన నిరంతరం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు కేవలం ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా మారుతున్న సమకాలీన పరిస్థితులకి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకునేవిధంగా తగిన పాత్ర పోషించాలన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పూల రవీందర్‌తోపాటు వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు. పీఆర్‌టీయూ టీఎస్ సంఘానికి చెందిన 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకి ప్రతినెలా ఒకటవ తేదిన వేతనాలు అందిస్తూ పదోన్నతులు, బదలీలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నేటితో ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యోగ విరమణ పొందనున్న బీరెల్లి కమలాకర్ రావు మాట్లాడుతూ ఎవరైనా తమకు శత్రువులు లేకుండా చూసుకోవాలన్నారు. తన హయాంలో పలు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడి పలు జీవోలు వచ్చేలా ప్రయత్నించామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# 10వేల కోట్ల విలువైన పనులు నిలిపివేత

### రేవంత్ రాజకీయ కక్షకు

### ఇది పరాకాష్ట : హరీశ్‌రావు ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుపట్టారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారిందని, అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి రేవంత్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు శుక్రవారం ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డిఎఫ్) కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు 10వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందని, రాష్ట్ర ప్రజలకు ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చిందన్నారు. దాదాపు పూర్తి కావస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్,రోడ్లు భవనాలు, నీటిపారుదల తదితర శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు.

ఫలితంగా గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియకు ఆటంకం కలిగిందని, దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తి సామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా,మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైందన్నారు.

# నవరసభరితం తిరుమంగై ఆళ్వార్ దివ్యకథ కూచిపూడి నృత్యరూపకం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 30, ప్రభాతవార్త :** పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థానం పీఠాధిపతుడు విద్యాశంకర భారతీ మహాస్వామిజీ రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జ్యోతిప్రకాసనం చేసి అనుగ్రహ భాషణం చేసిన పిదప వెంకట్ గాడేపల్లి రచన, డిఎస్‌వి.శాస్త్రి సంగీతం, గిరీష్‌చంద్ర-దేవి గిరీష్‌చంద్రల నృత్య దర్శకత్వంలో రూపొందిన తిరుమంగై ఆళ్వార్ దివ్యకథ కూచిపూడి నృత్యరూపకం ఆద్యంతం నవరస భరితంగా ప్రదర్శింపబడి విచ్చేసిన అశేష ప్రజానీక ప్రశంసలు అందుకుంది. శ్రీరామ సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు గొర్తి చంద్రశేఖర్ నేతృత్వంలో పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖల సహకారంతో నిర్వహించబడిన ఈ నృత్యరూపకం వైష్ణవ ధర్మంలో సద్గురువులుగా ప్రస్తుతించబడుతున్న 12మంది ఆళ్వారులలో ఒకరైన తిరుమంగై ఆళ్వార్ పావన జీవిత కథను కూచిపూడి నృత్యరీతిలో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డా. కె.ఐ.వర ప్రసాదరెడ్డి ప్రముఖులతో కలిసి రచయిత వెంకట్ గాడేపల్లిని, కళాకారులను ఘనంగా సత్కరించారు.



తిరుమంగై ఆళ్వార్ దివ్యకథ కూచిపూడి నృత్యరూపకంలో దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపి ఈటల రాజేందర్

## వికసిత భారత్ బిజెపితోనే సాధ్యం

### కేంద్ర హోమ్‌శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

### బిజెపి సభ్యత్వం నమోదు ప్రారంభించిన నాయకులు

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), ఆగస్టు 30, ప్రభాతవార్త:** విశ్వగురువుగా భారత్ మారాలన్నా, వికసిత్ భారత్ సాకారం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యం అవుతుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నాగోల్ శుభం కన్వెన్షన్ లో మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని పాలన, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇచ్చే బిజెపికి మరింత బలాన్ని ఇచ్చేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించామన్నారు. సభ్యత్వం నమోదు కోసం 8800002024 నంబర్ కి కాల్ చేస్తే వచ్చే లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభివృద్ధి, ప్రతిఒక్కరి సంక్షేమం కోసం పని చేసే బిజెపికి అండగా ఉండేందుకు సభ్యత్వాన్ని స్వీకరించి, పార్టీకి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరడం ప్రతి బీజేపీ నాయకుల, కార్యకర్తల బాధ్యత అన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే నినాదంతో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెడుతున్న ప్రధాని మోదీ వికసిత భారత్ లో భాగం అయ్యేందుకు ఇది చక్కటి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతిపెద్ద జానపద గీతం పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** ఐదు వేల చరణాలతో కూడిన ప్రపంచంలోనే అతిపెద్ద జానపద గీతాన్ని జానపద కళాకారుడు కుమారస్వామి రచించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**జయ సేనాపతి నవలను ఆవిష్కరించిన సిఎం రేవంత్**

మత్తి భానుమూర్తి రచించిన 'జయ సేనాపతి' నవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రతిష్టాత్మక వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ టాప్-2024 అవార్డు గ్రహీత డాక్టరన సమరేందు మొహంతి,ప్రొఫెసర్ జానయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

## 'మీ సేవ'లో మరో 9 సేవలు..

### ఇక నుంచి ఆ సర్టిఫికేట్లు ఆన్‌లైన్‌లోనే జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'మీ సేవ'లో మరో 9 సేవలను చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నాళ్లుగా తాసిల్దార్ కార్యాలయంలో మాన్యువల్‌గా అందిస్తున్న సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెస్తున్నట్లు సిసిఎల్‌ఏ కార్యాలయం ప్రకటించింది. కొత్తగా గ్యాప్ సర్టిఫికేట్,పౌరుల పేరు మార్పు,మైనారిటీ సర్టిఫికేట్,మరోసారి సర్టిఫికేట్ల జారీ(రీ ఇష్యూ) క్రిమిలేయర్,నాన్ క్రిమిలేయర్ సర్టిఫికేట్లు,మార్కెట్ విలువపై సర్టిఫైడ్ కాపీ, పాత రికార్డుల కాపీలు(ఖాస్రా,సెస్పాలా పహాణీ),1బీ సర్టిఫైడ్ కాపీలు ఇకపై ఆన్‌లైన్‌లో మీ సేవ ద్వారా అందజేయనున్నారు.

## నోటీసులు లేకుండా పేదల ఇళ్లు కూల్చడమేంటి?

### మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేదలు,దివ్యాంగుల ఇళ్లు కూల్చడమేంటని అధికారులను మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బు ఉన్నవాళ్లకు ఎన్ని నోటీసులైనా ఇస్తారు కదా? దివ్యాంగులకు సంబంధించిన ఇళ్లను ఎందుకు కూల్చారు? వాళ్లపై మీ ప్రతాపమా? పేదలు,ధనికులకు న్యాయం ఒక విధంగా,పేదలకు మరో విధంగా ఉండటమా? ప్రశ్నించారు. ఇదేనా కాంగ్రెస్ మార్పు పాలన? బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. దీనిపై మానవ హక్కుల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలి? అని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

## ట్రాఫిక్ పోలీసుల కోసం ఆయుర్వేదిక్ ఆరోగ్య శిబిరం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** అను నిత్యం వాయు, ధ్వని కాలుష్యంతో సతమతమవుతో రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం బాగుండాల నే కాంక్షతో ఆయుర్వేదిక్ వైద్యులు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ ఫౌండేషన్ అనే సంస్థ రెండు రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహించి ంది. పబ్లిక్ గార్డెన్స్ వద్ద గల ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ ఆరోగ్య శిబిరాన్ని సిటీ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే సహ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో 750 మందికి పైగా ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్య పరీక్షలు చేయించుకు న్నారు. బిపి, మధుమేహం, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, గుండె సంబంధ వ్యాధులు కలిగిన వారు, సైనసైటిస్ రోగులు, వెన్నముక నొప్పులు కలిగిన వారు ఎక్కు వగా వైద్య సేవలు పొందారు. వీరికి ఉచిత పరీక్షలు నిర్వహించిన జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ ఫౌండేషన్ సంస్థ వైద్యులు ఫణిశ్రీ కొంటె, మల్లిఖార్జున్ యాదవ్‌లు మం దులు కూడా అందించారు. కాగా ఈ ట్రాఫిక్ పోలీసులకు జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ ఫౌండేషన్ సంస్థ ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడంపై సిటీ ట్రాఫిక్ చీఫ్ వి శ్వప్రసాద్ అభినందించారు.



ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఆయుర్వేదిక్ ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న సిటీ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే.

# 26కు 'దేవాదుల' పూర్తి

>> సంవత్సరం శిలాఫలకం వేయబడ్డ దేవాదుల ప్రాజెక్టును 2026 సంవత్సరం మార్చిలోపు పూర్తిచేసి ప్రాజెక్టును ప్రారంభించి గోదావరి జలాలతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతలో పెట్టింది, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు నీటి పారుదల శాఖ పనులను నాణ్యతతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా దేవాదుల పూర్తి చేసి 5 లక్షల 57 వేల ఎకరాలకు నిరందిస్తామని అన్నారు. సమ్మక్కసాగర్ బ్యారేజి కట్టడం వల్ల 300 రోజుల పాటు 60 టిఎంసీల సాగునీరు ఎత్తిపోతల ద్వారా అందిస్తామని అన్నారు. దీని ద్వారా వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఒప్పించి ఎన్ఓసి సేకరించి సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీరు నిల్వ చేస్తామన్నారు. దేవాదుల ప్రాజెక్టునకు సంబంధించిన పెండింగ్ బిల్లులు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టు పెండింగులో ఉన్న భూసేకరణ కోసం ఇరిగేషన్ శాఖ బలోపేతం కోసం700 మంది సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను 18వేల లక్షర్‌లను ఔట్‌సోర్సింగ్‌పై నియమించామని తెలిపారు. మొ త్తం మూడు దశల్లో నిర్మాణం పూర్తి చేయాలన్న ప్రణాళికతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు ఇప్పటికే భూ సేకరణతో సహా 91% పనులు పూర్తి అయినాయి. మిగిలిన పనులు పూర్తిచేసి 2025 మార్చి నాటికి 89 వేల 312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2004 - 2005లో అప్పటి ప్రభుత్వం 6016 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టును కాలక్రమంలో ఫేజ్ -2, ఫేజ్-3లుగా విస్తరించడంతో 17 వేల 500 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకు 14 వేల188 కోట్ల ఖర్చుతో ప్రాజెక్టు నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. మొత్తం భూసేకరణ 33 వేల 224 ఎకరాలుగా నిర్ణయించగా ఇప్పటివరకు 30 వేల 268 ఎకరాలను సేకరించినారు. మరో 2 వేల 957 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి దశలో 3 రిజర్వాయర్‌లు, 4 పంపు హౌజ్‌ల ద్వారా 1 లక్షా 24 వేల ఎకరాల ఆయకట్టుకు 350 క్యూసెక్కుల నీరు అందించినారు. అదేవిదంగా రెండో దశలో 9 రిజర్వాయర్లు, 7 పంప్ హౌజ్‌ల ద్వారా 1 లక్షా 93 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించినామన్నారు. తుది దశకు చేరుకున్న మూడో దశ పూర్తి అయిన పక్షంలో 2 లక్షల 40 వేల ఎకరాల ఆయకట్టుకు 10 పంప్ హౌజ్‌ల ద్వారా 1750 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మల్టీ స్టోరేజి ఎత్తిపోతల పథకంగా పేరొందిన ఈ ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం నుండి 469 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తి పోయనున్నారు. మొత్తం 39.16 టీఎంసీల నీటిని ప్రతి సంవత్సరం 170 రోజులు నీటిని ఎత్తిపోయడం జరుగుతుందన్నారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ ద్వారా 300 రోజులు 60 టియంసిల గోదావరి జలాలను ఉపయోగం లోకి తీసుకొస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతి ఎకరానికి నీరు అందెల చూస్తామని అన్నారు. 1100 కోట్ల రూపాయలతో కాలువలలో పూడిక తీయుటకు జంగల్ క్లియరెన్స్‌కు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కొరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**రైతుని రాజును చేయడమే లక్ష్యం... మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ 2008 సంవత్సరంలో దేవాదుల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయడం జరిగిందని, సుమారు 15 సంవత్సరాలు ఈ ప్రాజెక్టు పనులు నత్త నడకగా ఉన్నాయని 2026 మార్చ్ నాటికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్టును పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ స్టోరేజ్ చేసిన నీటిని లిఫ్ట్ చేయటం జరుగుతుందని తెలిపారు.

**పేదరికాన్ని తగ్గించడానికి సాగునీరు పెంచడమే కర్తవ్యం మంత్రి సీతక్క...**

మంత్రి సీతక్క మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా ములుగు నియోజకవర్గానికి సాగునీరు రావడం లేదని, కన్నాయిగూడెం ప్రాంతంలో తుపాకుల గూడెం బ్యారేజ్ దేవాదుల బ్యారేజ్ నిర్మాణం కొరకు భూమి కోల్పోయిన రైతులకు మానవీయ కోణంలో ఆలోచించి తగినంత నష్టపరిహారం అందించాలన్నారు. రామప్ప లక్నవరం లింకును త్వరగా పూర్తిచేయాలని మంత్రి సీతక్క కోరారు.

**కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత.. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా. ప్రకాష్..**

శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం 15 సంవత్సరాల నుంచి పూర్తి కాకుండా పనులు నత్తనడక కొనసాగాయి కాని నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగిన అనంతరం సాధ్యమైనంత తొందర్లోనే ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేయడం జరిగింది తెలిపారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ ద్వారా ఎగువ నుంచి వస్తున్న నీటిని నిల్వ చేస్తూ దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు మళ్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి నీటి మళ్లింపు విషయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక ద్వారా నీటిని అందించాలని అన్నారు.

**60 టిఎంసీల గోదావరి జలాలను ఉపయోగించుకోవచ్చు కడియం శ్రీహరి ఎమ్మెల్యే.**

కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ నిర్మాణం జరిగిన అనంతరం దేవాదుల ఎత్తిపోతుల పథకం ద్వారా నీటిని నిరంతరం లిఫ్ట్ చేసే అవకాశం వచ్చిందని అన్నారు. 300 రోజులు నీటిని లిఫ్ట్ చేయడం ద్వారా 60 టియంసిల గోదావరి జలాలను ఉపయోగించుకోవచ్చు. దీని ద్వారా అనేక ప్రాంతాలకు సాగు నీటిని అందుతుందని అన్నారు. 3 వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని ఫేజ్ 3లో రామప్ప వరకు గోదావరి నది జలాలలను మళ్లించడం జరిగిందని రామప్ప నుంచి ధర్మసాగర్ వరకు ధర్మసాగర్ నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని మళ్లించాల్సి ఉంటుందని దానికోసం టెన్నెల్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు. శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశశ్విని రెడ్డి, డాక్టర్ మురళి నాయక్ తమ తమ నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ కాలువల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర సాగునీటి సమస్యలు గురించి మంత్రులకు వివరించారు. ఏటూరునాగారంలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క.. ఫిష్ మార్కెట్ నుంచి వై జంక్షన్ వరకు సిఆర్ఆర్ 75 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను సుమారు 30 లక్షల నిధులతో నిర్మించిన మండల ప్రజాపరిషత్ కార్యాలయం అదనపు గదుల భవనంను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌తోకలిసి ప్రారంభించారు.

# 'ఓహ్!' మూవీ టీజర్ విడుదల

జీవిత బడుగు సమర్పణలో ఏకారి ఫిలిమ్స్ పతాకంపై రఘురామ్ హీరోగా, శృతిశెట్టి, నైనా పాఠక్ హీరోయిన్స్‌గా ఇదివరకే పలు చిత్రాలకి దర్శకత్వం వహించిన సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం "ఓహ్!". కులుమనాలి, ఆగ్రా, గోవా, హైదరాబాద్, వరంగల్ వంటి అందమైన ప్రదేశాలలో షూటింగ్ పూర్తి చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైన సందర్భంగా చిత్ర టీజర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లో ఇటీవల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ సినీ గేయ రచయిత భాష్యశ్రీ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. అనంతరం చిత్ర సమర్పకురాలు బి.ఆర్.గ్రూప్స్ అధినేత్రి శ్రీమతి జీవిత బడుగు మాట్లాడుతూ "మేం మా బిజినెస్ లో కస్టమర్స్‌కు అద్భుతమైన క్వాలిటీ అందిస్తున్నారు" అన్నారు. దర్శక నిర్మాత సత్యనారాయణ ఏకారి మాట్లాడుతూ "ఐదు చిత్రాలను నిర్మించిన అనుభవంతో ఒక కొత్త జోనర్‌లో, క్రోమో ఫోబియోని పాయింట్‌గా తీసుకొని ఈ చిత్రం రూపొందించాం. కాశ్మీర్ ప్రాంతంలో పూర్తి షూట్ చేసాం" అని తెలిపారు. హీరో రఘురామ్ "ఓహ్" మూవీలో మీ అందరి ముందుకు వస్తున్నాను. సిల్వర్ స్క్రీన్ మీద ఇంత వరకు రానటువంటి అందమైన ప్రేమకావ్యంతో సాక్షాత్ ఆ పరమ శివుడు కొలువై ఉన్న హిమాలయాలు అంతా స్వచ్ఛమైన చిత్రమిది" అని అన్నారు. సినీ రచయిత భాష్యశ్రీ "మూవీ టైటిల్‌తో పాటు టీజర్ చాలా బాగుంది. కాశ్మీర్ మంచుకొండలలో హీరోయిన్ అందాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కెమెరా వర్క్ చాలా బాగుంది" అన్నారు. హీరోయిన్ పాయల్ మాట్లాడుతూ "యూత్‌కి కావాల్సిన అన్ని హంగులు, రొమాన్స్ కూడా ఇందులో ఉన్నాయి. మీరు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు. రఘురామ్, శృతిశెట్టి, నైనా పాఠక్ ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా కల్పగురి భిక్షపతి, మనోజ్, కరణ్ తదితరులు సహాయ పాత్రల్లో నటిస్తున్నారు.




# 'శ్వాగ్' టీజర్ లాంచ్ ఈవెంట్

హీరో శ్రీవిష్ణు

కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు వైవిధ్యమైన పాత్రలతో అదరగొడుతున్నారు. ఎంటర్టైన్మెంట్‌తోఆకట్టుకునే సబ్జెక్టలను బ్యాలెన్స్ చేయడంలో పేరు పొందిన శ్రీవిష్ణు సూపర్ హిట్ 'రాజ రాజ చోర' తర్వాత డైరెక్టర్ హసిత్ గోలీతో తన సెకెండ్ కొలాబరేషన్‌గా 'శ్వాగ్'తో అలరించబోతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ ఈ రోజు ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. శతాబ్దాల క్రితం పురుషుల ఉనికికే ముప్పు పొంచి ఉన్న కాలంలో, వింజమర వంశానికి చెందిన రాణి రుక్మిణీ దేవి పురుషులపై తీవ్రమైన ద్వేషాన్ని పెంచుకుంది. తనకు ఒక కొడుకు పుడితే చంపడానికి కూడా వెనకాడదు. అయితే రాజవంశంపై ఒక శాపం చివరికి పరిస్థితి రివర్స్ చేస్తుంది. ఇది క్రమంగా మార్పుకు దారితీస్తుంది. అక్కడ పురుషులు స్త్రీలపై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభిస్తారు. శ్రీవిష్ణు, హసిత్ గోలీ కాంబినేషన్‌లో ఎంటర్‌టైన్మెంట్ గ్యారెంటీగా ఉంటుంది. ఈసారి, వారు యూనిక్ బ్యాక్ డ్రాప్‌లో బలమైన కథతో ఎంటర్‌టైన్ చేయబోతున్నారు. ఇండియన్ సినిమాలో ఇంతకు ముందు టచ్ చేయని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉంటాయి. అవి నెక్స్ట్ ప్రమోషనల్ మెటీరియల్‌లో రివీల్ అవుతాయి. శ్రీవిష్ణు.. కింగ్, భవభూతి, సింగ, యయాతి వంటి విభిన్నమైన పాత్రలలో అద్భుతంగా అలరించారు. క్వీన్ రుక్మిణీ దేవిగా రీతూ వర్మ మెప్పించింది. టీజర్‌లో మీరాజాస్మిన్, సునీల్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్ వంటి ఇతర పాత్రలు కూడా కీలకంగా ఉన్నాయి. వేదరామన్ శంకరన్ కెమెరా పనితనం ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంది. వివేక్ సాగర్ ఆకట్టుకునే స్కోర్‌తో ప్రతి ఎలిమెంట్‌ను ఎలివేట్ చేశాడు. జీఎం శేఖర్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ని నిర్వహిస్తుండగా, నందుమాస్టర్ స్టంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. క్రేజీ అండ్ ఫన్‌ఫుల్ టీజర్ విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలను పెంచింది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీవిష్ణు.. మగ మహారాజులకు, మకుటం లేని మహారాణులకు స్వాగనిక వంశానికి స్వాగతం. టీజర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా వుంది. ఇలాంటి కథ నాకు ఇచ్చిన హసిత్‌కు చాలా థాంక్స్. చాలా గొప్ప కథ. ఇండియన్ స్క్రీన్‌లో ఇప్పటివరకూ రాలేదు. ఇది మన అందరి ఇళ్లలో వున్న పాయింట్ అయినా స్క్రీన్‌పైకి ఇప్పటి వరకూ రాలేదు. ఇలాంటి కంటెంట్‌ని సినిమా చేయడానికి ముందుకు వచ్చిన నిర్మాత విశ్వప్రసాద్‌కి థాంక్‌యూ. ఇలాంటి సినిమా చేయాలంటే చాలా దమ్ముండాలి. టీంలో అందరికీ థాంక్ యూ. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం అన్నారు. నిర్మాత టి.జి. విశ్వప్రసాద్.. శ్రీవిష్ణు, హసిత్‌తో కలిసి రాజరాజ చోర సినిమా చేశాం. ఇది మా సెకండ్ మూవీ. ఇది కంటెంట్ డ్రివెన్ వెరైటీ మూవీ. కమల్‌హాసన్ ఇంద్రుడు చంద్రుడు సినిమా చూసిన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఒక మంచి వెరైటీ కంటెంట్‌ని ఇస్తున్నామని అనుకుంటున్నాం' అన్నారు. డైరెక్టర్ హసిత్ గోలీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. టీజర్‌తో కొంత అర్ధమై వుంటుంది. జనరేషన్‌గా వస్తున్న జెండర్ వార్ టచ్ చేసి వుంది. టీజర్‌లో కొంచెం చెప్పాం. ఇది అచ్చతెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. ఇండియన్ కంటెంట్‌లో ఇప్పటి వరకూ రాలేదు. తాతలు ముత్తాతలతో పాటు చూడ గలిగే సినిమా. విష్ణు గ్రేట్ పెర్ఫార్మర్. అన్ని క్యారెక్టర్స్ అద్భుతంగా చేశారు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఇలాంటి యూనిక్ కంటెంట్‌కి సపోర్ట్ చేసిన విశ్వగారికి చాలా థాంక్ యూ అన్నారు. సినిమాటోగ్రాఫర్‌గా వేద రామన్ శంకరన్ మాట్లాడుతూ, హలో ఆల్. వెల్ కం టూ వరల్డ్ ఆఫ్ శ్వాగ్. ఎంజాయ్ అన్నారు. ఎడిటర్ విప్లవ్ మాట్లాడుతూ, టీజర్ చిన్న పార్ట్. మూవీలో దీనికి వందరెట్లు చూస్తారు. ఒక్కొక్క క్యారెక్టర్ ఒక్కొక్క ప్రపంచం. చాలా ఎంజాయ్ చేస్తారు అన్నారు. నటీనటులు: శ్రీవిష్ణు, రీతూవర్మ, మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ. సాంకేతిక సిబ్బంది: నిర్మాత టి.జి. విశ్వప్రసాద్, రచన అండ్ దర్శకత్వం: హసిత్ గోలి, సహనిర్మాత: వివేక్ కూచిబొట్ల, క్రియేటేవ్ ప్రొడ్యూసర్: కృతిప్రసాద్, సినిమాటోగ్రాఫర్: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్, ఎడిటర్: విప్లవ్ నైషధం, ఆర్ట్ డైరెక్టర్: జీఎమ్ శేఖర్,స్టైలిస్ట్: రజనీ, కొరియోగ్రఫీ: శిరీష్‌కుమార్, స్టంట్స్: నందుమాస్టర్, పబ్లిసిటీ డిజైన్స్: భరణి ధరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనునాగవీర, లిరిక్స్: భువన చంద్ర, రామజోగయ్య శాస్త్రి, జొన్న విత్తుల, నిఖిలేష్ సుంకోజీ, స్వరూప్ గోలి, సౌండ్ డిజైన్: వరుణ్ వేణుగోపాల్, కోడైరెక్టర్: వెంకీ సురేందర్ (సూర్య) విఎఫ్ఎక్స్ అండ్ డిఐ: దక్కన్ డ్రీమ్స్, కలరిస్ట్: కిరణ్, విఎఫ్ఎక్స్ సూపర్ వైజర్: వి మోహన్ జగదీష్ (జగన్), డైరెక్షన్ టీం: ప్రణీత్, భరద్వాజ్, ప్రేమ్, శ్యామ్, కరీముల్లా.



# 'కూలీ' నుంచి సైమన్‌గా కింగ్ నాగార్జున పరిచయం

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్' బ్లాక్ బస్టర్ తర్వాత ప్రస్తుతం తన ఎల్‌సియు నుండి బ్లాక్ బస్టర్‌లతో అదరగొడుతున్న సెన్సేషనల్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా చేస్తున్నారు. ఇది రజనీకాంత్‌కి 171 మూవీ. సన్‌పిక్చర్స్ నిర్మిసోనతన్న ఈ సినిమా టైటిల్ రివీల్ టీజరర్ కు మ్యాసీవ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో సత్యరాజ్ సాబిన్ షాహిర్, ఉపేంద్ర, శృతిహాసన్, మహేంద్రన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మరింత స్టార్ పవన్‌ను జోడించడానికి మేకర్స్ కింగ్ నాగార్జున ప్రత్యేక పాత్రలో పోషించినట్లు నాగార్జున పుట్టిన రోజు అనౌన్స్ చేశారు. నాగార్జునను సైమన్ పరిచయం చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్ డైనమిక్ అవతార్‌ను ప్రజెంట్ చేస్తోంది. స్టైలిష్ షేడ్స్ మెరుస్తున్న గోల్ట్ వాచ్‌తో కనిపించిన ఫస్ట్‌లుక్ అదిరిపోయింది. నాగార్జున చేరికతో స్టార్ పవర్‌నెక్స్‌కి వెళ్లింది. రజనీకాంత్, నాగార్జున అభిమానులకు ఇది గ్రేట్ టీట్. నాగార్జున పాత్రకు సంబంధించిన మర్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో టప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. గిరీష్ గంగాధర్ కెమెరామ్యాన్‌గా పని చేస్తున్నారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్. ఈసినిమా 2025 విడుదల కానుంది. తారాగణం: రజనీకాంత్, నాగార్జున, సత్యరాజ్, సాబిన్ షాహిర్, ఉపేంద్ర, శృతి హాసన్, మహేంద్రన్. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: లోకేష్ కనగ రాజ్, నిర్మాత: కళానిధి మానన్, బ్యానర్: సన్ పిక్చర్స్, సంగీతం: అనిరుద్ రవిచం దర్, డీవోపీ: గిరిష్ గంగాధరన్.



# కొత్త ఎన్‌టిఆర్ రంగంలోకి..

తెలుగు చిత్ర సీమలో విశిష్టమైన నందమూరి వారత్వాన్ని మరింత ముందుకు తీసుకు వెళుతూ, లెజెండరీ శ్రీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత శ్రీ జానకిరామ్ తనయుడు యంగ్ చాప్ నందమూరి తారకరామారావు ఫిలిమ్స్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో తెలుగమ్మాయి వీణ రావ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. డైనమిక్ డైరెక్ట్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌ని 'న్యూ టాలెంట్‌రోర్స్' బ్యానర్ పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. కింగ్ అక్కినేని నాగార్జున సెలబ్రేట్ చేసుకుంటూ, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ముఖ్యమైన అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా 1980 నేపథ్యంలో వుంటుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ, సభకు నమస్కారం ఈ సినిమాకి సంబంధించిన మొదటి ఈవెంట్ మీ అరాధ్య దైవం నందమూరి తారక రామారావు అబ్బాయి నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజున జరుపుకున్నాం. రెండో ఈవెంట్ నేను మిత్రుడిగా భావించే సూపర్ స్టార్ మహేష్‌బాబు బర్త్‌డే సందర్భంగా జరుపుకోవడం అక్కినేని నాగార్జున నాలో ప్రతిభని గుర్తించి దర్శకుడిగా జన్మనిచ్చారు. ఆయన నాకు గాడ్‌ఫాదర్. ఆయన బర్త్‌డేని పురస్కరించుకొని ఈ మూడో వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉంది. అన్నారు. లిరిక్ రైటర్ చంద్రబోస్ మాట్లాడుతూ, 'తెలుగు భాష తియ్యదనం. తెలుగు జాతి గొప్పతనం. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఒక మూలధనం అని ఒక పాటలో రాశారు. ప్రపంచంలో అత్యంత మధురమైన భాషల్లో రెండోవది తెలుగు. ప్రపంచంలో అత్యంత సుందరమైన లిపి కలిగిన భాష తెలుగు. రెండు రాష్ట్రాల ప్రజలు మాట్లాడే భాష తెలుగు. తెలుగు భాషలో మాధుర్యం, సౌందర్యం చాటి చెప్పేలా ఎందరో కవులు చక్కని పాటలు రాశారు. ఈ సినిమాలు మరిం అందమైన అర్ధవంతమైన పాటలు రాసే అవకాశం రాబోతోంది. ఈ సినిమా ద్వారా మరిన్ని మంచి పాటలు తెలుగు సినిమాకి భాషకి అందిస్తాననే విశ్వసం వుంది అన్నారు. డైలాగ్ రైటర్ మాధవ్ బుర్రా మాట్లాడుతూ, అందరికీ తెలుగు భాషా దినోత్సవం శుభాకాంక్షలు. చౌదరి చాలా మంది నటీనటులతో పాటు నిర్మాతని కూడా పరిచయం చేస్తున్నారు. తెలుగు భాస గొప్పదనం గురించి తెలుగువాళ్లకు చెప్పడం విచిత్రమైన పరిస్థితి. తెలుగు భాష బ్రతకుతెరుకుకాదు. తెలుగంటే అమ్మ. తెలుగు గొప్ప భాష. పద్యం తెలుగుకే సొంతం. ఇప్పుడున్న సమాజంలో మార్పు రావాలంటే తల్లితండ్రులు ఉపాధ్యాయులు పిల్లలకు తెలుగు నేర్పించండి అని కోరారు. నిర్మాత యలమంచి మాట్లాడుతూ, రమేష్ నేను కలిసి ఈ బాధ్యతని సక్సెస్ ఫుల్‌గా నిర్వహిస్తామని నమ్ముతున్నాం. వైవి చౌదరి, కీరవాణి, చంద్రబోస్, సాయి మాధవ్ బుర్రాతో అసోసియేట్ కావడం ఆనందంగా వుందిఅన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రోడ్యూసర్ రమేష్ అత్తిలి మాట్లాడుతూ, అందరికీ తెలుగు భాషా దినోత్సవం శుభాకాంక్షలకు. చౌదరి చాలా మందిని పరిచయం చేశారు. ఇప్పుడు ఈ ప్రొడక్షన్ హౌసల్ ద్వారా మమ్మల్ని పరిచయం చేస్తున్నారు. సినిమా అనేది ఒక విశ్వవిద్యాలయం.




# 'క్యూ జి' కొటేషన్ గ్యాంగ్ వాయిదా

'క్యాజీ గ్యాంగ్ వార్' ఎన్జీఆర్ శ్రీను సమర్పణలో వస్తున్న ఈ మూవీకి సంబంధించి తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ హక్కులను రుషికేశ్వర్ ఫిల్మ్స్ బ్యానర్ కింద నిర్మాత వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. విడుదల కావాల్సిన ఈ సినిమా కొన్ని సాంకేతిక ఇబ్బందుల వల్ల విడుదల వాయిదా పడింది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తామని మూవీ టీం తెలపడం జరిగింది. నటీనటులు: జాకీ ష్రాఫ్, ప్రియ మణి, సన్నీలి యోన్. సారా అర్జున్.

జాకీ ష్రాఫ్, ప్రియ మణి, సన్నీ లియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ

సాంకేతిక నిపుణులు: నిర్మాతలు: ఎం. వేణు గోపాల్ కన్నన్, గాయిత్రి సురేష్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: అరుణ్ పద్మనాభన్, డైరెక్టర్:వివేక్ కుమార్ కన్నన్, సంగీతం: డ్రమ్స్ శివమణి,ఎడిటర్: కె.జె.వెంకట రమణన్, డిజిటల్ మీడియా: డిజిటల్ దుకాణం, పీఆర్ఓ: మధు విఆర్.



# టీజర్ గ్రాండ్ లాంచ్ 'ఉద్వేగం'

కళా సృష్టి ఇంటర్నేషనల్, మని దీప్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్ పై మహిపాల్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం ఉద్వేగం ఫస్ట్‌కేసు. ఈ చిత్రానికి శంకర్‌లు కలువు మధు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్రిగున్ ప్రధాన పాత్రలో, శ్రీకాంత్ అయ్యంగార్ విభిన్న పాత్రలో నటిస్తున్న ఉద్వేగం చిత్రానికి సంబంధించిన టీజర్ తాజాగా విడుదలైంది. ప్రముఖ సెన్సేషనల్ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ చేతులు మీదుగా ఈ చిత్రం టీజర్ రిలీజైంది. ఈ చిత్రంలో త్రిగున్, శ్రీకాంత్ భరత్, సురేష్‌నాయుడు, పరుచూరి గోపాల కృష్ణ, శివకృష్ణ, ఐడ్రీమ్ అంజలి తదితరులు నటిస్తున్నారు. ఈసందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ట్రైలర్ చూసిన తరువాత చాలా సిన్సియర్ అటెప్ట్ అనిపించిందని ఆర్జీవి అన్నారు. అంతేకాకుండా చాలా సహజంగా యాక్టింగ్ చేసినట్లు ట్రైలర్ చూస్తుంటే అర్థం అవుతుంది. ఈ చిత్రం కచ్చితంగా తెలుగు పరిశ్రమలో వండర్ క్రియేట్ చేయబోతుందని పేర్కొన్నారు. ముందుగానే సినిమా దర్శక నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. అలాగే యాక్టర్ ఆదిత్య 25వ చిత్రం, అలాగే త్రిగున్ సైతం 25వ చిత్రం ఉద్వేగం అని, శ్రీకాంత్ అయ్యంగార్ లాంటి యాక్టర్ ఈ చిత్రంలో పని చేయడం గ్రేట్ అని ఆర్టీవీ పేర్కొన్నారు. కోర్టు రూమ్ డ్రామాలు విజువల్‌గా చూడడానికి చాలా అద్భుతంగా ఉంటాయని, ఈ చిత్రం ట్రైలర్ చూసినప్పుడు అదే ఉద్వేగాన్ని కలిగించదని ఆర్జీవీ తెలిపారు. కోర్టు డ్రామాల్లో మంచి సస్పెన్స్ ఉంటుంది. తెలుగులో వచ్చిన వకీల్ సాబ్ చిత్రం తరువాత అంత డ్రామా, సస్పెన్స్ ఉన్న చిత్రం ఉద్వేగం అవుతుందని తెలుస్తుంది. టీజర్ చూస్తే కచ్చితంగా ఎమోషన్స్ సైతం ఉన్నట్లు టీజర్ చూస్తే అనిపిస్తుంది. ఇక లాను బేస్ చేసుకొని తెరకెక్కుతున్న చిత్రం కాబట్టి ప్రేక్షకులకు ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు నాలెడ్జ్ కూడా అందిస్తుందని అర్థం అవుతుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్ అందిస్తామని చిత్ర బృందం వెల్లడించింది. చిత్రం: ఉద్వేగం, నటీనటులు: త్రిగున్, శ్రీకాంత్ , భరత్,సురేష్ నాయుడు, పరుచూరి గోపాల కృష్ణ, శివకృష్ణ, ఐడ్రీమ్ అంజలి తదితరలు. సంగీతం: కార్తీక్ కొడగండ్ల, సినిమాటోగ్రఫీ: అజయ్, ఎడిటర్: జశ్వీన్ ప్రభు, పీఆర్ఓ: హరీష్, దినేష్, నిర్మాత: శంకర్‌లు కలపు మధు, దర్శకుడు: మహిపాల్ రెడ్డి.



# 'స్టేట్ వర్సెస్ నో బడీ' లాంచ్

నాని ప్రజెంట్స్, ప్రియదర్శి, రామ్ జగదీష్, ప్రశాంతి తిపిర్నేని, వాల్ పోస్టర్ సినిమాస్ ఫిల్మ్ టైటిల్ కోర్టు స్టేట్ వర్సెస్ ఎనోబడీ గ్రాండ్‌గా లాంచ్ సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం వాల్‌పోస్టర్ సినిమా కమర్షియల్‌గా విజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు కూడా పొందాయి. బ్యానర్ నుంచి వచ్చిన ప్రాజెక్టుకు నాని ప్రజెంట్‌గా,సపోర్ట్ ఇస్తున్నారు. ప్రియదర్శి లీడ్ రోల్ రామ్ జగదీష్ దర్శకుడిగా పరిచయమవుతున్న న్యూ మూవీని అనౌన్స్ చేశారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ చిత్రానికి కోర్ట్ స్టేట్ వర్సెస్ ఎ నోబడీ అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. బోనులో న్యాయదేవత, శాంతి చిహ్నాలుగా ఎగురుతున్న పావురాలు వున్న టైటిల్ లుక్ పోస్టర్ చాలా క్యూరియాసిటీ పెంచింది. అన్యాయంగా ఓ కేసులో ఇరికించి ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయ పోరాటం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రియదర్శి లాయర్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా లాంచ్ అయింది. ప్రియదర్శిపై షూట్ చేసిన ముహుర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రశాంతి కెమెరా స్విచాఫ్ చేశారు.తొలిషాట్ జెమినీ కిరణ్ దర్శకత్వంవహించారు. సెప్టెంబర్ రెగ్యులర్‌షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్షరోషన్, శ్రీదేవి, కీలకపాత్రలు పోషిస్తున్నారు. టాలెంటెడ్ టెక్నిషియన్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. దినేష్ పురు షోత్తమ్ నిర్వహిస్తుండగా విజయ్ బుల్గాని సంగీతం అందిస్తున్నారు. విఠల్ కోసనం ఆర్ట్ డైరెక్టర్.





# జ్ఞాపకాలతో ఆదాయం !



**మనలో ప్రతి ఒక్కరికీ నచ్చిన వ్యాపకాలు ఉంటాయి. కానీ వాటిని ఏదో ఒక దశలో వదిలేస్తుంటాం.** అలాకాకుండా ఇష్టంగా కొనసాగిస్తే.. అవే మనకు గుర్తింపు అవుతాయి. అందుకు తేజస్వినే ఉదాహరణ. ఆర్ట్‌తో గుర్తింపు తెచ్చుకోవడమే కాదు, ఆదాయాన్నీ పొందుతోంది. అదెలాగో మనతో పంచుకుందిలా.. చిన్నప్పుడు ఇష్టంగా తిన్న కొబ్బరి చాక్లెట్, సేమియా ఐస్, ఆటలు, రాత్రుళ్లు ఆరుబయట నక్షత్రాలను చూస్తూ విన్న కథలు.. ఒకటా రెండా ఎన్నెన్ని జ్ఞాపకాలు. ఇప్పుడంటే బంధించడానికి కెమరాలున్నాయి. గతంలో అవి అందరికీ అందుబాటులో లేవు. అందుకే వాటి తాలూకా చిహ్నాలే కనిపించవు. కానీ తలుచుకున్నప్పుడల్లా మనసుని ఆనందంలో ముంచెత్తుతాయి. అందుకు నేనూ మినహాయింపు కాదు. కాబట్టే, నా ఊహల్లోని అనుభూతులకి డిజిటల్ రూపమిచ్చా. అవే నాలో గుర్తింపు తెచ్చాయి. మాది చిత్తూరు. కానీ బెంగళూరులో స్థిరపడ్డాం. మావారు దినేష్ కూడా నాలాగే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. చిన్నప్పట్నుంచీ నాకు బొమ్మలేయడం అంటే ఇష్టం. లాక్‌డౌన్‌లో ఇంట్లోనే కదా! మరింత దృష్టిపెట్టా. నచ్చినవి వేసి, స్నేహితులకు బహుమతు లుగా ఇచ్చేదాన్ని. వ్యక్తుల బొమ్మలూ ప్రయత్నించా. వీటన్నింటినీ ఇన్‌స్టాలో పెడితే ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. పెన్సిల్ ఆర్ట్ ఒక్క బొమ్మ గీయడానికి గంటలు పడుతుంది. అంతా చేసి, ఫ్రేమ్ కట్టించి కొరియర్ చేస్తే కొన్ని పగిలిపోయేవి. అలా శ్రమ వృథా అవుతోంటే చాలా బాధేసేది. తిరిగి మళ్లీ వేయాలి. అప్పుడే డిజిటల్ ఆర్ట్ పరిచయమైంది. నచ్చింది కానీ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ అంటూ బోలెడు కావాలనుకున్నా. తీరా ఫ్రెండ్ ఫోన్‌లోనే వేయొచ్చు అని చెబితే ప్రయత్నించా. నా ఊహలన్నింటికీ రూపమిచ్చా. అవి చాలామందికి చేరువయ్యాయి. ఓ రోజు 'గోదావరి కథానిక' అనే పుస్తకానికి కవర్ పేజీ చేసిమ్మని రచయిత్రి సంప్రదించారు. మొదట సందేహించినా చేసిచ్చా. నాపై నాకు ఆత్మవిశ్వాసం పెరిగిన సందర్భమది. అంతేకాదు, దీన్నీ ఆదాయమార్గం చేసుకోవచ్చని తెలిసొచ్చింది. ఈసారి షార్ట్‌ఫిల్మ్‌కి స్టోరీ బోర్ట్ అవకాశం వచ్చింది. కానీ వాళ్లు 'ఐప్యాడ్'లోనే చేసివ్వాలన్న షరతు పెట్టారు. నా దగ్గర లేదు. దీంతో వాళ్లే ఇస్తామన్నారు కానీ.. వాళ్ల దగ్గరికొచ్చి చేయాలన్నారు. ఉద్యోగినిని.. అది కష్టమై వదులుకున్నా. కానీ చాలా బాధపడ్డా. ఆ విషయం తెలిసి నాననన కొనిచ్చారు. ఇక నా పని సులువైంది. నాకెలాగూ రాత్రి, సాయంత్రం షిఫ్ట్‌లే. పగలంతా బొమ్మలు గీయడమే పని. కదిలే బొమ్మలు మరింత బాగుంటాయని యానిమేషన్‌నీ జత చేశా. చిన్ననాటి సంగతులతో వీడియోలు రూపొందిస్తే వైరల్ అయ్యాయి. ప్రతిదానికీ లక్షల్లో వ్యూస్ ఉండేవి. దీంతో బ్రాండ్‌లూ, ఎన్‌జిఓలు సంప్రదించాయి. పెళ్లికార్డులూ డిజైన్ చేస్తున్నా. అయితే నేనెక్కడా ఆర్ట్ నేర్చుకోలేదు. యానిమేషన్‌తో సహా యూట్యూబ్‌లో చూసే నేర్చుకున్నా. నన్ను నేను మెరుగులు దిద్దుకుంటూ వచ్చా. అలాంటిది నా జీతంతో సమానంగా.. వ్యాపకంతో అయిదంకెల మొత్తాన్ని సంపాదిస్తోంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేను. ఒకప్పుడు కళ్లు పోతాయని అమ్మ తిట్టేది. అందుకే కనిపించకుండా దొంగతనంగా వేసినరోజులున్నాయి. ఇప్పుడు కాస్త ఖాళీగా కనిపిస్తే ఎంటీ ఆర్డర్లు లేవా? అని అడుగుతోంది. నా ప్రతిభకు గుర్తింపేగా ఇది! చాలా సున్నితమైన విషయాన్నీ ఆర్ట్‌ద్వారా అర్థమయ్యేలా ప్రభావవంతంగా చెప్పొచ్చు. అందుకే దీనిలో మరింత రాణించి, స్థిరపడాలనీ ఉంది. □

# అందరికీ వైద్య సేవలు అందాలనే ..

**సాంకేతికత సాయంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అదించాలనుకున్నారు యూపికి చెందిన అన్నాచెల్లెళ్లు శుభాంగ్ టాండన్, స్మృతి, 'ఆన్‌లైన్ చికిత్స మిత్ర' పేరుతో ఆన్‌లైన్ వైద్య సేవలు, ఇ-క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల వారికి మెరుగైన వైద్యం అందని నద్రాక్షే. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం తగిన చికిత్స అందక ప్రాణాలు పోగొట్టుకున్న ఉదంతాలు బోలెడు. అయితే, పాశ్చాత్య దేశాల్లో అలాకాదు. దాన్నే గమనించారు శుభాంగ్, స్మృతిలు, వాటికి తమదైన పరిష్కారం చూపించాలనుకుని కలిసి నడిచారు. అనన శుభాంగ్ అమెరికాలోని జార్జియాలోని ఎమ్ఐటి పూర్వవిద్యార్థి. కొన్నాళ్లు యురేకా ఫోర్బ్స్‌లో పనిచేశాక సొంతంగా 2016లో పాథ్‌ల్యాబ్స్ అనే సంస్థను స్థాపించాడు. ఆ తరవాత అదే సంవత్సరం సోదరితో కలిసి ఆన్‌లైన్ చికిత్స మిత్ర (ఓసిఎమ్) స్టార్టప్‌నీ ఆరంభించాడు. చెల్లి స్మృతి లివర్‌పూల్ యూనివర్సిటీలో బిఏ ఆనర్స్ చేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలనూ అందుకుంది. ఆ తరవాత దాదాపు సంవత్సరం పాటు ఆటోమొబైల్ ఇండస్ట్రీలో పని చేసింది. ఈ అనుభవంతోనే ఆన్‌లైన్ చికిత్స మిత్ర నిర్వహణ బాధ్యతలు అందుకుంది. యూజర్ ఫ్రెండ్లీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా వైద్యులకు, రోగులకు మధ్య అనుసంధానకర్తగా పనిచేస్తుంది. భౌగోళిక దూరాలతో సంబంధం లేకుండా నిపుణులైన వారితో వైద్య చికిత్సలు అందుకునే అవకాశం కల్పిస్తోంది.

**ఎన్నో ఇబ్బందులు...** నర్సింగ్ సిబ్బంది, ప్రాథమిక రోగ నిర్ధారణ సాధనాలతో ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ముందు గ్రామ పెద్దలతో మాట్లాడి కమ్యూనిటీ హెల్త్ క్యాంపులను నిర్వహించారు. ఆపై టెక్ అవగాహన ఉన్న వినియోగదారులకు దగ్గరవడానికి, డిజిటల్‌గా తమ పరిధిని విస్తరించుకోవడానికి సోషల్‌మీడియా ద్వారా ప్రచారమూ చేపట్టారు. చివరి ప్రయత్నంగా మెడికల్ స్టోర్ యజమానుల భాగస్వామంతో ఈ-క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ చికిత్స మిత్రని కొవిడ్ ముందు కాలంలో ప్రారంభించడం వల్ల.. ఆన్‌లైన్ వైద్యం ఆచరణలోకి రావడానికి చాలా సమయం పడుతుంది అనిపించేది. పల్లెల్లో అందుబాటులో లేని ఇంటర్నెట్, మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ లేకపోవడం.. వంటివి అడ్డంకిగా మారాయి. వీటికితోడు యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లను వృద్ధి చేయడం, స్థానిక భాషల్ని సాంకేతికతతో అనుసంధానం చేయడం వంటి మరికొన్ని సవాళ్లూ ఎదురయ్యాయి. ఇక, అంతా బాగుంది అనుకున్న సమయంలో కొవిడ్ లాక్‌డౌన్ మొదలవడంతో ఈ-హబ్‌లు మూతపడ్డాయి. తరవాత కాలంలో అంతా ఇంటి నుంచే వైద్య సేవలు అందుకోవడానికి ఇష్టపడటంతో మా 'ఈ-క్లినిక్' కాన్సెప్ట్ సక్సెస్ అయ్యింది అంటారు స్మృతి.





**మందుల రిమైండర్లు...** క్రమంగా ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఈ ఓసిఎమ్ ద్వారా ఇంటర్నెట్ కనెక్టివిటీ లేనివారికి ఫిజికల్ యాక్సెస్ పాయింట్లను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రితో పోటీపడుతూ.. మందుల రిమైండర్లు, ఫాలో అప్ షెడ్యూలింగ్, డిజిటల్ హెల్త్ రికార్డుల నిర్వహణ వంటివాటితో దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణ చేపట్టారు. ప్రయాణ అవసరాన్ని తగ్గించి మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడంతో తమ పరిధిని విస్తరించుకోగలిగారు. మేం ఇప్పటివరకూ పదిహేను రాష్ట్రాల్లో 500లకు పైగా ఈ-క్లినిక్‌ల నెట్‌వర్క్ ఏర్పాటు చేశాం. ఇప్పటివరకూ లక్ష మందికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వైద్య సేవలు అందించాం. ఈ ప్రయత్నం వైద్య సేవల్ని మెరుగుపరచడంతోపాటు గ్రామీణ సాధికారతకు, ఆరోగ్యకరమైన సమాజానికి ఉపయోగ పడుతుందని అంటారు స్మృతి ద్వయం. □

# తేలిక పట్టు అందాలు



శుభాల శ్రామణంతో పండుగలు మొదలు అయ్యాయి. పండుగలు, పెళ్లిళ్లు ఒకటేమిటి ఎన్నెన్నో కార్యక్రమాలు. వేడుక ఏదైనా లక్ష్మీకళ ఉట్టిపడేలా కనిపించాలని మగువల ఆరాటం. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఫ్యూజన్ ట్రెండ్స్ ఎన్నో రకాలు వచ్చిపోతుంటాయి. కానీ దక్షిణ భారతంలో మాత్రం ప్రత్యేక సందర్భం అంటే పట్టు కట్టాల్సిందే. వీటిల్లోనూ ఎన్నో రకాలు. మరి ఏం ఎంచుకోవాలన్న ప్రశ్న రానే వస్తుంది. కంచి, బెనారస్, మంగళగిరి, ఉప్పాడ సిల్క్‌ల హవా నిన్నమొన్నటి దాకా సాగింది. ఇప్పుడు వెంకటగిరి, నారాయణపేట గద్వాల పట్టుదే ట్రెండ్ అంతా. ఒకప్పుడు అమ్మా, అమ్మమ్మలు ఎంచుకున్న ఈ తరం అమ్మాయిలూ ఎంతో ఇష్టంగా కట్టుకుంటున్నారు. ఆధునికంగా తయారవుతున్నారు. తేలిగ్గానూ ఉండటం వల్ల ఎంతో సౌకర్యంగానూ ఉంటున్నాయి. పూజ చేసినప్పుడూ, పేరంటానికి వెళ్లినప్పుడూ అనువుగా ఉంటాయి. జరీ అంచుల ధగధగలు శ్రావణ శోభ కళ్లకు కట్టేస్తాయి. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని.









# బెల్లం వెన్న పొంగనాలు



**కావాల్సినవి :** దోశ పిండి, కొబ్బరి, బెల్లం, క్యారెట్ తురుము-కప్పు చొప్పున, నెయ్యి-నాలుగు చెంచాలు, వెన్న-కప్పు, కాజు, బాదం, పిస్తా ముక్కలు-పావు కప్పు.

**తయారీ:** పెద్ద గిన్నెలో దోశ పిండి, కొబ్బరి, క్యారెట్ తురుము, వెన్న, ఎండు ఫలాల ముక్కలు వేసి బాగా కలపాలి. పొయ్యి వెలిగించి గిన్నె పెట్టి బెల్లం వేసి, తగినన్ని నీళ్లు పోసి తీగ పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకాన్ని దోశ పిండిలో పోసి చక్కగా కలపాలి. పొంగనాల పెనంలో కాస్తంత నెయ్యి రాసి ఈ పిండిని పొంగనాల్లా వేసుకోవాలి. కొద్ది కొద్దిగా నెయ్యి వేస్తూ రెండు వైపులా చక్కగా కాల్చుకోవాలి. అంతే రుచికరమైన తియ్యతియ్యని బెల్లం వెన్న పొంగనాలు రెడీ. □

# గట్ హెల్త్..

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

గట్ అనే పదం **జీర్ణశయాంతర** వ్యవస్థని సూచిస్తుంది. చిన్న ప్రేవుల గోడలు, పెద్ద ప్రేవుల జిగురు పొరలలో 40 నట్రిలియన్ల సూక్ష్మజీవులుంటాయి. వీటినే గట్ మైక్రోబ్స్ లేదా మైక్రోబయోమ్ అని అంటారు. ఇవిగట్ గోడని బలపరుస్తాయి. దీన్నే గట్‌ఫ్లోరా అంటారు. ఇది కాంప్లెక్స్ ప్రాసెస్. ఇది మొత్తం ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వీటిలో 200 రకాల బాక్టీరియా, వైరస్, ఫంగై సూక్ష్మజీవుల్ని మంచి బాక్టీరియాగా వ్యవహరిస్తారు అలాగే ఇవి అనేక జీర్ణకోశ సమస్యల్ని కల్గించే చెడు బాక్టీరియాని నిరోధిస్తాయి. గట్ హెల్త్ గుండె, మెదడు, నిద్ర, మానసిక ఆరోగ్యం, జీర్ణకోశ ఇమ్యూనిటీ, ఆటో ఇమ్యూనిటీ, జెనిటిక్స్, ఎన్విరాన్‌మెంట్స్, ఆహారం, ఎక్సర్‌సైజ్, లైఫ్ స్టయిల్ అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. గట్‌హెల్త్ కడుపులో సరైన ఆసిడ్స్‌ని ఉత్పత్తి చేసి ఆహారం జీర్ణం కావడానికి, ప్రేవుల్లో విటమిన్స్, మినరల్స్, నీరు వంటి పోషకాలు గ్రహించడానికి, వ్యర్థాల్ని మలం ద్వారా విసర్జించడానికి ఉపయోగపడుతుంది. గట్‌లో 70% ఇమ్యూన్ కణాలుండి ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ని తగ్గస్తుంది. చెడు బాక్టీరియా ఎక్కువ కాకుండా గట్‌హెల్త్‌ని కాపాడుతుంది. గట్ ఫ్లోరా ఇన్ఫెక్షన్స్ రాకుండా తగిన ఆంటిజెన్స్, కెమికల్స్‌ని విడుదల చేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. హార్మోన్స్ రెగ్యూలేషన్ ద్వారా (డీపమైన్, సెరటోనిక్) మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుంది. శరీర బరువుని నియంత్రిస్తుంది. గట్‌లో 100 మిలియన్ల నరాల కణాలుండి న్యూరోట్రాన్స్‌మీటర్స్ ద్వారా, హార్మోన్ల ద్వారా మెదడుతో లింక్ ఉండి కమ్యూనికేట్ చేస్తుంది. హైపోథాలమస్, పిట్యూటరీ, ఆడ్రినాలిన్ గ్రంథులతో కూడా లింక్ కల్గి ఉంటుంది. దీన్నే హెచ్‌పిఎ ఆక్సిస్, గట్‌బ్రెయిన్ ఆక్సిస్ అంటారు. అందుకే గట్ హెల్త్‌నే రెండవ బ్రెయిన్‌గా అభివర్ణిస్తారు. ఇది విటమిన్ కె. ఐరన్, ఫ్యాటీ ఆమ్లాల ఉత్పత్తికి సాయపడతాయి. ఎక్కువగా ఉపవాసాలుండే వారిలో గట్ బాక్టీరియా తగ్గి కోలోరెక్టల్ కేన్సర్ వస్తుంది.

ఆంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, దీర్ఘకాలిక వ్యాధులకి వాడే మందులు, వల్ల డెర్మటైటిస్, సోరియాసిస్ వంటి చర్మవ్యాధు లొస్తాయి. నిద్రలేమి స్ట్రెస్, ఆంగ్జైటీ డిప్రెషన్, ఆల్కహాల్, సిగరెట్స్ త్రాగడం, కిళ్ళీలు, గంజాయి, డ్రగ్స్‌వాడకం వల్ల, సరైన వ్యాయామం లేకపోవడం, పాలు, పెరుగుపండ్లు వంటి పోషకాహారం తీసుకోకపోవడం జింక్‌ఫుడ్, ప్రాసెస్ట్ ఫుడ్, క్రొవ్వు పదార్థాలు, చక్కెరలు, శాక్రిన్, ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహార పదార్థాల్ని ఎక్కువగా తినడం వల్ల, కూల్‌డ్రింక్స్, తీపి పదార్థాలు ఎక్కువగా ఫైబర్ తక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల, వత్తిడి వల్ల గట్ హెల్త్ దెబ్బతిని ఆటోఇమ్యూన్ వ్యాధులు, వినాళ గ్రంధులవ్యాధులు, కార్డియో వాస్కులాల్ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు, కేన్సర్స్, పార్కిన్‌సన్ డిసీజ్, ఆల్జీమర్స్ డిసీజ్ ఆటిజమ్, నరాల బలహీనత, వంటి నరాల జబ్బులు, మానసిక వ్యాధులు, బరువు పెరగడం వల్ల స్థూలకాయం, డయాబెటిస్, కోలీసిస్టయిటిస్, గాల్‌స్టోన్స్, ఫిషర్స్, మొలలు ఫుడ్ ఎలర్జీ, లాక్టోజ్ ఇంటాలారెన్స్, హార్మోన్ల ఇంబాలెన్స్, రుమాటాయిడ్ ఆర్థ్రయిటిస్, గేట్ వంటి కీళ్లవ్యాధులు, చర్మవ్యాధులు గట్ హెల్త్ డామేజ్ కావడం వల్ల , ప్రేవుల్లో కదలికలు తగ్గడం వల్ల, ఇన్ఫెక్షన్స్ వల్ల, మంచి బాక్టీరియా తగ్గడం వల్ల, గట్ ఫ్లోరా దెబ్బతినడం వల్ల వస్తాయి.

**గట్ హెల్త్ దెబ్బతినడం వల్ల కలిగే వ్యాధి లక్షణాలు :** గ్యాస్ ట్రబుల్, పొట్ట ఉబ్బరం, మలబద్ధకం, విరేచనాలు, గుండెలో మంట, జీర్ణశక్తి మందగించడం, ఆసిడ్ రిఫ్లెక్స్, వ్యర్థాల్ని సరిగా బైటికి పంపలేకపోవడం, వికారం, కడుపునొప్పి, వాంతులు, నిరసం, అనీజీ, బరువు తగ్గడం, అలసట, చర్మంపై ఇరిటేషన్, రెక్టల్ ప్రొలాప్స్, మొలలు, ఫిషర్, దుర్వాసనతో మల విసర్జన, నోరుదుర్వాసన వంటి లక్షణాలు ఏర్పడతాయి.

**రిస్క్ :** ట్రావెలర్స్, తరుచు విదేశీ ప్రయాణాలు చేసేవారిలో, వలస వెళ్ళేవారిలో ఆంటిబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్, మందులు ఎక్కువగా వారిలో, ఫుడీపియజనింగ్, పోత పాలు త్రాగే వారిలో, ఫుడ్ ఎలర్జీ ఉన్నవారిలో గట్ హెల్త్ సరిగా ఉండక రిస్క్ ఎక్కువగా కన్పిస్తుంది.

**నిర్ధారణ :** ఎండోస్కోపీ, కొలనోస్కోపసీ, రక్త, మల పరీక్షలు, విజువల్ ఇన్‌స్పెక్షన్, బీట్‌టెస్ట్, లాక్టోలోజ్ బ్రీత్ టెస్ట్, స్కానింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. □

# ఈ దిండుతో గురకకి చెక్ !

మెనోపాజ్ **వల్ల చాలామందికి చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చేస్తుంది.** దీనికి తోడు భాగస్వామి గానీ లేదా ఇంట్లో పెద్దవాళ్లుగానీ అదే పనిగా గురక పెడుతుంటే నిద్ర సంగతి దేవుడెరుగు.. ఆ శబ్దం చిర్రెత్తిస్తుంది. అందుకేనేమో ఈ మధ్య గురకని తగ్గించేందుకు మార్కెట్లోకి కొత్త ఉత్పత్తులు చాలానే వస్తున్నాయి. వాటిల్లో ఒకటి హూతీ యాక్టివ్ పిల్లో. ఇది గురక రావడానినన ముందే గుర్తించి, నిద్ర లోంచి లేవ కుండానే తల పొజిషన్‌ను మార్చి శ్వాస సరిగ్గా అందేలా చేయడం ద్వారా గురకని నియంత్రిస్తుందట. అదెలా అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే ఇది ఏఐపిల్లో. 'దనెక్స్ట్ జనరేషన్ యాంటీ స్నోర్-పిల్లో' అనీ అంటున్నారు. చూడ్డానికి అచ్చం మెమరీ ఫోమ్ దిండులానే ఉంటుంది. ఈ దిండులోని సెన్సర్లు.. బోన్ కండక్షన్ టెక్నాలజీ సాయంతో గురక రాకని గుర్తించి.. బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని ఆప్‌ను అలర్ట్ చేస్తాయి. అది కాస్తా గురక తీవ్రతనీ శ్వాస, గుండె వేగాల్నీ లెక్కించి.. ఆ వ్యక్తికి మెలకువ రాకుండానే దిండులో వైబ్రేషన్స్ వచ్చేలా చేసి తలను కదిలించేలా చేస్తుంది. తద్వారా గురకను అరికడుతుందట. మరో రెండు నెలల్లో మార్కెట్‌లోకి రానున్న ఇది గురక బాధితులకి గొప్ప వరమే మరి! □



# ఆదిత్య హృదయం

ఆధ్యాత్మికం




**రామ రావణ** యుద్ధం భీకరంగా జరుగుతోంది. రాముడు రావణుడి శిరస్సులు ఖండిస్తుండగా ఓ తల కిందపడగానే ఆ స్థానంలో మరో తల మొలుస్తోంది. అప్పుడిక ఆదిత్య హృదయం జపించి విల్లెక్కుపెట్టి బాణాలు వదిలాడు. రావణుడు పడిపోయాడు. రామరావణ యుద్ధ సన్నివేశమిది. అరునాచలంలో శేషాద్రి స్వామి అవదూత దీన్ని గురించి ఓ నిగూఢ అర్థం తెలియజేశారు. కామక్రోధాలు రాక్షసుల వంటివి. రాక్షసులు నిశాచరులు. చీకటిలోనే కామ క్రోధాలు విజృంభిస్తాయి. వ్యక్తిలో అలాంటి గుణాలు ఉన్నంత వరకు ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలను లోబరచుకోవడం సాధ్యం కాదు. జ్ఞానజ్యోతి కాంతులను వెదజల్లినప్పుడే అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. కామక్రోధాలూ, రాక్షసత్వం నశిస్తాయి. అటుపై ఇంద్రియాలు విషయతపన లేక అణగారిపోతాయి. రావణుడు కామక్రోధాలు మూర్తీభవించిన నిండు విగ్రహం. నిశాచరుల నియంత. అతడిపది తలలూ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలకు నిదర్శనం. శ్రీ రామచంద్రుడు తలలన్నింటినీ ఛేదించినా రావణుడు జీవించే ఉన్నాడంటే అతడిలో కామక్రోధాలు నశించ లేదని అర్థం. ఆదిత్యహృదయ పఠనంతో ఆ ప్రదేశమంతా వెలుగు నిండి పోయింది. అంధకారం అంతరించి పోయింది. కామక్రోధాలు అదృశ్యమయ్యాయి. అని విపులీకరించారు అవదూత స్వామి. ఆదిత్య హృదయానికి అసాధ్యమైంది ఏదీ లేదన్నారు మహర్షులు. □

# యాపిల్ తింటున్నారా..

**రోజూ ఒక యాపిల్** తింటే డాక్టర్‌తో పని ఉండదని చిన్నప్పటి నుంచీ వింటున్నాం కదా! ఇంతకీ ఇందులో ఉన్న సుగుణాలేంటో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో చూద్దామా.. కెలోరీలు, పిఈచు, సి-విటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. మలబద్ధక సమస్యను నివారిస్తుంది. ఇది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. అగ్నాశయానికి (పాంక్రియాజ్) మంచిది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంట, తాపం, బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి పోషకాలతో దండిగా ఉంటుది కాబట్టి త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవారికి యాపిల్ మంచిది. అమెరికాలో 40 వేలమంది మీద జరిపిన పరిశోధనలో యాపిల్స్ తినేవారిలో గుండెజబ్బులు వచ్చే అవకాశం చాలా తక్కువని తేలింది. టైప్ 2 డయాబెటిస్, రక్తంలో చక్కెరలను నియంత్రిస్తుంది. సైనస్ ఉబ్బసం తదితర శ్వాస ఇబ్బందులను నివారిస్తుంది. క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది త్వరగా జీర్ణమవుతుంది కనుక వృద్ధులకు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కూడా మంచిది. మనలో చాలామంది యాపిల్ చెక్కు తీసి తినడానికి ఇష్టపడతాం. నిజానికి అందులో యాంటీ ఆక్సిడెంట్లు విస్తారంగాఉన్నాయి కాబట్టి తీయకుండానే తినాలని చెబుతున్నారు ఆహార నిపుణులు. యాపిల్ ఎలా తిన్నా రుచిగానే ఉంటుంది. □






**KYC స్టేటస్ పరీక్షించేందుకు సులువైన అంచెలు:**

1. మీ మ్యూచువల్ ఫండ్ యొక్క వెబ్‌సైట్‌ని లేదా mutualfundssahihai.comని సందర్శించండి
2. ‘KYC స్టేటస్’ లింకుకై చూడండి
3. మీ పెర్మనెంట్ అకౌంట్ నెంబర్ (PAN) వేయండి
4. మీ ‘KYC స్టేటస్’ చూపబడుతుంది

సందర్శించండి: mutualfundssahihai.com

మమ్మల్ని ఫాలో కండి:

‘కెవైసి స్టేటస్’
చెక్ చేసేందుకై
స్కాన్ చెయ్యండి

MUTUAL FUNDS
నిజమే మరి

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని సంక్షోభాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌నీ జాగ్రత్తగా చదవండి.

Printed and Published by Gireesh Sanghi, CMD, and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. 12, 13A, 13B & 13C Jadcherla Mandal & Village, Mahabubnagar Dist. RNI No. APTEL/2002/9021, Editor: *Damerla Sai Baba, * responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-11